ఆంధ్రభూమి
www.andhrabhoomi.net

సంపుటి: 29 . సంచిక: 225 | విజయవాడ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రి, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | ఆదివారం 14 జనవరి, 2018 | 20 పేజీలు (అదనంగా 16 పేజీల ఆదివారం అనుబంధం ఉచితం) | ధర: ₹3.00

శుభోదయం

కలియుగం - 5119
శాలివాహన శకం - 1939

శ్రీ చాంద్రమాన హేమలంబ నామ సం। దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్యమాసం, కృష్ణపక్షం; తిథి: త్రయోదశి రా.2.32; నక్షత్రం: జ్యేష్ఠ మ.2.02; వర్జ్యం: లేదు
విశేషాలు: మకర సంక్రమణము, భోగి
దుర్ముహూర్తం: సా.04.24 నుండి 05.12 వరకు;
రాహుకాలం: సా.4.30 నుండి 6.00 వరకు

పడవ బోల్తా

- నలుగురు విద్యార్థుల దుర్మరణం
- మహారాష్ట్రలో దుర్ఘటన

ముంబయి, జనవరి 13: మహారాష్ట్రలోని దహాను నదిలో శనివారం స్కూలు పిల్లలతో వెళుతున్న ఓ పడవ బోల్తా పడడంతో నలుగురు మరణించారు. అరేబియా సముద్ర సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో 32 మంది పిల్లలను రక్షించగలిగినట్టు జిల్లా కలెక్టర్ ప్రశాంత్ నార్నావారే తెలిపారు. దహాను తీరం సమీపంలో శనివారం ఉదయం ఈ ప్రమాదం జరిగిందని, దుర్ఘటన జరిగిన సమయంలో పడవలో 40 మంది పిల్లలు ఉన్నారని తెలిపారు. యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టామని, 32 మంది సురక్షితంగా బయటకు తీసుకురాగలిగామన్నారు. పర్నాకా బీచ్ నుంచి ఈ పడవ బయలుదేరిందని, తీరం నుంచి రెండు నాటికల్ మైల్స్ వచ్చిన తర్వాత ఈ దుర్ఘటన జరిగిందన్నారు. గల్లంతయిన మిగిలిన వారికోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మితిమీరిన సంఖ్యలో ఈ పడవలో విద్యార్థులను ఎక్కించడం వల్లే అది బోల్తాపడినట్లు తాజా కథనాలను బట్టి తెలుస్తోంది. సహాయక చర్యల్లో భాగంగా మూడు నౌకల్ని, రెండు విమానాలను రంగంలోకి దింపారు.

రాజీకి రంగం సిద్ధం

చీఫ్ జస్టిస్‌తో నృపేంద్ర మిశ్రా ముఖాముఖీ

- అటార్నీ, సీనియర్ అధికారుల తెరవెనుక ప్రయత్నాలు
- రేపే సంక్షోభం కొలిక్కి?



ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 13: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాకు నలుగురు సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ చలమేశ్వర్, జస్టిస్ కురియన్ జోసెఫ్, జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ మదన్ లోకుర్‌ల మధ్య రాజీ కుదిర్చేందుకు తెరవెనక చర్చలు ప్రారంభమయ్యాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సలహా మేరకు అటార్నీ జనరల్ కె.కె.వేణుగోపాల్, ప్రధాన మంత్రి ముఖ్య కార్యదర్శి నృపేంద్ర మిశ్రా మరికొందరు సీనియర్ అధికారులు, న్యాయవాదులు ఇరుపక్షాలతో తెరవెనక చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది. నరేంద్ర మోదీ సలహా మేరకు నృపేంద్ర మిశ్రా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నివాసానికి వెళ్లి ముఖాముఖి చర్చలు జరిపారు. మరోవైపు అటార్నీ జనరల్ వేణుగోపాల్ మరికొందరు సీనియర్ న్యాయాధికారులు నలుగురు సీనియర్ న్యాయమూర్తులతో చర్చల ప్రక్రియ ప్రారంభించినట్లు చెబుతున్నారు. సీజే దీపక్ మిశ్రాపై తిరుగుబాటు జెండా ఎగురువేసిన నలుగురు సీనియర్ న్యాయమూర్తులలో ముగ్గురు ప్రస్తుతం దేశ రాజధాని ఢిల్లీలో లేరు. వారు దేశ రాజధానికి తిరిగి రాగానే సీజే దీపక్ మిశ్రాతో ముఖాముఖీ

- మిగతా 7వ పేజీలో

విభేదాల నివృత్తికి ఫుల్ బెంచ్

సుప్రీం బార్ కౌన్సిల్ తీర్మానం

న్యూఢిల్లీ, జనవరి 13: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాతో నలుగురు సీనియర్ న్యాయమూర్తులకు తీవ్రస్థాయిలో విభేదాలు తలెత్తడం పట్ల బార్ కౌన్సిల్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సర్వోన్నత న్యాయస్థానం పూర్తి బెంచ్ ఈ అంశాన్ని తక్షణ ప్రాతిపదికన చేపట్టాలని సుప్రీం కోర్టు బార్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ శనివారం నిర్వహించిన అత్యవసర సమావేశంలో స్పష్టం చేసింది. అలాగే అన్ని ప్రజాహిత

- మిగతా 7వ పేజీలో



జోహో సాఫ్ట్‌వేర్ సంస్థ ప్రారంభం సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ఇక ఆంధ్ర వ్యాలీ

- ఐటీ చూపు ఏపీ వైపే
- 2029నాటికి మనమే మేటి
- జోహో కార్పొరేషన్‌తో నాంది పలకాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు

రేణిగుంట, జనవరి 13: రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు అయ్యే ఐటి రంగాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలుపుతానని, 2029 నాటికి ఆ లక్ష్యాన్ని నెరవేరుస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రూ.350 కోట్లతో రేణిగుంట-శ్రీకాళహస్తి మార్గంలో 150 మంది ఉద్యోగులతో ఏర్పాటు చేసిన జోహో సాఫ్ట్‌వేర్ సంస్థ శనివారం నాడిక్కడ ప్రారంభించిన సందర్భంగా మాట్లాడిన చంద్రబాబు

- మిగతా 7వ పేజీలో

కూలిన ఓఎన్‌జీసీ హెలికాప్టర్

- ఏడుగురు గల్లంతు
- మూడు మృతదేహాలు లభ్యం

ముంబయి, జనవరి 13: దేశ వాణిజ్య రాజధాని ముంబయి తీరాన సముద్రంలో శనివారం ఉదయం ఓ హెలీకాప్టర్ కుప్పకూలిపోయింది. ఐదుగురు ఓఎన్‌జీసీ ఉద్యోగులు, ఇద్దరు పైలెట్లు ప్రయాణిస్తున్నారు. మూడు మృతదేహాలు లభ్యం. పవన్ హాన్స్ సంస్థకు చెందిన హెలీకాప్టర్ దౌఫిన్ ఎన్-3 జూహూ ఎయిర్‌డ్రోమ్ నుంచి టేకాఫ్ తీసుకున్న తరువాత ఏటీసీతో సంబంధాలు తెగిపోయాయి. హెలీకాప్టర్ 11 గంటలకు బాంబే హై రిగ్గుకు చేరుకోవల్సి ఉండగా కుప్పకూలిపోయిందని కోస్ట్‌గార్డ్ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. మూడు మృతదేహాలను లభ్యమయ్యాయని ఆయన అన్నారు. మొత్తం హెలీకాప్టర్‌లో ఐదుగురు ఓఎన్‌జీసీ ఉద్యోగులు, ఇద్దరు పైలెట్లు ఉన్నట్టు ఆయన తెలిపారు. మూడు మృతదేహాలను నేవీ నౌకలు కనుగొన్నాయని కోస్ట్‌గార్డ్ ప్రకటించింది. మిస్సయిన హెలీకాప్టర్ ఆచూకీ కోసం అటుగా రావల్సిన నౌకలను దారిమళ్లించినట్టు అధికార ప్రతినిధి చెప్పారు. పవన్‌హాన్స్ హెలీకాప్టర్ ప్రమాదంపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించినట్టు డీజీసీఏ సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నారు. ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో(ఏఏఐబీ)తో దర్యాప్తు చేయనుంది. ఏఏఐబీ పౌరవిమానయాన మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తోంది. ఏఏఐబీ దర్యాప్తునకు డీజీసీఏ సహకరిస్తుందనని ఆ ప్రతినిధి వెల్లడించారు. ఇది ప్రమాదావశాత్తూ జరిగిన విషాదమేనని ఆయన అన్నారు. కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి జయంత్ సిన్హా ఈ ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే ఇండియా కోస్ట్‌గార్డ్ నౌకను సంఘటనా స్థలానికి చేరుకుంది. శకలాలు గుర్తించింది. పన్నెండున్న గంటల ప్రాంతంలో మృతదేహాన్ని వెలికి తీసింది. ఇప్పటికి మూడు మృతదేహాలు లభ్యమయ్యాని, మిగతావారి కోసం ముమ్మరంగా గాలిస్తున్నట్టు తెలిపారు.

ఆరోపణలు అవాస్తవం

హెచ్‌సీఏలో సభ్యత్వం ఉంది
మాజీ క్రికెటర్ అజరుద్దీన్ స్పష్టీకరణ



5



హనుమాన్ జంక్షన్ వద్ద బారులుతీరిన వాహనాలు

రోడ్లకు సంక్రాంతి శోభ!

- వాహనాలతో జాతీయరహదారులు కిటకిట
- విమాన టిక్కెట్ల ధరలకు రెక్కలు

విజయవాడ (బెంజిసర్కిల్), జనవరి 13: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని నగర వాసులు పల్లె బాట పట్టడంతో ప్రధాన రహదారుల్లో సంక్రాంతి శోభ కనిపిస్తోంది. బస్సులు, రైళ్లు, కార్లు పండుగ ప్రయాణం కోసం ఒక్కసారిగా రోడ్డెక్కడంతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. ఫలితంగా జాతీయ రహదారుల్లో ఏర్పాటు చేసిన టోల్ ప్లాజాల వద్ద వందలకొద్దీ వాహనాలు బారులుతీరాయి. ప్రయాణికుల అవసరాన్ని గుర్తించిన ఆర్టీసీ, ప్రైవేట్ ఆపరేటర్లు టికెట్ల ధరలను ఎవరికి తోచిన విధంగా వారు పెంచుకుని ప్రయాణికుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. మేము మాత్రం తక్కువా ఏంటి అంటూ విమానాల టిక్కెట్ల ధరలూ రెండింతలయ్యాయి. ఆకాశమే హద్దుగా విమాన టిక్కెట్ల ధరకు రెక్కలొచ్చాయి. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు వరుస సెలవులు రావడంతో ప్రజలు సొంత ఊళ్లకు పండుగ కోసం జనాలు తరలివచ్చారు... వస్తున్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైళ్లు, బస్సులు అదనంగా నడుపుతున్నప్పటికీ అవి ప్రయాణికుల అవసరాలు తీర్చలేకపోతున్నాయి. ఎలాగైనా సొంతూరికి పోవాల్సిందే... పండగ సంబరాలు ఊళ్లో చేసుకోవాల్సిందేన్న ప్రజల దృఢ సంకల్పం వారి ప్రయాణానికి సమాయత్తం చేసింది. రైళ్లు, బస్సుల్లో టిక్కెట్లు దొరకని వారు సొంత వాహనాలు సమకూర్చుకుని ఊరికి ప్రయాణమవడంతో ట్రాఫిక్ రద్దీకి కారణమయింది. హైదరాబాద్ - విజయవాడ, విజయవాడ - విశాఖ జాతీయ రహదారిలో వాహనాల రద్దీ ఊహకు అందని విధంగా ఉంది. శుక్రవారం నుండి ప్రారంభమైయిన ఈ రద్దీ శనివారం ఉదయానికి మరింత పెరిగి టోల్ ప్లాజాల వద్ద 3 కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయే స్థితికి వచ్చాయి. ఇదే పరిస్థితి హైదరాబాద్ హైవేపై ఉన్న నాలుగు టోల్ ప్లాజాల వద్ద శనివారం కనిపించింది. టోల్ ప్లాజాతో పాటు జాతీయ రహదారిపై వాహనాల రద్దీని నియంత్రించేందుకు ఏపీ పోలీసులు శ్రమిస్తూనే ఉన్నారు. ముఖ్యంగా కేసర టోల్ ప్లాజా వద్ద ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ముందస్తు ప్రణాళికగా నందిగామ రూరల్ సిఐ నరసింహమూర్తి అప్రమత్తమై, కంచికచర్ల జాతీయ రహదారిపై సుమారు 18 కిలోమీటర్ల పొడవునా సిబ్బందిని నియమించి, ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో వాహనదారులను అప్రమత్తం చేశారు. పొగమంచు కురుస్తున్నప్పటికీ చలిలోనే తెల్లవారుఝాము వరకు పహారా కాసారు.

సంక్రాంతి సందర్భంగా సొంత ఊళ్లకు వెళ్లాలని భావించే ప్రయాణికులను దోచుకునే ఆర్టీసీ, ప్రైవేటు ట్రావెల్స్‌కు తామేమీ తక్కువ కాదన్నట్టు విమానయాన సంస్థలూ అదే బాట పట్టాయి. ముఖ్యంగా గన్నవరం విమానాశ్రయం నుండి హైదరాబాద్, రాజమండ్రి, తిరుపతి, వైజాగ్ వెళ్లే ప్రయాణికుల నుండి మునుపెన్నడూ లేని విధంగా ఛార్జీలను వసూలు చేస్తున్నాయి. బస్సులు, రైళ్లలో టికెట్లు దొరకని ప్రయాణికులు విమానాలను ఆశ్రయిస్తుంటే వారికి టిక్కెట్ల ధర చూసి నివ్వెరపోతున్నారు. అయినప్పటికీ గన్నవరం విమానాశ్రయంలోని టిక్కెట్ల కౌంటర్ల విపరీతమైన రద్దీ కనిపించింది. హైదరాబాద్‌తో పాటు విశాఖ వెళ్లే ప్రయాణికుల నుండి 13 వేల రూపాయల పైనే విమానయాన సంస్థలు వసూలు చేస్తున్నాయి. గతంలో సమైఖ్యాంధ్ర ఉద్యమ సమయంలో హైదరాబాద్ టిక్కట్ల ధర గరిష్టంగా పది వేలు పలకగా, ఇప్పుడు 13 వేల రూపాయల పైనే కనిపిస్తోంది. అయిననూ పోయి రావలె సొంతూరికి సంకల్పం ముందు ఖర్చుకు వెరవకుండా ప్రయాణమవుతున్నారు.



రోడ్ల నిర్మాణంలో జాప్యంపై అధికారులను ప్రశ్నిస్తున్న లక్ష్మీపార్థసారథి

నిర్ణీత గడువులోగా రహదార్ల పూర్తి

ఏడీసీ సీఎండీ లక్ష్మీపార్థసారథి ఆదేశం

ఆంధ్రభూమి బ్యూరో

అమరావతి, జనవరి 13: రాజధాని అమరావతిలో జరుగుతున్న రహదార్ల నిర్మాణాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, గుత్తేదారులు పనుల్లో మరింత వేగం పెంచాలని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) సీఎండీ డీ లక్ష్మీపార్థసారథి ఆదేశించారు. ప్యాకేజీ - 13లో జరుగుతున్న రహదార్ల నిర్మాణాలను శనివారం ఆమె పరిశీలించారు. కృష్ణాయపాలెం నుంచి నెక్కల్లు వరకు 14 కిలోమీటర్ల దూరంలో ఈ - 8 రహదారి నిర్మాణాన్ని పరిశీలించిన ఆమె పనులు మందకొడిగా జరుగుతుండడాన్ని గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ రోడ్డు వెంబడి విట్, అమరావతి సెంట్రల్ పార్క్ నిర్మాణాలు జరుగుతున్నందున దానికి ప్రామాణికంగా తీసుకొని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కృష్ణా కరకట్ట నుంచి నిడమర్రు వరకు నిర్మిస్తున్న ఎన్ - 10, తాళ్లాయపాలెం నుంచి నిడమర్రు వరకు నిర్మాణంలో ఉన్న ఎన్ - 8 రహదార్లు, వాటి మధ్యలో జరుగుతున్న పలు ప్రధాన వంతెనల నిర్మాణాలకు ఏర్పడుతున్న ఆటంకాలను గుత్తేదారులను అడిగి తెలుసుకున్నారు. వాటి నిర్మాణాలకు ఎక్కడా ఇబ్బందులు లేనందున పనులు ఎందుకు ఆలస్యం అవుతున్నాయని గుత్తేదారులు, అధికారులను ప్రశ్నించారు. ఫిబ్రవరి లోపుగా రహదార్ల నిర్మాణాలు నూరు శాతం పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మొదుగుల్లంకపాలెం, ఐనవోలు తదితర గ్రామాల్లో పర్యటించి ప్రాధాన్య రహదార్ల నిర్మాణాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో ఏడీసీ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎంవీ సూర్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహమూర్తి, డీఈఈలు వీరనారాయణ, ఎలెన్గోవను తదితరులు ఉన్నారు.

ప్రముఖుల సంక్రాంతి శుభాకాంక్షలు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 13: సంక్రాంతి సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ మంత్రి లోకేష్, వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, జనసేన అధ్యక్షుడు పవన్ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మంత్రి కళా వెంకట్రావు, మంత్రులు కాలువ శ్రీనివాసులు, యనమల రామకృష్ణుడు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, శిద్దా రాఘవరావు, పితాని సత్యనారాయణ, నారాయణ, పరిటాల సునీత, దేవినేని ఉమామహేశ్వరరావు, నక్కా ఆనందబాబు, టీడీపీ జాతీయ కార్యాలయ కార్యదర్శి టిడి జనార్ధన్, ఎమ్మెల్సీ పివి చౌదరి, ఎవి రమణ తదితరులు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కాగా పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

సంక్రాంతి తర్వాత పదవుల పండుగ?

నామినేటెడ్ పదవులపై టీడీపీ నాయకత్వం దృష్టి ❖ రెడ్డి వర్గానికి యువత, కమ్మ వర్గానికి మహిళ బాధ్యతలు?

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 13: తెలుగు దేశం పార్టీ నేతలు ఎదురుచూస్తున్న పదవుల పందేరం సంక్రాంతి తర్వాత ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. దానికి సంబంధించి కసరత్తు మొదలయినట్లు తెలుస్తోంది. ప్రతిష్ఠాత్మక టీటీడీ, ఆర్టీసీ సహా డజను కార్పొరేషన్ల పదవీకాలం ముగిసి నెలలు కావస్తున్నప్పటికీ, ఇప్పటివరకూ వాటిని భర్తీ చేయకపోవడంపై నేతల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. దానికి తెరదించేందుకు పార్టీ నాయకత్వం కసరత్తు ప్రారంభించినట్లు సమాచారం.

మరో ఏడాది ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఖాళీగా ఉన్న నామినేటెడ్ పదవులపై తమ్ముళ్ల ఆశలు పెరిగిపోతున్నాయి. గతంలో తొమ్మిదేళ్ల అధికారంలో ఉన్నపుడు కూడా అనేక కార్పొరేషన్లు ఖాళీగానే ఉండిపోయిన క్రమంలో, అధికారులే పెత్తనం చేసిన విషయాన్ని నేతలు గుర్తు చేస్తున్నారు. కార్పొరేషన్ పదవుల కోసం ఆర్టీసీ నుంచి, ద్వితీయ శ్రేణి నేతలు చాలా కాలం నుంచి ఎదురుచూస్తున్నారు. పదవీకాలం పూర్తయిన వెంటనే వాటిని భర్తీ చేసే సంప్రదాయం తమ పార్టీలో ఎప్పుడూ ఉండటం లేదని, అది కొందరు వ్యక్తులకే పరిమితం అవడం విచారకరమని పార్టీ సీనియర్లు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే, ఎన్నికలు మరో ఏడాది మాత్రమే ఉండటంతో, ఇప్పుడు అవి తీసుకునే కంటే తన నియోజకవర్గాల్లో దృష్టి సారించి ఎమ్మెల్యే సీటుకు ప్రయత్నించడమే మంచిదన్న అభిప్రాయం మరికొందరు సీనియర్లలో ఉంది. ఈ నేపథ్యంలో సంక్రాంతి తర్వాత కీలకమైన కార్పొరేషన్ల భర్తీ చేయాలని నాయకత్వం భావిస్తోంది.

ఇదిలాఉండగా, పార్టీలో కీలకమైన అనుబంధసంస్థల అధ్యక్షులు, కార్యవర్గాలను ఇప్పటివరకూ ప్రకటించని వైనంపైనా పార్టీలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. కీలకమైన తెలుగు యువత, తెలుగుమహిళ అధ్యక్ష పదవులపైనా అందరి దృష్టి ఉంది. తెలుగు యువత అధ్యక్ష పదవి విజయవాడకు చెందిన దేవినేని అవినాష్ పేరు ఒక వర్గానికి చెందిన మీడియాలో బాగా ప్రచారంలో ఉన్నప్పటికీ, కమ్మ సామాజికవర్గానికి ఆ పదవి ఇచ్చే అవకాశం లేదని పార్టీ నాయకులు స్పష్టం చేస్తున్నారు. అయినా పెద్దగా అనుభవం లేని, ఇటీవలే పార్టీలో చేరిన అవినాష్‌కు ఆ పదవి ఇవ్వడం వల్ల చాలా కాలం నుంచి పార్టీకి పనిచేస్తున్న యువనేతల్లో అసంతృప్తి బయలుదేరే ప్రమాదం ఉండటున్నారు. అందువల్ల ముందు ఆయనతోపాటు మంత్రులు, మాజీ మంత్రుల తనయులందరికీ రాజకీయానుభవం కోసం తెలుగుయువతలో ప్రాతినిధ్యం కల్పించే సూచనలున్నాయి.

యువత అధ్యక్ష బాధ్యతను ఈసారి రెడ్డి సామాజికవర్గానికి ఇవ్వాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు. ఆ ప్రకారంగా నెల్లూరు జిల్లాకు చెందిన సీనియర్ మంత్రి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తనయుడైన రాజగోపాల్‌రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గత కొంత కాలం నుంచి ఆయన పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. చిత్తూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి తనయుడు, ఆయన మంత్రిగా ఉన్న సమయంలో చక్రం తిప్పిన సుధీర్‌రెడ్డి పేరు కూడా వినిపిస్తున్నప్పటికీ, ఇప్పటికే చిత్తూరు జిల్లా నుంచి సీఎం, లోకేష్ కూడా ప్రాతినిధ్యం వహిస్తున్నందున మళ్లీ ఆ జిల్లాకే యువత అధ్యక్ష పదవి ఇస్తారా అన్న చర్చ జరుగుతోంది. ఇప్పటికైతే సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికే ఎక్కువ అవకాశాలున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ బీసీలకు ఇవ్వాలనుకుంటే కొప్పుల వెలమకు చెందిన విశాఖ జిల్లా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తనయుడికి అవకాశం దక్కవచ్చు. ఒకవేళ కమ్మకు ఇవ్వాలనుకుంటే రాజ్యసభ ఎంపీ తోట సీతారామలక్ష్మి తనయుడికి ఇవ్వవచ్చంటున్నారు.

ఇక తెలుగుమహిళ అధ్యక్ష పదవికి ఈసారి పెద్దగా పోటీ కనిపించడం లేదు. గత కమిటీలో పనిచేసిన నేతలు, పోటీ పడిన నేతలంతా ప్రస్తుతం రాష్ట్ర కమిటీలో పనిచేస్తుండగా, మరికొందరు సీనియర్లు తెలంగాణ కమిటీల్లో కొనసాగుతుండటమే దీనికి కారణం. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం గుంటూరు జిల్లాకు చెందిన పారిశ్రామికవేత్త సాదినేని యామిని, మిన్నికంటి జయశ్రీ, కృష్ణా జిల్లా మహిళ అధ్యక్షురాలు ఆచంట సునీత పేర్లు ప్రముఖంగా వినిపిస్తోంది. వీరిలో జయశ్రీ, సునీత చాలాకాలం నుంచి పార్టీకి పనిచేస్తున్నారు. అయితే విశాఖ జిల్లా దళిత ఎమ్మెల్యే అనిత పేరు వినిపిస్తున్నప్పటికీ, ఆమెకు ఎన్నికల్లో పనిచేసే సమయం ఉండకపోవడం అనిత కూడా పెద్దగా ఆసక్తిచూపించడం లేదంటున్నారు.

తెలుగుమహిళ అధ్యక్ష పదవి తీసుకునే నేతపై అంగన్‌వాడీ సభ్యత్వాల నమోదు బాధ్యత ఎక్కువగా ఉంటుంది. గతంలో శోభాహైమావతి ఈ బాధ్యతలో విఫలమయ్యారన్న విమర్శలున్నాయి. ఒక్క గుంటూరు జిల్లాలో, అది కూడా వినుకొండలోనే అధికారం సభ్యత్వాలు నమోదయ్యాయి. దానికి జయశ్రీ నాయకత్వం వహించారు. దాదాపు లక్ష 20 వేల ఓటు బ్యాంకు ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తల్లో, సగం శాతమైనా పార్టీకి మళ్లించాలంటే దానికి వారివద్దకు వెళ్లగలిగే చొరవ ఉన్న నేతకే అవసరం. విమర్శలు వైసీపీ నేత రోజాను విమర్శించే వారికే అధ్యక్ష పదవి ఇస్తే బాగుంటుందన్న భావన తప్ప, ప్రతిపక్ష పార్టీల వైపు ఉన్న అంగన్‌వాడీ, ఇతర మహిళా సంఘాలను పార్టీ వైపు మళ్లించే నాయకులకు అధ్యక్ష పదవి ఇవ్వాలన్న దానిపై దృష్టి సారించాలన్న యోచన పార్టీలో కొరవడిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

పట్టిసీమ స్ఫూర్తితో మహా సంగమం: సీఎం

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 13: అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, తెలుగు లోగిళ్లలో ఏడాదంతా ప్రతి రోజూ ఆనందం వెల్లివిరియాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలకు, దేశ, విదేశాల్లోని తెలుగువారికి ఆయన భోగి, మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పేదవాళ్లు కూడా సంతోషంగా పెద్ద పండుగ చేసుకోవాలన్న ఉద్దేశంతోనే ‘చంద్రన్న సంక్రాంతి కానుక’ను పంపిణీ చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. సంక్రాంతి ప్రధానంగా రైతుల పండుగ అని, పంట ఇంటికి చేరిన సందర్భంలో ప్రకృతికి కర్షకులు నివేదించే కృతజ్ఞతల పండుగ అని చంద్రబాబు అభివర్ణించారు. సూర్యుడు దక్షిణాయనం నుంచి ఉత్తరాయణంలోకి ప్రవేశించే పుణ్యకాలమని ముఖ్యమంత్రి అన్నారు. సాగు వ్యయాన్ని తగ్గించడం, ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం, అనుబంధ రంగాలకు ప్రాధాన్యాన్నిస్తూ కోటి ఎకరాల్లో ఉద్యాన పంటలు పండించటం తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇంటికి చేరిన ధాన్య రాశులతో తెలుగు లోగిళ్లు కళకళలాడుతున్నాయని చెప్పారు. పట్టిసీమ ద్వారా మూడేళ్లలో కృష్ణాడెల్టాలో 13లక్షల ఎకరాల్లో రూ.18వేల కోట్ల విలువైన పంట ఇంటికి చేరిందని గుర్తుచేశారు. జీవన సమరంలో ఎక్కడో దూరాన ఉంటూ పెద్ద పండుగ సందర్భాన జన్మభూమికి తరలివచ్చారని, మన కుటుంబ వ్యవస్థ గొప్పదని అన్నారు. ఇటీవల ముగిసిన ఐదో విడత ‘జన్మభూమి-మా ఊరు’ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేసిన ప్రజానీకానికి, అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

వ్యవసాయంలో వృద్ధిరేటు జాతీయ స్థాయిలో 2.5శాతం ఉంటే, ఆంధ్రప్రదేశ్‌లో 20.6 శాతం నమోదవ్వడం విశేషమని, అదీ రాష్ట్రంలో గత ఏడాది 30 శాతం, ఈ సంవత్సరం 12.5 శాతం వర్షపాతం తక్కువగా ఉన్నా ఇలాంటి ఫలితాలు సాధించడం మరింత ఉత్తేజాన్ని అందిస్తోందని తెలిపారు. వ్యవసాయంతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. 45శాతం వృద్ధిరేటుతో ఆంధ్రప్రదేశ్ ఆక్వాహబ్‌గా నిలవడం రాష్ట్రానికి గర్వకారణమని చెప్పారు.

అరకోటి సంఖ్యతో దేశంలో మరే రాష్ట్రంలో ఇవ్వనన్ని సామాజిక భద్రత పెన్షన్లు ఇస్తున్నామని, రైతు సంక్షేమానికి నిబద్ధతతో పనిచేస్తూ దశలవారీగా రూ.24వేల కోట్ల రుణ మాఫీ చేశామని వివరించారు. రాష్ట్రాన్ని కరవు రహిత రాష్ట్రంగా చేస్తామని మూడేళ్లనాడు చెప్పిన మాటల్ని నిజం చేస్తున్నామని, కృష్ణా జలాలతో రాయలసీమలో చెరువులను నింపామని అన్నారు. అనంతపురం జిల్లాలో నిండిన చెరువులను చూస్తే సముద్రాన్ని చూసినంత సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. పట్టిసీమ పథకం విజయస్ఫూర్తితో కృష్ణా-గోదావరి-పెన్నా నదుల అనుసంధానం చేస్తామని, మహా సంగమాన్ని సృష్టిస్తామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

మొక్కుబడిగా మోదీ - బాబు భేటీ

విజయవాడ (బెంజిసర్కిల్), జనవరి 13: రాష్ట్ర ప్రయోజనాలను ఇప్పటికే తాకట్టు పెట్టి చంద్రబాబు, తాజాగా మోదీతో భేటీ అయ్యి రాష్ట్ర ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం మరోసారి చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్ తులసిరెడ్డి విమర్శించారు. మోదీ - బాబు భేటీపై ఎంతో ఆశగా ఎదురు చూసే రాష్ట్ర ప్రజలకు ఈ సారి కూడా వారి ఆశలు అవిరయ్యాయని శనివారం తెలిపారు. రాష్ట్రనికి సంబంధించిన ఒక్క అంశంలో కూడా చంద్రబాబు మోదీ నుండి నిర్ధష్టమైన హామీని పొందలేదని చెప్పారు. భేటీలో మాటలు తప్ప వాస్తవాల్లోకి వచ్చే అంశాలు ఏమీ లేవన్నారు. విభజన చట్టంలోని అంశాలను కూడా చంద్రబాబు సాధించుకోలేక పోతున్నారని తెలిపారు. రెవెన్యూ లోటు విషయంలో ఈ భేటీలోనైనా ప్రభుత్వం విడుదల చేస్తుందని ఎంతో ఆశగా అందరూ ఎదురు చూశారన్న ఆయన మోదీ మరోసారి మొండి చెయి చూపారని తెలిపారు. ఏపీకి వచ్చే హక్కులను బాబు భిక్షాటన చేస్తున్న మోదీ కనికరించక పోవడం దారుణమన్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవానికి భంగం కలిగే విధంగా చంద్రబాబు కూడా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు.

మోదీ వికృత చేష్టల వల్లే న్యాయవ్యవస్థలో సంక్షోభం

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శ

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 13: ప్రధాని నరేంద్రమోదీ వికృత చేష్టలే న్యాయ వ్యవస్థలో సంక్షోభానికి కారణమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. ఈ వ్యవహారానికి మోదీ బాధ్యత వహించాలని, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు చేసిన ఆరోపణలపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం అవినీతి రాజకీయాలకు పాల్పడుతున్నదని అన్నారు. అసలు ప్రధాని కార్యాలయం నుంచే నేరుగా ఈ అవినీతి నడుస్తున్నదని ఆరోపించారు. విజయవాడ దాసరి భవన్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశంలో స్వాతంత్య్రం వచ్చాక న్యాయవ్యవస్థలో సంక్షోభం తలెత్తడం, సుప్రీం కోర్టు న్యాయమూర్తులు బహిరంగంగా చీఫ్ జస్టిస్‌పై ఆరోపణలు చేయడం ఇదే ప్రథమమన్నారు. అనేక అవినీతి కుంభకోణాలు వెలికితీస్తున్నందున న్యాయ వ్యవస్థపై ప్రత్యేక గౌరవం, గురుత్వం ప్రజల్లో ఉన్నదన్నారు. అయితే సుప్రీం న్యాయమూర్తులు జస్టిస్ చలమేశ్వర్ సహా నలుగురు ఏకంగా చీఫ్ జస్టిస్‌పై రాతపూర్వకంగా, మీడియా ద్వారా తమ ధిక్కార స్వరాన్ని వినిపించారన్నారు. అయితే బహిరంగంగా న్యాయమూర్తులు ఆరోపణలు చేయడం, సీపీఐ రాజ్యసభ ఎంపీ డి.రాజా ఇటీవల జస్టిస్ చలమేశ్వర్‌ను కలవడం రాజకీయ ప్రాధాన్యత కలగచేసిందనే విషయాలు వివాదాస్పదంగా మారాయన్నారు. అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి కలిఖోపుల్ 2016లో ఆత్మహత్యకు పాల్పడ్డారని, గిరిజనుడైన ఆయనను లంచం తీసుకోవాలని ఒత్తిడి తేవడమే కాకుండా వేధింపులకు గురి చేయడంతో 62 పేజీల ఉత్తరం రాసి ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తికి ప్రధానమంత్రి కార్యాలయం నుంచి స్వయంగా లంచాలు తీసుకోవాలని ఒత్తిడి చేయడంతో ఈ ఘటన చోటుచేసుకుందని లోకం కోడై కూస్తోందన్నారు. అలాగే ఒడిసాలో వేల కోట్లకు సంబంధించిన మెడికల్ కుంభకోణం కేసును కూడా చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా చొరవతో మొత్తం మార్పించారని తెలిపారు. అలాగే సోహబుదీన్ ఎన్‌కౌంటర్ కేసును చేపట్టిన సీపీఐ స్పెషల్ జడ్జి లోహియా మరణం కూడా మిస్టరీగా మార్చేయడానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా హస్తం ఉందన్నారు. ప్రధాని కార్యాలయం చీఫ్ జస్టిస్‌పై, సుప్రీంకోర్టుపై ఆధిపత్యాన్ని చెలాయిస్తోందనేది నిరూపణ అవుతోందన్నారు.



విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

సీఎం భేటీ వివరాలు పీఎంఓ వెల్లడించాలి: రామకృష్ణ

ప్రధాని నరేంద్రమోదీతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ వివరాలను ప్రధాని కార్యాలయం వెల్లడించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఏడాది కాలం తర్వాత ఎట్టకేలకు మోదీని చంద్రబాబు కలిశారన్నారు. భేటీ తర్వాత విభజన హామీల అమలు కోసం తాను ఏయే అంశాలను కోరారో చంద్రబాబు మీడియాకు చెప్పారే కానీ, ప్రధాని వేటిని అంగీకరించారు, ఏమిస్తామన్నారో వెల్లడించలేదన్నారు. దీనిపై పీఎంఓ నుంచి ఏ విధమైన సమాధానం రాకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రధానంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో నిర్వాసితులకు రూ.32వేల కోట్లను పరిహారంగా చెల్లించాల్సి ఉండగా, దీనిపై మోదీ స్పందన ఏమిటో స్పష్టం కాలేదన్నారు. అలాగే రాష్ట్రంలో కేంద్రం ఏర్పాటు చేయాల్సిన విద్య, వైద్య సంస్థలకు రూ.11,670 కోట్లు అవసరమైతే కేవలం రూ.421 కోట్లను మాత్రమే ఇచ్చారన్నారు. దీనిపై కూడా ప్రధాని ఏమన్నారో సీఎం చెప్పలేదన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న దానికి భిన్నంగా ప్రపంచ బ్యాంకు రుణంతో అమరావతి రాజధాని, నాబార్డు అప్పుతో పోలవరం నిర్మాణం చేపట్టడం సమర్థనీయం కాదన్నారు. ఈ విషయమై సంక్రాంతి తర్వాత ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. మరోసారి కేంద్ర ప్రభుత్వంపై ఉద్యమానికి శ్రీకారం చుడతామని రామకృష్ణ స్పష్టం చేశారు. విలేఖరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవీ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.



గుంటూరులో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధును అరెస్టు చేస్తున్న పోలీసులు

సీపీఎం ‘చలో గొట్టిపాడు’ భగ్నం


- ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణి
- మధు సహా పార్టీ కార్యకర్తల అరెస్టు

ఆంధ్రభూమి బ్యూరో

గుంటూరు, జనవరి 13: గుంటూరు జిల్లా పెదగొట్టిపాడులో ఇటీవల దళితులపై జరిగిన దాడిని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన ‘ఛలో గొట్టిపాడు’ ఆందోళనను పోలీసులు భగ్నం చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి మధుతో సహా వందలాదిమంది కార్యకర్తలను ముందస్తుగా పోలీసులు అరెస్టులు చేశారు. తాడేపల్లి, మంగళగిరి, గుంటూరు, చేబ్రోలు, ప్రత్తిపాడు, నగరంలోని అరండల్ పేట, పట్టాభిపురం తదితర ప్రాంతాల్లో పోలీసులు సీపీఎం కార్యకర్తలను అదుపులోకి తీసుకుని బలవంతంగా వ్యాన్‌లో ఎక్కించి నగర పరిధిలోని స్టేషన్లకు తరలించారు. గత కొద్దిరోజుల క్రితం గొట్టిపాడు గ్రామంలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో పోలీసులు గ్రామంలో కొంత మందిని అరెస్టుచేసి శాంతికమిటీలను ఏర్పాటు చేశారు. అయితే గ్రామంలో అగ్రకుల పెత్తందార్ల దౌర్జన్యంతో దళితులపై దాడిచేశారని ఆరోపిస్తూ పోలీసులు పక్షపాత వైఖరిని అవలంబిస్తున్నారని, దళితులపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలనే డిమాండ్‌తో సీపీఎం ఆందోళనకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంతో పాటు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధుతో పాటు జిల్లా కార్యదర్శి భావన్నారాయణ, ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు భగవాన్ దాస్, యువజన నేతలు నళినీకాంత్, కార్యకర్తలు గొట్టిపాడు బయల్దేరేందుకు ఉపక్రమించారు. దీంతో నగర ఎఎస్పీ వైటి నాయుడు, సౌత్‌జోన్ డీఎస్పీ సరిత ఆధ్వర్యంలో పోలీసులు కార్యాలయం వద్దకు చేరుకుని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు, సీపీఎం నేతల మధ్య వాగ్వాదం జరిగింది. నగర పరిధిలో నెలరోజుల పాటు 30 యాక్టుతో పాటు 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రదర్శనలు, ఆందోళనలు నిర్వహించేందుకు అనుమతిలేదని పోలీసులు స్పష్టంచేశారు. తాము శాంతియుతంగా ఆందోళన నిర్వహిస్తున్నామని సీపీఎం నేతలు వాదించారు. దీంతో పోలీసులు వారిని బలవంతంగా అరెస్టుచేసి వ్యాన్లలో ఎక్కించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ప్రతిపక్ష పార్టీల పట్ల కక్షసాధింపుతో అణచివేత చర్యలకు పూనుకుంటోందని ధ్వజమెత్తారు. వాస్తవాలను తెలుసుకుని బాధిత దళితులకు న్యాయం చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసులు తమను అరెస్టుచేసి అక్రమ కేసులు బనాయించటం అమానుషమన్నారు. ఎవరెన్ని ఆటంకాలు కల్పించినా ఛలో గొట్టిపాడు కార్యక్రమం ఈ నెల 22లేదా 23వ తేదీన నిర్వహించి తీరతామని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా సీపీఎం నేత మధుతో పాటు వివిధ ప్రాంతాల్లో కార్యకర్తలను అరెస్టు చేయటాన్ని నిరసిస్తూ పలువురు రాష్ట్ర నేతలు సీహెచ్ బాబురావు ఆధ్వర్యంలో మంగళగిరి పోలీసుస్టేషన్ ఎదుట బైఠాయించి ఆందోళన నిర్వహించారు.

దుర్గమ్మ సేవలో హైకోర్టు జడ్జి

విజయవాడ (ఇంద్రకీలాద్రి), జనవరి 13: ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను శనివారం ఉదయం హైకోర్టు జడ్జి రంగనాథ్‌గౌడ్ దర్శించుకొని ప్రత్యేక పూజలను నిర్వహించుకున్నారు. ఈసందర్భంగా ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం తర్వాత అర్చకులు అమ్మవారి ఆశీస్సులను అందచేయగా ఆలయాధికారులు అమ్మవారి శేష వస్త్రం, ప్రత్యేక ప్రసాదాలు అందచేశారు.



విశ్వరూప సేవ నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా విశ్వరూప సేవ

భద్రాద్రికి పోటెత్తిన భక్త జనం

భద్రాచలం టౌన్, జనవరి 13: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి శనివారం సకల దేవతాలంకారం (విశ్వరూప సేవ) వైభవంగా నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి తర్వాత వచ్చే బహుళ ద్వాదశి ఘడియల్లో ఉత్సవమూర్తులన్నింటినీ ఒకచోట చేర్చి ఆరాధన నిర్వహించడం భద్రాచలం దేవస్థానంలో ప్రత్యేకత. ఆలయంలోని 108 దేవతామూర్తులను ఒకచోట చేర్చి ప్రత్యేక అలంకరణ చేయడంతో భద్రాద్రి కలియుగ వైకుంఠమైంది. గరుడ వాహనంపై రాములవారు ఆసీనులు కాగా సాయంకాల సమయంలో ఆయన సన్నిధిలో ఇతర ఉత్సవ మూర్తులకు ఆరాధన నిర్వహించి కదంబం అనే ప్రత్యేక ప్రసాదాన్ని నివేదన చేశారు. భక్తులు ఈ విశ్వరూప సేవలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వాణిజ్యపన్నుల శాఖ అదనపు కమిషనర్ అరెస్టు

:: రెండోరోజు తనిఖీల్లో మరో రెండున్నర లక్షలు స్వాధీనం

విజయవాడ (క్రైం), జనవరి 13: ఓ మల్టీనేషనల్ ప్రైవేటు కంపెనీ ప్రతినిధుల నుంచి భారీగా ముడుపులు అందుకున్న కేసులో ఏపి వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్‌తోపాటు మరో ముగ్గురిని ఏసిబి అధికారులు అరెస్టు చేశారు. కృష్ణా జిల్లా కంకిపాడు మండలం ఈడ్పుగల్లులోని వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ కార్యాలయంలో లంచం తీసుకుంటుండగా శుక్రవారం అదనపు కమిషనర్ ఉప్పు ఏడుకొండలును అధికారులు వలపన్ని పట్టుకున్న విషయం తెలిసిందే. కాగా.. రెండోరోజు శనివారం కూడా ఏసిబి తనిఖీలు కొనసాగాయి. దీనిలో భాగంగా మరో రెండున్నర లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఇదే కేసులో ప్రమేయం ఉన్న వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ కార్యాలయం రిఫండ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సెక్షన్ సూపరింటెండెంట్ కె అనంతరెడ్డితోపాటు లంచం ఇచ్చిన సదరు కంపెనీకి చెందిన ఇద్దరినీ ప్రశ్నించారు. కార్యాలయంలో వీరి నుంచి 23లక్షల 20వేలు స్వాధీనం చేసుకోగా.. రెండోరోజు కూడా అధికారులు కార్యాలయంలోనూ.. మరోవైపు కంపెనీ ప్రతినిధులు బస చేసిన బందరురోడ్డులోని స్టార్ హోటల్‌లో తనిఖీలు నిర్వహించారు. దీంతో హోటల్ గది నుంచి మరో రెండున్నర లక్షలు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం నగదు రూ.25.70లక్షలు సీజ్ చేశారు. లంచం తీసుకున్న అధికారులిద్దరితోపాటు, ఇచ్చిన కంపెనీ ప్రతినిధులు కలిపి నలుగురిపై సెక్షన్ 7, 12, 13(1)(డి) రెడ్‌విత్ 34ఐపిసి కింద కేసులు నమోదు చేసి శనివారం అరెస్టు చేశారు. నిందితులు నలుగురిని విజయవాడ ఏసిబి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఆదేశాల మేరకు రెండువారాల పాటు జ్యుడీషియల్ రిమాండు నిమిత్తం జిల్లా జైలుకు తరలించినట్లు ఏసిబి డీజీ ఆర్‌పి ఠాకూర్ తెలిపారు.

ఎలాగైనా ఆడాల్సిందే

నిర్వాహకులు వర్సెస్ పోలీసులు

ఆంధ్రభూమిబ్యూరో

ఏలూరు, జనవరి 13: ఇంతకుముందు ఎన్నడూ లేని రీతిలో ఈసారి పశ్చిమగోదావరి జిల్లాలో తీవ్ర ఉత్కంఠ భరితమైన సీన్ ఆవిష్కృతమవుతోంది. గ్రామాలన్నీ పోలీసు పహారా మధ్యలో చిక్కుకుపోగా మరోవైపు ఎలాగైనా ఆ మూడురోజులు పందాలు సాధ్యం చేసుకోవాలని నిర్వాహకులు అంతా రెడీ చేసుకుని ఉన్నారు. అంతకుమించి ప్రస్తుతానికి కోడిపందాలకు సంబంధించి సరికొత్త వ్యవహారాలు తెరపైకి రాలేదు. అయితే వీటికి మించి ఈసారి పందాలను మరింత ఆకర్షణీయంగా మార్చేందుకు నిర్వాహకులకు అద్భుతమైన ఐడియాలు వస్తున్నాయి. గత ఏడాది ల్యాప్‌ట్యాప్‌లు పందాల వద్ద పెట్టేసి విదేశాల్లో కూడా వీటిని వీక్షించే అవకాశం కల్పించిన కొందరు నిర్వాహకులు ఈసారి దాన్ని అధిగమించి ఆన్‌లైన్ లావాదేవీలకు తెర తీస్తున్నట్లు తెలుస్తోంది. ఈసారి ఇంతకుముందు ఎన్నడూలేని స్థాయిలో పోలీసు పహరా స్పష్టంగా కన్పిస్తోంది. దాదాపు అన్నిచోట్ల ఇదివరకు ఇప్పటికే బరులు సిద్ధం చేసి ఇక రేపటినుంచి వచ్చే జనం కోసం వేచి చూస్తుండేవారు. కానీ ఈసారి అలాంటి పరిస్థితి చాలాచోట్ల లేకుండా పోయిందనే చెప్పుకోవాలి. పోలీసు యంత్రాంగం చాలాచోట్ల బరులను సిద్ధం చేయనివ్వకుండా ముందుగానే చర్యలు తీసుకుంది. కొన్నిప్రాంతాల్లో వేసిన బరులను కూడా ధ్వంసం చేసి అక్కడ ఏర్పాటుచేసిన స్తంభాలు, ఇతర సామాగ్రిని అక్కడినుంచి తరలించుకుపోయారు. ఈ పరిస్థితుల్లో నిర్వాహకులు కూడా తాము ఏమి తక్కువతిన లేదన్నట్లు బరులు ఏర్పాటుచేసేందుకు అవసరమైన సామాగ్రిని ట్రాక్టర్లు, లారీల్లో ఆ ప్రాంతానికి సమీపంలో దాచి ఉంచి సంకేతం రాగానే కొద్దిగంటల వ్యవధిలోనే కోడిపందాలకు సిద్ధమయ్యేందుకు రెడీగా ఉన్నారు. శనివారం మాత్రం జిల్లావ్యాప్తంగా కొన్నిచోట్ల చిన్నచితకా పందాలు జరిగినా ఆదివారం నుంచి భారీ పందాలు మొదలవుతాయని భావిస్తున్నప్పటికీ ఆ పరిస్థితి ఉంటుందా, ఉండదా అన్నది నిర్వాహకుల్లో టెన్షన్‌ను పెంచుతోంది. ఈ పరిస్థితులు ఇలాఉంటే అసలంటూ సంకేతం వచ్చి పందాలకు సిద్ధమైతే ఈసారి కొందరు నిర్వాహకులు నిర్వహణ రూట్‌ను మార్పు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఎక్కడికక్కడ ఇంతకుముందు బరుల వద్దే 500, 1000 రూపాయల నోట్ల కట్టలు దర్శనమిస్తూ ఉండేవి. వాటితోనే పందాలన్నీ అక్కడికక్కడ నగదు రూపంలో చెల్లుబాటు అయ్యేవి. కానీ ఈసారి న్యాయస్థానాలు జోక్యం చేసుకోవటం, కొన్ని మార్గదర్శకాలు విడుదల చేయటంతో కొంత జాగ్రత్త పడినట్లు కన్పిస్తోంది. కత్తులు కట్టకుండా, జూదం ఆడకుండా పందాలు నిర్వహించుకోవచ్చునని కొంతమంది ప్రచారం చేస్తుండగా దీన్ని తమకు అనుకూలంగా మార్చుకుని పందాలు యధాప్రకారం నిర్వహించి నగదు రూపంలో కాకుండా పందాల మొత్తాలను భూముల దస్తావేజుల రూపంలోను, ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు జరుపుకునేందుకు కొన్నిచోట్ల ఏర్పాట్లు చేసుకున్నారు. ఆ విధంగా పోలీసు పహరా పరిధిలోకి రాకుండా తప్పించుకోవచ్చునని కొంతమంది తెలివైన ఆలోచన చేస్తున్నారు. ఇదిలా ఉంటే జిల్లా ఎస్పీ ఎం రవిప్రకాష్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ తనకు వచ్చిన సమాచారం ఆధారంగా బలగాలను పరుగులు పెట్టిస్తున్నట్లు కన్పిస్తోంది. అందరి శెలవులు రద్దు చేసి పండుగ మూడురోజులు గ్రామాల్లోనూ, పోలీసుస్టేషన్లలోనూ ఉండి తీరాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. వెంప గ్రామంలో హైదరాబాద్‌కు చెందిన ఒక వ్యక్తి ప్రతిఏటా కోడిపందాలు నిర్వహిస్తూ ఆనవాయితీగా వస్తున్నారు. ఈసారి కూడా భారీ పందాలు నిర్వహించటంతోపాటు చీర్‌గరల్స్‌ను కూడా రప్పించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో ఎన్నడూ లేనిరీతిలో ఈఏడు అటు పొలిటికల్, ఇటు పోలీసుల మధ్య సినిమా ఫక్కీలో వార్ ప్రారంభమైంది. ఇక విజేత ఎవరో ఆదివారం మధ్యాహ్నానికి తేలిపోనుంది.

గిరిగీసి.. బరిలోకి!



ఈడుపుగల్లులో కోళ్లను బరిలోకి దించుతున్న పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్



గొడవర్రులో కోడి పందాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ వై రాజేంద్రప్రసాద్

- సంప్రదాయమేనంటున్న ప్రజాప్రతినిధులు
- ఖాకీలు అడ్డుకున్నా ఖాతరు చేయని ఎమ్మెల్యే బోడే
- గొడవర్రులో ప్రారంభించిన ఎమ్మెల్సీ యలమంచిలి
- మొదలైన కోడి పందేలు
- ఈసారి కాసినోవా ప్రత్యేకం

విజయవాడ (బెంజిసర్కిల్), జనవరి 13: సంక్రాంతి వచ్చిందే తుమ్మెద.. సరదాలు తెచ్చిందే తుమ్మెదా అంటూ ఒక సినీ రచయిత భావానికి తీసిపోకుండా, రాజధాని కృష్ణా జిల్లా నలుచెరుగులా సంక్రాంతి సంబరాలు అంబరానంటేలా ప్రారంభమయ్యాయి. పట్టిసీమ నీటి సాఫల్యంతో కళకళలాడిన జిల్లా ధాన్యాగారాలతో ఉత్సాహంతో ఉన్న రైతులు సంక్రాంతి సంబరాలను కోడి పందాలతో శ్రీకారం చుడుతున్నారు. సంక్రాంతి సంబరాల్లో అతి ముఖ్యమైన కోడి, పొట్టేళ్ల పందాలకు పందెం రాయుళ్లు సిద్ధపడుతుండగా, వారిని నిలువరించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. సంక్రాంతి వేడుకల్లో కోడి పందాలపై నిషేధం విధిస్తూ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంతో, కాస్త డీలా పడినప్పటికీ.. సంప్రదాయాలను మాత్రం కొనసాగిస్తున్నారు. ఫలితంగా గిరిగీసి మరీ బరిలోకి కోళ్లు, పొట్టేళ్లను దించుతున్నారు. శుక్రవారం నుంచి కృష్ణా జిల్లా యనమలకుదురులో కోడిపందాలు ప్రారంభం కాగా, శనివారం నుంచి గొడవర్రు, పోరంకిలో ప్రారంభం కాగా, ఈడ్పుగల్లులో ఆదివారం నుంచి పోటీలు ప్రారంభం కానున్నాయి. వాటిని పెనమలూరు టీడీపీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కొబ్బరికాయ కొట్టి మరీ ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించడంతో వారిద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. అయినప్పటికీ వారిని ఖాతరు చేయని ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి బరిని ప్రారంభించారు. అంతకుముందు గొడవర్రులో టీడీపీ ఎమ్మెల్సీ యలమంచిలి బాబూ రాజేంద్రప్రసాద్ బరిని రిబ్బన్‌కట్ చేసి కోడిని బరిలోకి దింపారు. ప్రతీ ఏడాది భిన్నంగా నిర్వహించే పందెం బరిలో ఈసారి కాసినోవా ప్రత్యేకం కానుంది. సంస్కృతి, సంప్రదాయాలతో ముడిపడి ఉన్న కోడి పందాల నిర్వహణను అడ్డుకోవడం సరికాదని ప్రజాప్రతినిధులు వాదిస్తుంటే, సంప్రదాయం పేరుతో జూదం నిర్వహిస్తే సహించేది లేదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. అయినా ఎవరి పనిలో వారు నిమగ్నమయ్యే ఉన్నారు. గత ఏడాదికి భిన్నంగా ఈ ఏడాది పోరంకి, ఈడ్పుగల్లు, గొడవర్రు, యనమలకుదురు, హనుమాన్ జంక్షన్‌తో పాటు పలు ప్రాంతాల్లో సకల సదుపాయాలు, అన్ని హంగులతో బరులను సిద్ధం చేశారు. ఒక్కొక్క బరి పది ఎకరాల్లో పూర్తి స్థాయి ఫెన్సింగ్ ఏర్పాటుతో, పక్కా ప్రణాళిక ప్రకారం ఏర్పాటు చేశారు. ముఖ్యంగా పెనమలూరు నియోజకవర్గ పరిధిలో అత్యధికంగా బరులు ఏర్పాటయ్యాయి. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సారథ్యం వహిస్తున్న పెనమలూరు నియోజకవర్గ పరిధిలో యనమలకుదురు, పోరంకి, ఈడ్పుగల్లు, గొడవర్రులో పందెం బరులను భారీస్థాయిలో ఏర్పాటు చేశారు. గత మూడు రోజులుగా పందాల కోసం బరులకు ఏర్పాట్లు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ముందస్తు సమాచారంతో పందెం జరిగే ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేయడంతో పాటు, పందాలను ఏర్పాటు చేసిన నిర్వాహకులపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నారు. పందెం నిర్వహణ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, కోళ్లకు కత్తులను కట్టకూడదని ఆదేశాలు ఇవ్వడంతో పాటు, రెండు లక్షల నుంచి ఐదు లక్షల వరకూ పూచీకత్తును వారి నుండి తీసుకుంటున్నారు. పోలీసు పహారా, నిరంతర నిఘా ఉన్నప్పటికీ కంకిపాడు మండలంలోని గొడవర్రులో సుమారు ఆరు ఎకరాల్లో ఏర్పాటు చేసిన కోడి పందాలను ఎమ్మెల్సీ బాబు రాజేంద్రప్రసాద్ శనివారం సాయంత్రం ప్రారంభించారు. వీటితో పాటు పోరంకి గ్రామంలో కూడా ఎనిమిది ఎకరాల్లో కోడి, పొట్టేళ్ల పందాల కోసం బరులు ఏర్పాటు చేశారు. యనమలకుదురు గ్రామంలో ఇప్పటికే ప్రారంభమైయిన కోడి పందాల పోటీలు, రాత్రి పగలు అనే తేడా లేకుండా గత రెండు రోజులుగా నిర్వహిస్తున్నారు. గుడివాడలో కోడి పందాలను అధికార పార్టీ నేతలు అట్టహాసంగా ప్రారంభించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి వెంకటేశ్వరరావుతో కలసి స్థానిక ప్రజా ప్రతినిధులు శనివారం లాంఛనంగా పోటీలను ప్రారంభించారు. అంపాపురంలో పోలీసులకు అందిన ముందస్తు సమాచారంతో కోడి పందాలు నిర్వహించే స్థల యజమానిపై బైండోవర్ కేసు నమోదు చేశారు. ఇక్కడ ప్రతీ ఏడాది ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఆధ్వర్యంలో కోడి పందాలను నిర్వహిస్తారు. బైండోవర్ కేసు నమోదు చేసినప్పటికీ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తుండటంతో పోలీసులు ప్రత్యేక పికెట్‌ను ఏర్పాటు చేశారు. కోడి పందాలను నిర్వహిస్తే చర్యలు తప్పవని జాయింట్ పోలీస్ కమిషనర్ రమణకుమార్, జిల్లా ఎస్పీ త్రిపాఠి హెచ్చరిస్తున్నారు. సంక్రాంతి ముగ్గుల పోటీల పేరుతో కోడి పందాలు నిర్వహిస్తే సహించేది లేదంటున్నారు.



కోడి పందేల కోసం ఈడుపుగల్లులో సకల హంగులతో ఏర్పాటు చేసిన బరి

పందేలపై కెమెరా కన్ను!

విజయవాడ (క్రైం), జనవరి 13: సంక్రాంతి సందర్భంగా నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని జాయింట్ పోలీసు కమిషనర్ రమణకుమార్ హెచ్చరించారు. పందాల నిర్వహణ శిబిరాల వద్ద ప్రత్యేక అదనపు పోలీసు బలగాలను మోహరించినట్లు తెలిపారు. అదేవిధంగా నిర్వహకులపై నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పండుగ సందర్భంగా సంబరాల ముసుగులో కోడి పందాలు నిర్వహించే వారి పట్ల చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, దీనిలో భాగంగా పెనమలూరు నియోజకవర్గంలోని కంకిపాడు, ఈడ్పుగల్లు, ఉయ్యూరు, గండిగుంట, గొడవర్రు తదితర ప్రాంతాల్లోని శిబిరాలపై జాయింట్ సీపీతోపాటు డీసీపీ గజరావ్ భూపాల్ నేతృత్వంలో ప్రత్యేక పోలీసు బృందాలు శనివారం తనిఖీలు చేపట్టాయి. కోడి పందాల నిర్వహణపై సుప్రీం కోర్టు మార్గదర్శకాలు, రాష్ట్ర డీజీపీ, చీఫ్ సెక్రటరీ ఆదేశాల ప్రకారం.. నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో స్థానిక పోలీసులతోపాటు, ప్రత్యేక అదనపు పోలీసు బృందాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కోడి పందాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న ప్రదేశాల్లో వీడియో కెమెరాలు, బాడీ కెమెరాలతోపాటు ప్రత్యేక సిబ్బంది, అధికారులు పర్యవేక్షణలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే వాహనాలను కూడా నిలువరించి తనిఖీలు చేస్తున్నామని చెప్పారు. ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఇంటర్నెట్‌తో వాయిస్‌కాల్స్ మళ్లింపు

పాకిస్తాన్‌తో సంబంధాలపై ఆరా ■ కడప డిఎస్పీ మాసూంబాషా



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

ఆంధ్రభూమి బ్యూరో

కడప,జనవరి 13: ఇంటర్నెట్ ద్వారా వాయిస్‌కాల్స్‌ను అక్రమంగా మళ్లిస్తూ అటు ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టడమే కాకుండా భారత ప్రభుత్వ రక్షణ వ్యవహారాన్ని పాకిస్థాన్‌కు చేరవేస్తున్న ప్రధాన నిందితుడు కడపకు చెందిన హఫీజుల్లాను అరెస్టుచేసినట్లు కడప డీఎస్పీ మాసూంబాషా వెల్లడించారు. శనివారం కడపలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ ఇంటర్నెట్ ద్వారా వాయిస్ కాల్స్‌ను అక్రమంగా మళ్లిస్తూ ఎక్సేంజ్‌లు ఏర్పాటు చేసిన హఫీజుల్లాపై కొద్దిరోజులుగా నిఘా పెట్టామన్నారు. జిల్లా యంత్రాంగంతో పాటు రాష్ట్ర స్థాయి అధికారులు పూర్తిస్థాయి దృష్టి సారించడంతో వాయిస్ ఓవర్ ఇంటర్నెట్ ప్రోటోకాల్ పరిజ్ఞానం (వీవోఐపీ) ద్వారా అంతర్జాతీయ స్థాయిలో దేశంలోని అనధికారిక ఎక్సేంజ్‌లకు సమాచారం వస్తోందన్నారు. ఇది ఇక్కడి నుంచి సాధారణ దేశీయ కాల్స్‌గా మారుతుందని , ఈకాల్స్‌ను దారి మళ్లించి అనేక విధాలుగా సొమ్ము చేసుకుంటున్నారని వెల్లడించారు. ఇటువంటి కాల్స్ ద్వారానే మన దేశ రక్షణకు సంబంధించిన సమాచారాన్ని పాకిస్థాన్‌కు చేరవేసే అవకాశాలు కూడా ఉన్నట్లు సమాచారం అందడంతో హఫీజుల్లాను పూర్తిస్థాయిలో విచారిస్తున్నామని వెల్లడించారు. ఈ సమాచారం దేశంలోని అనేక ప్రాంతాల్లో అక్రమంగా వెలసిన ఎక్సేంజ్‌ల ద్వారా వివిధ దేశాలకు చేరవేసే అవకాశం ఉందని వెల్లడించారు. హఫీజుల్లా తీరుపై కొద్దిరోజులుగా నిఘా పెట్టామన్నారు. ఆయనకు వస్తున్న కాల్స్, ఆయన నిర్వహిస్తున్న ఎక్సేంజ్ ఆఫీస్‌పై దాడి చేసి అనేక కీలక డాక్యుమెంట్లు సేకరించి చివరకు హఫీజుల్లాను అరెస్టు చేశామన్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరుగుతుందని వెల్లడించారు. ఈ సమావేశంలో వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, చిన్నచౌకు ఎస్‌ఐ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వర్శిటీ ఆస్తులు కాపాడండి

అనకాపల్లి ఎమ్మెల్యే పీలా డిమాండ్ ■ హార్టికల్చర్ వర్శిటీ వైస్ చాన్స్‌లర్‌తో భేటీ

గుంటూరు, జనవరి 13: ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యాన విశ్వవిద్యాలయానికి చెందిన ఆస్తులు ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలని విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యుడు, అనకాపల్లి ఎమ్మెల్యే టీలా గోవింద సత్యనారాయణ కోరారు. గుంటూరులో ఉద్యానశాఖ కమిషరేట్‌లో శనివారం వైస్ చాన్స్‌లర్ చిరంజీవి చౌదరి అధ్యక్షతన జరిగిన విశ్వవిద్యాలయ పాలకమండలి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా వెంకటరామన్నగూడెంలోని ఉద్యాన విశ్వవిద్యాలయానికి రాష్ట్రవ్యాప్తంగా పలు ఉద్యాన పరిశోధనా క్షేత్రాలు, కళాశాలలు ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో 8 పరిశోధనా క్షేత్రాలు, గుంటూరు జిల్లాలోని లాం, బాపట్ల, కడప జిల్లాలోని అనంతరాజుపేట, విజయనగరం జిల్లాలోని పార్వతీపురం, తూర్పు గోదావరి జిల్లాలోని అంబాజీపేట, పందిరి మామిడిలో, కర్నూలు జిల్లా మహానందిలోనూ, నెల్లూరు జిల్లా పెట్లూరు, చిత్తూరు జిల్లా తిరుపతిలో మొత్తం 20కు పైగా పరిశోధనా క్షేత్రాలు ఉన్నాయన్నారు. ఈ క్షేత్రాల్లో పరిశోధనలు చేసే నిమిత్తం పొలాలు కూడా ఉండటంతో అవి ఆక్రమణలకు గురయ్యే ప్రమాదాన్ని నివారించాలని ఆయన కోరారు. ఈ ఆస్తులకు ఫెన్సింగ్ వేయడం, ప్రహరీగోడలు నిర్మించడం వంటి చర్యలు తీసుకోవాలని సమావేశంలో కోరారు. పరిశోధనా క్షేత్రాలతో పాటు ఉద్యాన కాలేజీలు, కృషీ విజ్ఞాన కేంద్రాల విషయంలో కూడా తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. గుంటూరు జిల్లా యడ్లపాడు మండలం ఉద్యాన పరిశోధనా క్షేత్ర నిర్మాణాన్ని భూములు లభించిన వెంటనే ప్రారంభిస్తామని వైస్ ఛాన్సలర్ చిరంజీవి చౌదరిని పాలకమండలి సభ్యుడు పోపూరి శివరామకృష్ణ అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. సమావేశంలో పాలకమండలి సభ్యులు, హిందూపూర్ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మడకశిర ఎమ్మెల్యే వీరన్న, పోపూరి శివరామకృష్ణ, నూకసాని బాలాజీ, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీనివాసులు, ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ దామోదరనాయుడు, ఫైనాన్స్ సెక్రటరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి చార్జీల బాదుడు

విశాఖ నుంచి హైదరాబాద్‌కు రూ.3000 ■ తెలంగాణ నుంచి కూడా ఇదే పరిస్థితి


ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, జనవరి 13: పండుగ నాడు సొంత ఊళ్లలో కుటుంబ సభ్యులతో కలిసి గడపాలనుకుంటున్న సగటు మనిషికి ప్రయాణ పాట్లు తప్పట్లేదు. విశాఖ నుంచి హైదరాబాద్, హైదరాబాద్ నుంచి విశాఖ రాకపోకలు సాగించే ప్రయాణికులు రవాణా సదుపాయం లేక పడరాని పాట్లు పడుతున్నారు. ఇద్దరు పిల్లలతో కలిసి కుటుంబం మొత్తం ఊరెళ్లి రావాలంటే రూ.20వేల ఖర్చవుతోంది. ఈ సంక్రాంతికి ప్రభుత్వ ఉద్యోగులకు వరుసగా నాలుగు రోజులు సెలవులు రాగా, ప్రైవేటు సంస్థలు కూడా దాదాపు మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించాయి. దీంతో సొంత ఊర్లకు వెళ్లాలనుకున్న వారికి ఉద్యోగ పరంగా వెసులుబాటు కుదిరింది. అయితే ఊరెళ్దామంటే రవాణా సదుపాయలే గగనమైపోయాయి. ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల నుంచి తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగ, వ్యాపార, వాణిజ్యాల్లో స్థిరపడిన వారు అధికం. ముఖ్యంగా ఉత్తరాంధ్ర నుంచి పెద్ద సంఖ్యలో వలస కూలీలు హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో ఉపాధి పొందుతున్నారు. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఫార్మా, ఐటీ కంపెనీల్లో కూడా తూర్పుకోస్తా ప్రాంతానికి చెందిన వారే అధికం. ప్రతి ఏటా సంక్రాంతికి వీరంతా సొంత ఊర్లకు వచ్చి, కుటుంబ సభ్యులతో గడిపి వెళ్తుంటారు. ప్రతి సంక్రాంతికీ అటూ,ఇటూ రాకపోకలు సర్వసాధారణమే. రవాణా విషయంలో కొంత ప్రతి కూలత ఉన్నా, ఇంత దారుణమైన పరిస్థితితులు ఎప్పుడూ తలెత్తలేదు. విశాఖ నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ 140 వరకూ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు ప్రకటించింది. వీటికి ప్రైవేటు ట్రావెల్స్ నుంచి నడిచే సర్వీసులు అదనం. అయినప్పటికీ ప్రయాణీకుల రద్దీని ప్రత్యేక సర్వీసులు భర్తీ చేయలేకపోతున్నాయి. ప్రయాణికుల అత్యవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ, ప్రైవేటు ఆపరేటర్లు ఛార్జీలను 100 శాతం పెంచేశారు. విశాఖ నుంచి హైదరాబాద్‌కు శనివారం ప్రైవేటు సర్వీసుల్లో రూ.3000 నుంచి రూ.3,200 వరకూ వసూలు చేశారు. ప్రైవేటు ఆపరేటర్లు వ్యూహాత్మకంగా నెల రోజుల ముందే టికెట్ల బుకింగ్ నిలిపివేసి, అత్యవసర వేళ ధరలను పెంచి వ్యాపారం చేసుకుంటున్నారు. ఇక ఆర్టీసీలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు ఆర్టీసీ అధికారులు చెప్పినప్పటికీ ఛార్జీలు మాత్రం మోత మోగుతోంది. సాధారణ ఛార్జీలతో పోలిస్తే ఆర్టీసీ కూడా ఛార్జీలను 100 శాతం పెంచి వసూలు చేస్తోంది.

ఇదిలా ఉండగా తెలంగాణ నుంచి వచ్చే ప్రయాణికుల పరిస్థితి కూడా ఇంచుమించు ఇలాగే ఉంది. హైదరాబాద్ నుంచి విశాఖకు శుక్ర,శనివారాల్లో ప్రైవేటు సర్వీసుల్లో ఛార్జీలు రూ.3000 దాటింది. ఇక తెలంగాణ ఆర్టీసీ కూడా ప్రైవేటుకు ఏమాత్రం తగ్గకుండా ఛార్జీలు వసూలు చేసింది. ప్రయాణ పాట్లు పండుగ సంతోషాన్ని సగటు ప్రయాణికునికి లేకుండా చేసిందని చెప్పక తప్పదు.



కిటకిటలాడుతున్న విశాఖపట్నం రైల్వే స్టేషన్



ఒంటికాలిపై ప్రయాణం

విశాఖపట్నం, జనవరి 13: సంక్రాంతి పండుగతో రైళ్ళ రద్దీ విపరీతంగా ఉంటోంది. కాలేజీలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులు, బ్యాంకులకు వరుస సెలవులు రావడంతో వీరంతా ఇళ్ళకు బయలుదేరుతున్నారు. దీంతో రైళ్ళన్నీ కిటకిటలాడుతున్నాయి. సుదూర ప్రాంతాల మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్‌లు, ప్రత్యేకరైళ్ళు, సూపర్‌ఫాస్ట్‌లు రద్దీగా నడుస్తున్నాయి. సికింద్రాబాద్-విశాఖపట్నం, ముంబై-విశాఖపట్నం, ఢిల్లీ-విశాఖపట్నం, హౌరా-చెన్నై, త్రివేండ్రం-హౌరా, భువనేశ్వర్-సికింద్రాబాద్ (విశాఖ), హౌరా-తిరుపతి, బొకారో, కోరమండల్, కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లు మరీ రద్దీగా నడుస్తున్నాయి. వీటిలో సామాన్యులకు బెర్తులు లభించకపోవడంతో దళారీలను ఆశ్రయిస్తున్నారు. అలాగే రిజర్వేషన్ కోచ్‌ల్లో ప్రయాణించే వారికి అదనపు చార్జీల బాదుడు తప్పడం లేదు. విశాఖ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్ళే ప్రయాణికుడు రిజర్వేషన్ సౌకర్యం లేకపోయినా వెయ్యి రూపాయలకు పైగా చెల్లించాల్సి వస్తోంది. అలాగే ముంబై, ఢిల్లీ, బెంగళూరు, చెన్నై వంటి నగరాల నుంచి వచ్చే ప్రయాణికులకు రైలు చార్జీల భారం మోయాల్సి వస్తోంది. రెట్టింపు చార్జీలు చెల్లించాల్సి వస్తోందంటూ చెన్నై నుంచి విశాఖ వచ్చిన ప్రయాణికులు ఆందోళన వ్యక్తంచేశారు. దాదాపు 150 రైళ్ళు విశాఖ మీదుగా నడుస్తున్నా అదనపు కోచ్‌ల సదుపాయం లేకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు. గంటల తరబడి ఆలస్యం... రద్దీగా నడుస్తోన్న సూపర్‌ఫాస్ట్‌లు, ఎక్స్‌ప్రెస్ రైళ్ళు రెండు నుంచి మూడు గంటలపాటు ఆలస్యమవుతున్నాయి. ఏ రైలూ గమ్యానికి సకాలంలో చేరకపోవడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడంలేదు. రైలులోనే కాలం గడిచిపోతోందంటూ హౌరాకు వెళ్తున్న మహిళలు రైల్వేస్టేషన్ అధికారుల వద్ద ఆందోళన వ్యక్తంచేశారు. అలాగే భువనేశ్వర్, బీహార్, మహారాష్ట్ర, టాటా, అలెప్పీ తదితర సుదూర ప్రాంతాలకు విశాఖ మీదుగా కుటుంబాలతో వెళ్ళే వారూ అవస్థలు పడుతున్నారు. రోజూ రద్దీగా నడిచే గోదావరి, విశాఖ, గరీబ్‌రథ్, దురంతో, ఈస్ట్‌కోస్ట్, జన్మభూమి తదితర ఎక్స్‌ప్రెస్‌ల్లో సామాన్యులకు నిల్చొని కూడా ప్రయాణించే అవకాశం లేకుండా పోతోంది. సంక్రాంతి రోజు వరకు ఇవే పరిస్థితులుంటాయని అధికారులు చెబుతున్నారు. అయితే రైళ్ళ సమాచారంలోను స్పష్టత లేకపోవడంతో ఎక్కాల్సిన రైలు గురించిన ఆందోళనతో ప్లాట్‌ఫారాలపై పరుగులు తీయాల్సి వస్తోంది. ప్రత్యేక రైళ్ళు, అదనపు కోచ్‌లు సదుపాయం కల్పించకపోవడంతో పలు సుదూర ప్రాంతాలకు వెళ్ళాల్సిన ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఇంటిళ్ళపాది లగేజీలతో వెళ్ళాలంటే భయపడాల్సి వస్తోంది.

బుల్లితెర విశ్వరూపం


దూరదర్శన్ వచ్చిన కొత్తలో ప్రాంతీయ లింక్ కేవలం సాయంకాలం 3 గంటలు ప్రసారమయ్యేది. ఆదివారం నాడు సాధారణంగా జాతీయ పురస్కారాలు గెలుచుకున్న ప్రాంతీయ భాష చిత్రాలు ప్రసారం అయ్యేవి. తెలుగు సినిమాలు సంవత్సరమంతా నిరీక్షించి చూస్తే మహా అయితే రెండు వచ్చేవి. మిగతా రోజుల్లో ఏమి చేయాలి. వ్యవసాయదారుల కార్యక్రమంలో ఆకుపచ్చ పురుగులకి ఏ మందు ఎంత పాళ్లలో కలిపి జల్లాలిలాంటివి అప్పట్లో మహా గొప్ప కాలక్షేపం. ముఖ్యంగా, కనీసం టూరింగ్ టాకీసు లేని గ్రామాల్లో, ఆదివారం మధ్యాహ్నం వచ్చే ప్రాంతీయ భాష సినిమా అస్సామీస్ అయినా, మలయాళందైనా సబ్ టైటిల్స్ సహాయంతో చూడందే వదిలేవాళ్లం కాదు. గురువారం నాడు ప్రసారమయ్యే చిత్రలహరి పట్టుమని అర్ధగంట కూడా ఉండదు. అభిమాన హీరో లేక నటి పాట చూద్దామనుకునేలోగానే చుక్కలు వచ్చిన ఆంటిన్నా సరిచేయడానికి సరిపోయేది లేదా 'ప్రసారంలో అంతరాయానికి చింతిస్తున్నాము' అన్నట్లు రంగుల గీతలతో స్లయిడ్ వచ్చేది. లేదా 'ఓవర్ టు ఢిల్లీ' ప్రత్యక్షమయ్యేది.

1980లలో దూరదర్శన్ యువతపై ప్రభావాన్ని చూపించగలిగేది. ఆ రోజుల్లో టెలివిజన్‌కు వచ్చేసరికి దీనికి ప్రత్యామ్నాయాలు లేకపోవడం అందుకు కారణం. అలాంటిది ఇప్పుడు దేశంలో 800కి పైగా టీవీ చానళ్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. 1980లకి ఇప్పటికీ మారనిదేమిటంటే 'రోజులో 24 గంటలు'.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయ వలసదారులు, స్థానిక వార్తలు మరియు వినోద చానళ్లను అనుసరించినా కానీ వారు మాతృభాషలో సొంతగడ్డ విషయాలు, వార్తలు, వినోదభరిత కార్యక్రమాలను తిలకించడానికి మొగ్గు చూపుతారు. వార్తలు, వినోదం విషయాల్లో భాష కీలక పాత్ర పోషిస్తుంది. భారతదేశంలో రెండు వంతులు జనాభా వివిధ గుర్తించదగిన మాతృభాషలలో మాట్లాడటం, మీడియాని వినియోగించడంవలన ప్రాంతీయ భాషా ప్రేక్షకులకు టెలివిజన్ బ్రాడ్‌కాస్టర్స్ అసమానమైన ప్రాముఖ్యత ఇస్తున్నారు. ఇటీవలి ఫిక్కీ-కెపిఎంజి నివేదిక ప్రకారం, 2016లో ప్రాంతీయ వీక్షకుల వాటా 33 శాతంగా ఉంది. ఇది ప్రాంతీయ జనాభాలో ప్రేక్షకుల గణనీయమైన వాటా. ప్రాంతీయపరంగా, తమిళ్ చానల్స్ స్థానిక వీక్షకులు అధికభాగం 25.7 శాతం, కన్నడ 11.6 , మలయాళం 9.2, బెంగాలీ 6.6, మరాఠీ 4.6 మరియు 2.6 శాతం. మన మాతృభాష తెలుగు 24.4 శాతంతో రెండో స్థానంలో ఉంది.

జనాభా, భౌగోళిక లక్షణాల కారణంగా టెలివిజన్ బ్రాడ్‌కాస్టర్స్ కోసం భారత ఉపఖండంలో అవకాశాలు పుష్కలంగా ఉండడం ఒక వరం. కాకపోతే మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు, భాష, మాండలికాలు, టీవీ వినియోగించే అలవాట్ల పరంగా భారతీయ మార్కెట్ మీడియా ప్రసారకులకు ఒక పజిల్ లాంటిది. సమగ్ర పరిశోధన చేసి క్షుణ్ణంగా అర్థం చేసుకుని ఛేదిస్తేనే విజయం వరిస్తుంది. రెండు దశాబ్దాలుగా విదేశీ మీడియా సంస్థలు, ప్రాంతీయ భాషల్లో టెలివిజన్ ఛానళ్లకి దూరంగా ఉంటూ వస్తూ వాటిని స్థానిక మీడియా సంస్థలకు విడిచిపెట్టారు. భారతదేశంలో మొట్టమొదట అడుగుపెట్టిన స్టార్ చానళ్ల అనుబంధ సంస్థ రూపర్డ్ ముర్డోచ్ యొక్క న్యూస్ కార్పొరేషన్ మొదట డిటిహెచ్ భారత మార్కెట్‌లోకి ప్రవేశపెట్టే నిమిత్తం ప్రవేశించారు. బ్రాడ్‌కాస్టర్స్ కోసం మరొక సవాలు. భారతదేశంలో టెలివిజన్ చూసే అలవాట్లు, డైనింగ్ టేబుళ్లు, టెలివిజన్ సెట్లు మాత్రమే భారతీయ కుటుంబాన్ని ఒకే సమయంలో ఒకచోటికి చేరుస్తాయి. పాశ్చాత్య దేశాలకు విరుద్ధంగా, కుటుంబ సభ్యులందరూ కలిసి టీవీ చూసి ఆనందించడం భారతీయుల సంస్కృతి. మొత్తం భారతీయ గృహాల్లో మూడింట రెండువంతులు లేదా 185 మిలియన్ల గృహాలలో భారతదేశంలో టీవీసెట్లు ఉన్నాయి. వీటిలో 96 శాతం గృహాలు ఒక్క టీవీ మాత్రమే కలిగి ఉన్నాయి. ప్రారంభంలో, ఈ పరిస్థితులు ప్రసారకుల కోసం అడ్డంకిగా, వాణిజ్య ప్రకటనదారులను, వారి లక్ష్య ప్రేక్షకులను ఆకర్షించడం గందరగోళంగా కనిపించేవి. మ్యూజిక్ చానెల్ ఎంటీవీ వంటివి కఠినమైన ఒక గుణపాఠాన్ని నేర్చుకోవలసి వచ్చింది ఇందువల్లే. కానీ ఇక్కడ సంస్కృతిని చూసి దిక్కుతోచక చివరకు, ఎంటీవీ బాంగ్రా సంగీతానికి నాట్యమాడింది. తద్వారా భారతీయ సంస్కృతిని ఆలింగనం చేసింది.

ఇండియన్ మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ ఇండస్ట్రీ యొక్క రూపాంతరప్రాప్త పెరుగుదల కారణంగా ఎదురయ్యే సవాళ్ల కారణంగా, ప్రసారకులు కేవలం పచ్చటి పచ్చిక బయళ్లకోసం మాత్రమే కాకుండా వారు సంభావ్య సముపార్జ



నల కోసం గాలిస్తూనే ఉన్నారు. ప్రాంతీయ ప్రేక్షకులను ఆకర్షించడం, ఓవర్ ద టాప్, స్ట్రీమింగ్ ప్లేయర్ల కంటెంట్ లైబ్రరీకి పోటీగా వారి నాణ్యతా విధానాలతో సరిపోయేలా కంటెంట్ వ్యూహాలను పునరుద్ధరించడానికి ప్రయత్నం చేయడానికి ప్రయత్నాలు ప్రారంభించారు.

గత ఐదు సంవత్సరాలలో బ్రాడ్‌కాస్టింగ్ దిగ్గజాలు, ప్రస్తుతం ఉన్న ప్రాంతీయ చానళ్లని తీసుకోవడమో, కొత్త చానళ్లను సృష్టించడం ద్వారానో తమ ప్రాంతీయ ప్రేక్షకులను గణనీయంగా పెంచుకున్నారు. మీ మాతృభాషలో ఒక క్రీడాచానల్ ఉంటే బాగుంటుందా? కుతూహలంగా ఉందా? తమిళ ప్రేక్షకులను పూర్తిగా ఆశ్చర్యానందాలలో ముంచెత్తారు స్టార్ టీవీ యాజమాన్యం. గత మే నెలలో, స్టార్‌టీవీ ఇతరులకన్నా ఒక అడుగు ముందుకు వేసి భారతదేశంలో మొట్టమొదటి ప్రాంతీయ క్రీడా చానల్ స్టార్ స్పోర్ట్స్ 1 ను ఆవిష్కరించింది. దీనికి కారణం ఏమటంటే, ఈమధ్య కాలంలో ప్రతి క్రీడాంశంలో వివిధ లీగులు నిర్వహించడం, ధోనీ ఐపిఎల్‌లో తమిళనాడుకు ప్రాతినిధ్యం వహించడం ప్రతి ఇంటికి ఇలవేలుపు లేదా హీరో అయ్యాడు. ముఖ్యంగా, స్టార్ టీవీ, తమిళులు ఒకరికొకరు అపరిచితులు కాదు. స్టార్ 2001లో యూటీవీ నుండి విజయ టీవీని కొనుక్కొంది. ప్రస్తుతం ఇబ్బందులతో చుట్టుముట్టబడి స్వీయ బహిష్కరణలోనున్న యునైటెడ్ బ్రేవరీస్ మాజీ చైర్మన్ విజయ్‌మాల్యా, విజయ టీవీని 90లలో ప్రారంభించారు. అందువల, స్టార్ టీవీ నెట్‌వర్క్‌కు తమిళ ప్రేక్షకుల నాడి తెలుసును. వాళ్ల అభిరుచులు స్టార్ టీవీకి కొట్టినపిండి.

జీ టీవీయొక్క ప్రాంతీయ పోర్ట్‌ఫోలియో ఎనిమిది భాషలతో కూడినది. గత సంవత్సరం జీ యువ మరాఠీ, తమిళ్ మూవీ ఛానల్ ఆవిష్కరించింది. మరోపక్క జీటీవీ, 9ఎక్స్ ఝూకాస్ మరాఠీ, 9ఎక్స్ టషన్ పంజాబీ సహా ఆరు 9 ఎక్స్ మ్యూజిక్ చానళ్లు కొనుగోలు ప్రక్రియలో ఉంది. సోనీ ఇండియా, ప్రాంతీయ చానళ్ల ఆటలో వెనుకబడి ఉంది. అయితే ఆలస్యంగా మేల్కొన్నా మెరుపువేగంతో ఐదు ప్రాంతీయ వినోద చానల్స్ సబ్ బంగ్లా, సబ్ తమిళ్, సబ్ పంజాబీ, సబ్ మరాఠీ, సబ్ తెలుగుతో ఝలక్ ఇవ్వనుంది. వయాకామ్ 18, ఈటీవీ తెలుగు చానళ్లు మినహా మిగతా ఈటీవీ చానళ్లను కొనుగోలు చేసి వాటిని కలర్స్ బంగ్లా, కలర్స్ మరాఠీ, కలర్స్ గుజరాతీ, కలర్స్ ఒరియా, కలర్స్ కన్నడగా రూపాంతరం చేసింది. గత ఏడాది స్టార్ టీవీ మా తెలుగు చానల్ నెట్‌వర్క్ కైవసం చేసుకొని మా టీవీ, మా సినిమా, మా మ్యూజిక్, మా గోల్డ్‌ను స్టార్ హారంలో కలుపుకున్నది. ఇన్ఫోటైన్మెంట్ ద్వయం నేషనల్ జియోగ్రాఫిక్, డిస్కవరీ పోటీగా 'సోనీ-బిబిసి' ఇన్ఫోటైన్మెంట్ రంగంలోకి ఉమ్మడిగా ప్రవేశించి , 'సోనీ-బిబిసి' యొక్క ప్రాంతీయ భాషల్లో డబ్బింగి ఫీడ్ ప్రారంభించి మంచి అవకాశాన్ని సద్వినియోగపర్చుకున్నాయి. అక్టోబర్ నెలలో బీబీసీ తన బీబీసీ వరల్డ్ వ్యూ కార్యక్రమం కోసం ఈటీవీ, ఇండియా టీవీలతో భాగస్వామ్యాన్ని కుదుర్చుకుంది. భారతదేశంలో షాప్ సీజె నెట్‌వర్క్‌లో 74 శాతం వాటాను సంపాదించడానికి మధ్య భాగంలో హోమ్‌షాప్ 18 ఇప్పటికే ప్రాంతీయ టెలిషాపింగ్ టీవీలో ఐదు భాషల్లో ఉనికిని చాటుకుంటోంది.

'కౌన్ బనేగా క్రోర్పతి', 'ఇండియన్ ఐడల్', 'బిగ్‌బాస్' భారతీయ రాష్ట్రాలలో సృష్టించిన అలజడి అంతాఇంతా కాదు. ప్రేక్షకులలో ఆసక్తి వలన అవి వివిధ ప్రాంతీయ భాషల్లో పునర్నిర్మించారు. ఆ షోల యొక్క నిర్మాణ సంస్థలు ఎండమాల్, ఫ్రీమాంటిల్ అసలు బ్రిటిష్ ఫార్మాట్లను రూపొందిస్తున్నప్పుడు అవి ఇంత అద్భుతమైన విజయం సాధిస్తాయని, ఇన్ని భాషల్లో వెర్షన్లు తీస్తారని ఊహించి ఉండరు. ఈ పరిణామాలు, దృష్టాంతాలు భారతీయ ప్రాంతీయ భాషలకు ప్రసారాలు అందించే ప్రాధాన్యాన్ని సూచిస్తున్నాయి.

1980లలో దూరదర్శన్ ప్రాంతీయ లింక్ పరిమిత సమయానికి ఉండే రోజుల నుంచి భారత మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగం సుదీర్ఘ ప్రయాణం చేసి ఈరోజు 800 చానళ్లకు పైగా సృష్టించింది. మరోపక్క సోషల్ మీడియా, ఇంటర్నెట్ పుణ్యమా అని నేడు అరచేతిలో మీట నొక్కి మాయాబజార్ సినిమాలో చూపినట్లు ఏమి తలచుకొంటే అది ప్రత్యక్షమవుతోంది. ఏది, ఎవరు, కావాలంటే వాళ్లను చూడగలం.

భారతదేశ టెలివిజన్ చరిత్రను విస్తృతంగా రెండు కాలాలుగా విభజించవచ్చు. ప్రైవేటీకరణ ముందు, తరువాత అని. ప్రైవేటీకరణ ముందు సమయాన్ని మళ్లీ రెండు దశలుగా విభజించవచ్చు. 1. ప్రీ-ఆసియాడ్ గేమ్స్, 2. పోస్ట్ ఆసియాడ్ గేమ్స్. ప్రైవేటీకరణ తరువాత కాలాన్ని మరో రెండు రకాలుగా చూడొచ్చు. 1.ప్రీ-కేబీసీ, 2.పోస్ట్-కేబీసీ.



నేడు దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ మార్కెట్లలో ఒకటి. 2000నాటికి మూడు శాతం వృద్ధి రేటుతో 2016 నాటికి 10.5 (సీఏజీఆర్) కాగా ప్రపంచ సగటు 4.2 శాతం మాత్రమే ఉండడం గమనార్హం.

- సునీల్ ధవళ, 09741747700

సమాంతర సాహిత్యం... కావాలి ప్రత్యామ్నాయం



-జయధీర్ తిరుమలరావు
సెల్ : 99519 42242

'సమాంతరం' అనే పదానికి చాలా అర్థాలు ఉన్నాయి. దానినే 'ప్రత్యామ్నాయం' అని కూడా భావించే వారు ఉన్నారు. సమాంతరం, ప్రత్యామ్నాయం ఏదైనా అంతిమంగా అది ప్రజాసాహిత్యం అనే విస్తృతార్థంలో హాయిగా కలిసే పాయలే. ప్రజలు- పాలకులు, ప్రజలు-పండితులు, ప్రజలు-పరాయికరణ వంటి వ్యతిరేకార్థాలు, చత్రాలు, ఉత్తర దక్షిణ ధ్రువ తేడాలు కొట్ట వచ్చినట్లుగా కనుపిస్తాయి. అలాంటి వ్యవస్థలో ప్రజల పక్షం అనే కేంద్రకం వద్ద నిలబడి చూసినప్పుడు ఒక ప్రత్యేకమైన, విలక్షణమైన దృక్పథం, చూపు, రాజకీయం, ప్రయోజనం సాధించడానికి పై పదాలలో దాగిన భావనలు అవసరం అవుతాయి. అనేక అస్తిత్వాలు, ప్రజాస్వామిక, సామ్యవాద ఆలోచనలకి అనుగుణంగా జరిగే అనేక ఉద్యమాలు, కార్యక్రమాలు, మార్పులు ప్రజానుకూలంగా మారకతప్పదు. చరిత్ర, సాహిత్యం, కళా సాంస్కృతిక రంగాలు నిరంతరం మారుతూంటాయి. 'మార్పు' కోసం తపిస్తాయి. ఈ క్రమంలో పలు అవసరాల దృష్ట్యా, వివిధ దశలలో వీటిని పిలుచుకుంటాం. అంతిమంగా వాటిని ప్రజల పరం చేసే ఆశయంలో సాగే ప్రయాణంలో ఇది ఒక అనివార్యమైన స్థితి.

అందుకే అనేక ఆలోచనల సారాంశంగా ఒక బలీయమైన రాజ్యయంత్రం పకడ్బందీగా ఏర్పాటు చేసిన వ్యవస్థ (ప్రధాన స్రవంతి?) ప్రశ్నించడానికి, మార్చడానికి చేసే ప్రయత్నంలో భాగంగానే ఇలాంటి సాహిత్యాన్ని చూడాలి. అప్పుడు అనేకమైన ప్రజాసమూహాల అవగాహన మేరకు కొన్ని కాలానుగుణమైన పారిభాషిక పదాలు, పేర్లు ప్రచారంలోకి వస్తాయి. వాటిని ఒకసారి చూద్దాం -

సమాంతర భావనలు, పదాలు..

రాజకీయ దృక్పథంతో సమాజంలో కనిపించే రెండు శక్తులను పాలకులు - పాలితులు, రాజులు - ప్రజలు అని పిలుస్తుంటాం.


సామాజిక కోణంలో ఉన్నతవర్గం - కిందివర్గం, శిష్టులు -సాధారణులు, పట్టణం-పల్లె అని వివిధ రకాలుగా వ్యవహరిస్తాం. కులమతపరంగా అగ్రవర్ణం-క్రింది కులం, వైదికులు-అవైదికులు, బ్రాహ్మణులు - శూద్రులు, జానపదులు (ఇంకా కిందివారిని కలిపి) అంటాం. ఆదివాసులు అని ప్రత్యేకంగా ఉన్నారు. వీరి సాహిత్యం కూడా ప్రత్యేకంగా ఉంటుంది. స్థిరనివాసం పక్కనే అస్థిరంగా సంచారం చేసే కులాల సాహిత్యం, కళలు, సంస్కృతి ప్రత్యేకంగా కనుపిస్తుంది.

మార్క్సిస్టు సిద్ధాంతపరంగా, చారిత్రక ఆర్థిక కోణాల్లోంచి ఉపరితలం - పునాది, ధనిక - పేద, యజమానులు-బానిసలు, భూస్వామి-రైతు, పెట్టుబడిదారు - కూలీ, విశ్రాంతివర్గం-శ్రామికవర్గం, దోపిడీవర్గం-దోచుకోబడే వర్గం అనే తేడాని సూచించే పదాలు ఉన్నాయి.

సాహిత్య కళారంగాలలో దీనినే మార్గ - దేశీ అని పిలుస్తారు.

అలాగే చరిత్ర రచనలో, సాహిత్య చరిత్ర రచనలోనూ ప్రధాన స్రవంతి - సమాంతర (ప్రజా) స్రవంతి ఉన్నదని పేర్కొంటుంటాం.

ఉన్నత, ధనిక వర్గాలకి చెందిన భావజాలం ప్రధాన స్రవంతిగా చెలామణి అవుతుంది. ప్రజలది సమాంతరం అవుతుందని ఒక భావన ఉంది. భావజాల రంగంలో విలువలని ఆపాదించే పదాలివి. నిజానికి సమాంతర సాహిత్యం, కళలు, సంస్కృతి, మూలవాసీ సాహిత్యం, కళలు, సంస్కృతి పునాదిగా ఉంటుంది. ఇది మూలాలికి సంబంధించింది. పునాది లేనిదే పై నిర్మాణం లేదు. కాని పునాదిని విస్మరించడానికే ఉపరితలాంశాన్ని పదేపదే నిర్మించడం జరుగుతుంది. దానికి నగిషీలు చెక్కబడతాయి. రాజ్యయంత్రం యావత్తూ దాన్ని కాపాడడానికే ప్రయత్నిస్తుంటుంది. దీనిని గురించే కవులు, రచయితలు, కళాకారులు ప్రత్యేకంగా పోషించబడతారు. వీరు ప్రజలకు దూరమై



పాలక పక్షం చేరిపోతారు. అవార్డుల కోసం వెంపర్లాడుతారు.

సాహిత్య పరంగా చూస్తే ప్రత్యామ్నాయ సాహిత్యం, జానపద సాహిత్యం, గిరిజన సాహిత్యం, దేశి సాహిత్యం, మాండలిక సాహిత్యం, ప్రజా సాహిత్యం తదితర పేర్లు కనిపిస్తాయి. ఈ పాయలన్నింటిని కిలిపి సమాంతర సాహిత్యం అని పిలుస్తుంటారు. కాని అది సరైనదేనా అనిపిస్తుంది.

సమాంతర సాహిత్యాన్నే జెండర్ పరంగా స్త్రీల సాహిత్యం అనీ, కులపరంగా అట్టడుగు వర్గాల సాహిత్యం అనీ, దళిత సాహిత్యం అనీ పిలుస్తాం. జాతిపరంగా మైనారిటీ సాహిత్యం అని పిలుస్తాం.

లేఖనం దృష్ట్యా లేఖనం కానిదాన్ని మౌఖిక సాహిత్యం అనీ, నోటి సాహిత్యం అనీ వ్యవహరిస్తాం.

ఇన్ని రకాలుగా కనిపించే వినిపించే సాహిత్యాన్ని ఒక చోట కలిపి 'సమాంతర' అనే పేరుతో పిలుచుకొంటున్నాం.

శిష్ట సాహిత్యంగా పిలవబడే సాహిత్యం మాత్రమే సాహిత్య చరిత్రలో అధికభాగం ఆక్రమించుకుంది. ఈ వర్గానికి చెందిన సాహిత్యమే ప్రధానంగా పరిశీలించబడింది. ఐతే సమాజంలో అత్యధిక శాతం ప్రజలకు సంబంధించిన సమాంతర సాహిత్యానికి, శిష్ట సాహిత్య చరిత్రలో సరైన చోటులేదు. సాహిత్య సృజనలో మాత్రం సమాంతర సాహిత్యం ఇతివృత్తాలు, బాణీలు, సంగీతం, ఛందస్సు, భాషలను తీసుకుని శిష్ట రచనలు పరిపుష్టి చెందుతున్నాయి. అదే సమయంలో వీటికి ఆ సాహిత్య చరిత్రలో స్థానం కల్పించబడడంలేదు. శివకవుల కాలం నాటి నుండి నేటి దాకా మత, ధార్మిక, రాజకీయ ఉద్యమాల కాలంలో కొంత ప్రజాస్వామీకరింపబడినట్లు అనిపించినా ఈ సాహిత్యానికి సరైన స్థానం కల్పించలేకపోయాం. కవిత్వానికి, వ్యాకరణ ఛందో రీతులు సంకెళ్లు ఎలాగో సాహిత్య చరిత్ర రచన కూడా చాలా రిజిడిటీతో, కట్టుబాట్లతో ఉన్నట్లు కనిపిస్తున్నది.

సామాజిక పురోభివృద్ధి, సాంకేతికాభివృద్ధి అనూహ్యంగా పెరిగిపోతున్న ఆధునిక కాలంలో సైతం సాహిత్య చరిత్ర తలుపులు తెరుచుకోలేదు. అందువల్ల సాహిత్య వ్యవస్థలోని ఎన్నో మేలిమి గుణాలు కూడా అజ్ఞాతం అయ్యే ప్రమాదం ఏర్పడి ఉంది. ఆ ప్రమాదం నుండి బయటపడి కొత్త సాహిత్య చరిత్ర నిర్మాణం జరగాలి. ఇందుకు సమాంతర సాహిత్యం నుండి ఎన్నో అంశాలు గ్రహించవలసి ఉంది.

నిజానికి ఈ విభాగం చాలా విస్తృతమైంది. మొదటిసారిగా ఇందుకు సంబంధించిన నానా రకాల అంశాలను సేకరించి వాటి గురించి చెప్పే సందర్భంలో మొదట ఏది సమాంతర సాహిత్యం అనే ప్రశ్న ఉదయిస్తుంది. ముందు దానికి జవాబు చూద్దాం.

ఏది సమాంతరం!

భారతదేశం చరిత్ర పొడవునా రెండు రకాల సంస్కృతి కనిపిస్తుంది. ఒకటి శిష్ట సంస్కృతి. రెండు జానపద (ప్రజా) సంస్కృతి. శిష్ట సంస్కృతి ప్రధాన స్రవంతిగా కనిపిస్తుంది. ఇది అగ్రకుల, వర్గాల వారిదైన పాలకుల సంస్కృతి. వీరి భాష నాడు సంస్కృతం. నేడు ఆంగ్లం. మధ్య యుగాలలో రాత భాష తెలుగే అయినప్పటికీ సంస్కృత భాషా సామీప్యంగల శిష్ట తెలుగు లేదా గ్రాంథిక తెలుగుభాష. ఈ భాషలో వెలువడిన ఆస్థాన సాహిత్యంలో పౌరాణిక గాథా సాహిత్య ప్రక్రియకే ప్రాధాన్యం వహించాయి. వైదిక మతం యొక్క ప్రభావం, ప్రచారమే వీటి ధ్యేయం. ఒకటీ లేదా రెండు శాతం కలిగిన కొద్దిమంది విద్యావంతుల కోసం వారి సాంస్కృతిక, మత సామాజిక హోదాకి అనుకూలమైన సాహిత్యం వెలువడింది. తెలుగులో నన్నయ మొదలు మొన్నటి కొందరి ఆస్థాన కవుల వరకూ ఈ ధోరణే కొనసాగింది.

ప్రజలది ఇందుకు భిన్నమైన సాహిత్య సంస్కృతి. సమాజంలో అత్యధిక శాతంగా ప్రజలు పాలిత వర్గంగా ఉంటారు. నిజానికి శ్రామికులే - ఉత్పత్తికి హేతువులు. పనిపాట్లలో రాటుదేలిన వాళ్లు. నిరక్షరాస్యులు. దేశభాషలో, మాండలిక భాషలో, వృత్తిపరమైన భాషలో వ్యవహారం నడిపేవారు. వీరిది ప్రధానంగా మౌఖిక సాహిత్యం. ప్రధాన స్రవంతికి సమాంతరంగా ఎంతో విలక్షణమైన సాహిత్యం. ఆ సంస్కృతికన్నా మతంకన్నా భిన్నమైన పలు సంస్కృతులను ఆచరించేవారు. శిష్ట సాహిత్యంలో శ్రీరాముడు నూరుపాళ్ల భగవత్స్వరూపుడే. కాని జానపదుల్లో పదహారణాల మానవమాత్రుడు. శిష్ట రామాయణ కథనాలు కూడా వేరువేరుగానే ఉన్నాయి. ఐతే ఇప్పటివరకు జానపదులు తమ ప్రత్యేకమైన రీతిలో వాళ్ల సంస్కృతిని కాపాడుకొంటూ రావడం భారతదేశపు ప్రత్యేకత. చాలా దేశాలలోని సమాంతర మత సంస్కృతులు చాలావరకు రూపం కోల్పోయాయి. ఇక్కడ ఇంకా ప్రజల సాహిత్యం మిగిలిపోయింది. దాని రూపుమాపడానికే పాలకవర్గ సంస్థలు, రచయితలు నిరంతరం ప్రయత్నిస్తుంటారు.

నిజానికి సమాంతర సాహిత్యాన్ని జానపద సంస్కృతి అన్నా అందుకు భిన్నమైన గిరిజన సంస్కృతిని కూడా ప్రస్తుతం అందులోకే జోడించక తప్పదు. లేదా మరికొంత విస్తరించి 'ప్రజాసంస్కృతి సాహిత్యాలు' అని చెప్పుకోవచ్చు.

ప్రజాసాహిత్యంలో పైన పేర్కొన్న సాహిత్యాలే కాకుండా పామర సాహిత్యం, కులపురాణ సాహిత్యం, ఆనాదృత వాఙ్మయం, శ్రామిక సాహిత్యం, అభ్యుదయ, ఉద్యమ, పోరాట, విప్లవ సాహిత్యాలు ఇందులో చేరతాయి. దీన్నే మరోమాటలో జనసాహిత్యం అనికూడా కొందరు అంటారు. జన ప్రజ పదాలు సమానార్థకాలు. కానీ రాజకీయ, తదితర అంశాల ఆలోచనల వల్ల ఆ పదాల వాడకం వేరువేరుగా ఉంటుంది. జనసాహితి అని ఒకరంటే, ప్రజాసాహితి అని, విప్లవ సాహితి అని అంటారు. ప్రస్తుతం ప్రత్యేకంగా వస్తున్న స్త్రీవాద సాహిత్యం, దళిత సాహిత్యం, మైనారిటీ కవిత్వం కూడా ప్రజాసాహిత్య విభాగంలోనే చేరిపోతాయి. చరిత్ర పారిభాషిక పదం దృష్ట్యా దీన్ని కొందరు అడుగువర్గాల చరిత్ర, సాహిత్యాలు sub altern అనే అర్థంలో వాడుతున్నారు. ఆయా సాహిత్యాలు రూపొందే విధానం, ప్రసారమయ్యే ప్రచారరీతి, నాటి సాహిత్య విలువలు, స్వభావం రీత్యా శిష్ట, ప్రజాసాహిత్యం వేరువేరుగా ఉంటాయని చెప్పవచ్చును. ఒక్కోచోట వీటి స్వభావాలు పూర్తిగా వ్యతిరేకంగా ఉంటాయి. ఈ రెండు సాహిత్యాల పాఠకులు, లేదా శ్రోతలు కూడా వేరుగానే ఉంటారు. ప్రజాసాహిత్యంలో ప్రజల కళలు కూడా ఒక భాగంగానే ఉంటాయి. ఒగ్గుకథ, యక్షగానం, బుర్రకథలు మొదలైన దృశ్యకళలు - శారద కథ, జమిడికి కథ, కిన్నెర పాటలు మొదలైన శ్రవ్య కళారూపాలు కూడా సమాంతర లేదా ప్రజాసాహిత్యంలో భాగాలే. పై రెండు రకాల సాహిత్యానికి శ్రోతలు లేదా ప్రేక్షకులే ఉంటారు. పాఠకులు ఉండరు. ప్రదర్శన performance సాహిత్యం literature రెండూ ఒకటే. శిష్ట సాహిత్యంలో కవి, పాఠకుడు వేరు. అందుకే శిష్ట సాహిత్యం వ్యక్తిగతం. ప్రజాసాహిత్యం సామూహికం.

ఇన్ని విధాలుగా సమాంతర మన సాహిత్య సంస్కృతిలో మిళితం అయి ఉంటుంది. ఇంత పెద్ద కడలి విస్తృతి, లోయని గుర్తించాలి. దానిని ఆహ్వానించాలి.

అలా జరగకపోతే ఒక పెద్ద అగాధం ఏర్పడుతుంది.

మిర్చి మసాలా

ఈ కన్నీరును ఏమంటారో!



బీసీల సంక్షేమం కోసం ఏమేమి చర్యలు తీసుకోవాలో సిఫారసు చేస్తే వాటిని యథాతథంగా ప్రభుత్వం అమలు చేస్తుందని ఆ సామాజిక వర్గాల ప్రజాప్రతినిధుల సమావేశంలో ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ సమావేశానికి హాజరైన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్‌తో సహా ఇతరులంతా ముఖ్యమంత్రి నిర్ణయాన్ని వేనోళ్ల కొనియాడారు. ఆ తర్వాత ముఖ్యమంత్రికి సిఫారసు చేయడానికి నిర్వహించిన సమావేశాలకు లక్ష్మణ్ హాజరై పలు సూచనలు కూడా చేసారు. అయితే బిజెపి ఓబిసి సెల్ సభలో బీసీలపై ముఖ్యమంత్రి కేసీఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారని ఇదే లక్ష్మణ్ ధ్వజమెత్తారు. ఇంతకాలం బీసీలను ఏ పార్టీ పట్టించుకోకున్నా కనీసం ఆ దిశగా సిఎం కెసిఆర్ ఏ కన్నీరో ఓ కన్నీరు కార్చినా బీసీలకు మేలు జరిగితే చాలని ఆ సామాజిక వర్గాలు ఆనందపడుతుంటే ఈ లక్ష్మణ్ ఎందుకు కన్నీరు కారుస్తున్నారో?.

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఓబీసీ క్రిమిలేయర్ పరిమితిని పెంచింది. మరీ ఇది బీసీలపై బీజేపీ సర్కార్ కార్చిన మొసలి కన్నీరు కాదంటారా?!

-వెల్జాల చంద్రశేఖర్


కృష్ణాలో చచ్చింది 'చెంబు'!

బహిరంగ మల విసర్జన రహిత జిల్లాగా దేశంలోనే కృష్ణా జిల్లా అగ్రస్థానంలో నిలిచి నేతలు, ప్రజల దృష్టిని ఆకర్షించింది. ఇందుకోసం జిల్లా కలెక్టర్ బి లక్ష్మీకాంతం తనదైన రీతిలో చేపట్టిన 'చెంబు చచ్చింది.. ఆత్మగౌరవం బతికింది' అనే నినాదం గ్రామాల్లోకి చొచ్చుకెళ్లింది. స్వయంగా కొన్ని గ్రామాల్లో తిరిగిన కలెక్టర్ స్థానికులతో మమేకమై దశాబ్దాలుగా వెంటాడుతూ వస్తున్న 'చెంబు'కు శాస్త్రోక్తంగా పాడె కట్టించి, తానుకూడా మోసి, ఆపై పూజలు జరిపించి సమాధి చేయిస్తున్న తీరు మీడియాలో దేశవ్యాప్తంగా హల్‌చల్ చేస్తోంది.

కొసమెరుపు: ఈ పథకానికి ఆద్యులైన ప్రధాని నరేంద్ర మోదీ, ప్రస్తుత ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు చిత్రపటాలు స్వచ్ఛ ప్రచార కార్యక్రమంలో ఎక్కడా కనిపించటం లేదు. మరోవైపు చెంబులు విక్రయించే వ్యాపారులు తమవద్ద పోగుపడే నిల్వలను చూసుకుంటూ ఆందోళన చెందుతున్నారు!

-నిమ్మరాజు చలపతిరావు

'స్వీట్' హైదరాబాద్



హైదరాబాద్ నగరం బిర్యానీకే కాకుండా 'స్వీట్స్' కు కూడా అంతర్జాతీయంగా పేరుప్రఖ్యాతులు సంపాదించింది. 2018 జనవరి 13 నుండి మూడు రోజుల పాటు సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న అంతర్జాతీయ స్వీట్ ఫెస్టివల్‌లో వెయ్యిరకాల స్వీట్లను ప్రదర్శిస్తున్నారు. ప్రదర్శన జరుగుతున్న చోటే స్వీట్ల తయారీ చేస్తుండటంతో అటుగా వెళ్లిన వారంతా స్వీట్ల తయారీతో వచ్చిన ఘుమఘుమలను ఆస్వాదిస్తున్నారు. వెయ్యి స్వీట్లలో ఏవి తినాలో నిర్ణయించుకోలేక చాలా మంది ఉక్కిరిబిక్కిరి అయ్యారు.

-పి.వి.రమణారావు

'విష్ణు' చక్రం


యుద్ధతంత్రంలో విష్ణుచక్రం గురించి తెలియనివారెవరున్నారు... రాజకీయాల్లో కూడా విష్ణు చక్రం బాగానే పనిచేస్తున్నట్టు తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. వైజాగ్ బీజేపీ ఎమ్మెల్యే గవర్నర్ ఇఎస్‌ఎల్ నరసింహన్‌పై అసంతృప్తి వ్యక్తం చేస్తూ నానా మాటలు అనేసరికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాగల కార్యం 'విష్ణు' తీర్చాడులే అని సంతోషపడుతోంది. వ్యవసాయ భూమిని వాణిజ్య భూమిగా మార్చడానికి ఉద్దేశించిన 'నాలా బిల్లు' ఆర్డినెన్స్‌ను తిరస్కరించిన గవర్నర్ తర్వాత దానిని బిల్లు రూపంలో ప్రభుత్వం పంపించినా దానిని సైతం ఆమోదించకుండా అనుమానాలు లేవనెత్తారు. అదే సమయంలో తెలంగాణ ప్రభుత్వం పంపిన బిల్లును ఆమోదించినట్టు తెలుసుకున్న ఆంధ్రా ప్రభుత్వం తన అస్త్రాలను ప్రయోగించింది. అంతే 'విష్ణు' రూపంలో ప్రయోగించిన చక్రం బాగానే పనిచేసింది. గవర్నర్ సంతకం అయిపోయింది.

-బి.వి.ప్రసాద్

నేరస్థుల సర్వే..

సమగ్ర సర్వే మాదిరిగా సమగ్ర నేరస్థుల సర్వేకు పోలీసు శాఖ శ్రీకారం చుట్టింది. ఈ సర్వే ద్వారా దొంగలెవ్వరో తేల్చేస్తారు. సమగ్ర సర్వే ఆశించిన రీతిలో జరగలేదనే ఆరోపణలు వచ్చాయి. అదేదో కులాలు, సామాజిక హోదా లెక్కల కోసం జరిగింది కాబట్టి సరిపోయింది. సమగ్ర నేరస్తుల సర్వే అలా కాదు. పోలీసు శాఖలో ఉన్నత స్థాయిలో ఎన్ని మార్పులొచ్చినా సిబ్బందిలో ఆ మార్పు ఆశించినంత ఇంకా రాలేదు. ఈ నేపథ్యంలో నేరగాళ్ల లెక్కలు కూడా సమగ్ర సర్వేలా మొక్కుబడిగా నిర్వహిస్తారేమో వేచి చూద్దాం!

-బి.వి.రమణ








సంక్రాంతి పండుగ అంటేనే మహిళలకు ముచ్చటైన పండుగ. మన తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. ఉత్తర భారతంలోనూ ఇళ్ల ముందు చక్కగా రంగవల్లులు తీర్చి దిద్దుతారు. ఈశాన్య భారతం త్రిపురలోని ధర్మానగర్‌లో శనివారం తన ఇంటి ముందు రంగులతో ముగ్గులు దిద్దుతున్న ఓ మహిళ. సంక్రాంతి అంటే ముగ్గులే కాదండోయ్... ఇలా సామూహికంగా చెరువుల్లో చేపలు కూడా పడతారు. అసోం రాజధాని గౌహతికి సమీపంలోని గొరైమారీ చెరువులో చేపలు పడుతున్న జాలర్లు.

కార్తీ నివాసంలో ఈడీ తనిఖీలు

ఎయిర్‌సెల్-మాక్సిస్ కేసులో చిదంబరం ఇల్లుసహా 9చోట్ల సోదాలు

న్యూఢిల్లీ, జనవరి 13: ఎయిర్‌సెల్-మాక్సిస్ కేసులో కాంగ్రెస్ సీనియర్ నేత పి చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరం ఇంటిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. కార్తీ చిదంబరం కార్యాలయం, ఆయన అనుచరులైన పలువురి ఇళ్లపై ఈడీ విస్తృతంగా తనిఖీలు జరిపింది. అలాగే ఢిల్లీలోని కార్తీ తండ్రి మాజీ కేంద్ర మంత్రి చిదంబరం నివాసంలోనూ సోదాలు జరిగాయి. కార్తీ చిదంబరంపై మనీలాండరింగ్ కేసులు నమోదైన సంగతి తెలిసిందే. మొత్తం తొమ్మిది ప్రాంతాల్లో ఈడీ సోదాలు చేసింది. చెన్నైలో తొమ్మిదిచోట్ల, దక్షిణ ఢిల్లీలోని జోర్‌బాగ్‌లోని చిదంబరం నివాసంలో దాడులు జరిపినట్టు ఈడీ అధికారులు వెల్లడించారు. కార్తీ నివాసం థౌజండ్ లైట్స్ ప్రాంతంలో సోదాలు చేసినట్టు వారు చెప్పారు. చిదంబరం కుమారుడికి సన్నిహితుడైన ఓ చార్టర్డ్ అకౌంట్, కార్తీ సహాయకుడినీ ఈడీ వదలిపెట్టలేదు. మరోపక్క ఈడీ తనిఖీలు ఓ కామెడీలా చిదంబరం కొట్టిపారేశారు. సోదాలు జరిపిన వట్టిచేతులతో వెళ్లిన ఈడీ అధికారులు తమకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. జోర్‌బాగ్‌లో నివాసం వద్ద చిదంబరం మీడియాతో మాట్లాడుతూ 'డిసెంబర్ 1న కార్తీ, ఆయన బంధువుల ఇళ్లపై ఈడీ దాడులు జరిపింది. అప్పుడు ఏం ఆధారాలు లభించాయి?' అని కాంగ్రెస్ నేత ప్రశ్నించారు. ఇదంతా రాజకీయ కక్ష సాధింపుతో చేస్తున్నదేనని ఆయన ఆరోపించారు. అయితే సీబీఐ ఎఫ్ఐఆర్‌ను ఆధారం చేసుకునే తనిఖీలు నిర్వహించినట్టు ఈడీ వెల్లడించింది.





న్యూఢిల్లీ జోర్‌బాగ్‌లోని కార్తీ చిదంబరం ఇంట్లో తనిఖీలు చేసేందుకు వచ్చిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు. సోదాల అనంతరం విలేఖరులతో మాట్లాడుతున్న పి.చిదంబరం

పాక్ కాల్పుల్లో ఆర్మీ జవాను మృతి

జమ్ము, జనవరి 13: కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి పాకిస్తాన్ లైన్ ఆఫ్ కంట్రోల్ వద్ద జరిపిన కాల్పుల్లో ఒక ఆర్మీ జవాను మృతిచెందాడు. రాజౌరీ జిల్లాలోని సుందర్‌బనీ సెక్టార్‌లో విధులు నిర్వహిస్తున్న లాన్స్ నాయక్ యోగేష్ మురళీధర్ భదానె (22) పాక్ ఆర్మీ అకస్మాత్తుగా జరిపిన కాల్పుల్లో తీవ్రంగా గాయపడ్డాడని, ఆసుపత్రికి తరలించేలోపే ఆయన మృతిచెందాడని ఆర్మీ అధికారులు తెలిపారు. మురళీధర్ మహారాష్ట్రలోని ధూలే జిల్లా ఖలాగే గ్రామానికి చెందినవాడని వివరించారు. రాజౌరీ జిల్లాలోనే డిసెంబర్ 31న సిపాయ్ జగ్‌సిర్ సింగ్ పాక్ జరిపిన కాల్పుల్లో మృతిచెందిన విషయం తెలిసిందే.



శ్రీనగర్-బారాముల్లా హైవే శివారులో ఉగ్రవాదులు అమర్చిన బాంబులను నిర్వీర్యం చేస్తున్న ఆర్మీ నిపుణులు

ఇప్పటికైనా నోరువిప్పండి

ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకుందాం ■ కేంద్ర మంత్రులు, బీజేపీ నేతలకు యశ్వంత్ పిలుపు

న్యూఢిల్లీ, జనవరి 13: సుప్రీం కోర్టు న్యాయమూర్తుల మాదిరిగానే ప్రజాస్వామ్యం కోసం నిర్భయంగా తమ మనసులోని మాటను వ్యక్తీకరించాలని పార్టీ సహచరులు, మంత్రులకు బీజేపీ సీనియర్ నాయకుడు యశ్వంత్ సిన్హా పిలుపునిచ్చారు. ప్రస్తుతం దేశంలో 1975నాటి ఎమర్జెన్సీ వాతావరణం నెలకొందని, పార్లమెంటు సమావేశాలు కూడా సక్రమంగా జరగడం లేదని యశ్వంత్ అన్నారు. పార్లమెంటు సక్రమంగా పనిచేయకపోతే సుప్రీం కోర్టులోనూ సరైన వ్యవస్థ లేకపోతే దేశంలో ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లినట్లేనని శనివారం నాడిక్కడ జరిగిన విలేఖరుల సమావేశంలో సిన్హా అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని నలుగురు న్యాయమూర్తులు చేసిన వ్యాఖ్యలను లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉందని యశ్వంత్ అన్నారు. ప్రజాస్వామ్యం కోసం పరితపించే ప్రతి ఒక్కరూ తమ మనసులోని మాటను నిర్భయంగా బయటకు చెప్పాలని పిలుపునిచ్చిన యశ్వంత్, బీజేపీ నాయకులు, సీనియర్ కేబినెట్ మంత్రులు కూడా ఈ విషయంలో ముందుకు రావాలన్నారు. అయితే సుప్రీం కోర్టులో తలెత్తిన సంక్షోభాన్ని పరిష్కరించుకోవాల్సిన బాధ్యత అత్యున్నత న్యాయస్థానానిదేనని ఆయన స్పష్టం చేశారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి మాదిరిగానే ప్రభుత్వంలో ప్రధాన మంత్రి అత్యంత కీలకమైన వ్యక్తి అని, ఈ నేపథ్యంలో ఆయన సహచరులు ఎలాంటి సమస్య తలెత్తినా తమ అభిప్రాయాలను వెల్లడించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంలో మంత్రులు ఎలాంటి పరిస్థితుల్లో పనిచేస్తున్నారో తనకు వ్యక్తిగతంగా తెలుసునని, ఇలాంటి పరిస్థితి కూడా ప్రజాస్వామ్యానికి ముప్పు సంకేతమేనని పేర్కొన్నారు. ప్రస్తుత న్యాయ సంక్షోభంలో రాజకీయ నాయకులు జోక్యం చేసుకోకూడదన్న వాదనను ఆయన తిరస్కరించారు. నలుగురు సీనియర్ న్యాయమూర్తులే మీడియా ముందుకు వచ్చి తమ మనోభావాలను వెల్లడించిన నేపథ్యంలో ఈ సంక్షోభం ఎంత మాత్రం సుప్రీం కోర్టుకే పరిమితమైనది కాదని అన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ తమ ఆందోళనను, అభిప్రాయాన్ని సహేతుకంగా వ్యక్తీకరించాలని, ముఖ్యంగా ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లే పరిస్థితులున్నాయంటూ నలుగురు సీనియర్ న్యాయమూర్తులు వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఇటు రాజకీయ పార్టీలు, అటు పార్లమెంట్ ఉదాసీనంగా ఉండడానికి వీలులేదని అన్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తొలి దశ జనవరి 29 నుంచి ఫిబ్రవరి 9 వరకు జరుగుతున్నాయన్న అంశాన్ని ప్రస్తావించిన సిన్హా, ఇంత స్వల్ప వ్యవధిపాటు పార్లమెంటు సమావేశాలు జరగడం తానెప్పుడూ చూడలేదని, ఇది కూడా ప్రజాస్వామ్యానికి ముప్పేనని తెలిపారు.



న్యాయ వ్యవస్థ పరిరక్షణకే..

దీపక్ మిశ్రాపై తిరుగుబాటును సమర్థించుకున్న జస్టిస్ కురియన్ జోసెఫ్

కోచీ, జనవరి 13: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాపై తిరుగుబాటును జడ్జి కురియన్ జోసెఫ్ సమర్థించుకున్నారు. సీజేఐపై తిరుగుబాటు చేసిన నలుగురు న్యాయమూర్తుల్లో కురియన్ కూడా ఒకరు. శనివారం నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ తాము లేవనెత్తిన అంశాలు పరిష్కారం అవుతాయన్న విశ్వాసం వ్యక్తం చేశారు. తమ బెంచ్‌లకు ఎంపిక చేసిన కేసులే కేటాయించడం, సుప్రీంలో పరిపాలన గాడితప్పడం వంటి అంశాలనే ఢిల్లీలో తాము ప్రస్తావించామని కురియన్ స్పష్టం చేశారు. న్యాయవస్థను కాపాడి, ప్రజాస్వామ్య మనుగడకు నష్టం కలగకూడదన్నదే తమ ఉద్దేశమని ఆయన చెప్పారు. సుప్రీం కోర్టు పనితీరులో పూర్తి పారదర్శకత ఉంటాలని లేనిపక్షంలో ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతుందని ఆయన అన్నారు. ఇవే అంశాలను తాము ఢిల్లీ మీడియా సమావేశంలో వ్యక్తం చేసినట్టు కురియన్ జోసెఫ్ స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థకు నష్టం జరుగుతోందన్న ఆవేదనతోనే తాము గళం విప్పాల్సి వచ్చిందని ఓ మలయాళం టీవీ న్యూస్‌చానల్‌తో అన్నారు. న్యాయమూర్తి కురియన్ తన పూర్వికుల గ్రామం కలాడే వచ్చిన సందర్భంగా న్యూస్‌చానల్ వెళ్లి కలిసింది. 'సుప్రీం కోర్టులో జరుగుతున్న వ్యవహారాన్ని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా దృష్టికి తెచ్చినా ఫలితం కనిపించలేదు. అలాంటి పరిస్థితుల్లో అప్రమత్తం చేయాలన్న ఉద్దేశంతోనే మీడియా ముందుకొచ్చాం' అని న్యాయమూర్తి అన్నారు. ప్రజలకు న్యాయ వ్యవస్థపై విశ్వాసం కల్గించాలన్నదే తమ ఉద్దేశమని కురియన్ పేర్కొన్నారు. సుప్రీం కోర్టు సీనియర్ న్యాయమూర్తులు జే చలమేశ్వర్, రంజన్ గొగోయ్, ఎంబీ లోకూర్, కురియన్ జోసెఫ్ శుక్రవారం ఢిల్లీలో మీడియా సమావేశం పెట్టి సీజేపై విమర్శలు గుప్పించారు. సర్వోన్నత న్యాయస్థానంలో పాలన గాడితప్పుతోందని, ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాల్సింది పోయి ఏకపక్షంగా సాగుతోందని జడ్జిలు ఆరోపించారు. పరిస్థితి చక్కదిద్దకపోతే ప్రజాస్వామ్యం మనగలగలేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గత కొన్ని నెలలుగా కోర్టులో పరిస్థితులు పక్కదారిపట్టాయని సుప్రీంలో సెకండ్ సీనియర్ జడ్జి చలమేశ్వర్ ధ్వజమెత్తారు. ఇదే విషయాన్ని కొన్నాళ్ల క్రితమే తాము నలుగురం ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశామని అన్నారు.



ఓటేయనందుకు కాటేశారు

రాంచీలో 13 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం, హత్య

రాంచి, జనవరి 13: రాంచీలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో తమకు ఓటు వేయనందుకు ఆ కుటుంబానికి చెందిన 13 సంవత్సరాల బాలికను కిడ్నాప్ చేసి సామూహిక అత్యాచారం జరిపి, దారుణంగా హత్యచేశారు. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసిన వ్యక్తితోపాటు అతని బంధువులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. ఈ బాలిక కుటుంబ సభ్యులు నిందితుడి భార్యకు అనుకూలంగా ఓటు వేయకపోవడమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 8న ఉదయం 6 గంటలకు ఈ బాలిక కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకు వెళ్లిందని, అప్పటినుంచీ కనిపించకుండా పోయిందని చెబుతున్నారు. దాంతో ఆ బాలిక తండ్రి అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరునాడు ఆ బాలిక మృతదేహం ఓ అడవి సమీపంలో దొరికింది. పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసిన ప్రేమ్‌లాల్ హన్స్‌దా భార్యకు అనుకూలంగా తాము ఓటు వేయకపోవడంవల్లే ఈ కిరాతకానికి ఒడిగట్టారని బాలిక తండ్రి ఆరోపించాడు. ఈ ఎన్నికల్లో తన భార్య ఓడిపోవడానికి ఈ బాలిక కుటుంబ సభ్యులు ఓటు వేయకపోవడమే కారణమని భావించిన ప్రేమ్‌లాల్ అతని బంధువులతో కలిసి ఈ సామూహిక అత్యాచారానికి పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. ప్రేమ్‌లాల్, ఆయన బంధువులే తన కుమార్తెను కిడ్నాప్ చేసి, సామూహిక అత్యాచారం చేశారని, అనంతరం బాలికను చంపి బ్లేవన్ అడవి సమీపంలో పడవేశారని బాలిక తండ్రి ఆరోపించాడు. ఇదే విషయాన్ని పోలీసు సూపరింటెండ్ ధ్రువీకరించారు.

ఆరోపణలు అవాస్తవం

హెచ్‌సీఏలో సభ్యత్వం ఉంది మాజీ క్రికెటర్ అజరుద్దీన్ స్పష్టీకరణ



హైదరాబాద్, జనవరి 13: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ)లో సభ్యత్వంపై చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని ప్రముఖ క్రికెటర్, మాజీ భారత జట్టు కెప్టెన్ అజారుద్దీన్ స్పష్టం చేశాడస. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అజర్ మాట్లాడుతూ, తనకు హెచ్‌సీఏలో సభ్యత్వం ఉందని, సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం వేరే ఇతర సంఘాల్లో కొనసాగినప్పటికీ, హెచ్‌సీఏలో సభ్యత్వం పొందే అవకాశం ఉంటుందని చెప్పాడు. తెలంగాణ క్రికెట్ అసోసియేషన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా తాను కొనసాగడం లేదని స్పష్టం చేశాడు. ఎలాంటి ఆధారాలు లేకుండా తన సభ్యత్వంపై ఆరోపణలు చేయడం సరికాదని అన్నాడు. ప్రస్తుత పరిణామాలు, హెచ్‌సీఏలో జరిగిన అవకతవకలపై బీసీసీఐకి త్వరలో ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపాడు. తాను ఉత్తరప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తాననే వార్తలు పట్ల ఆవేదన వ్యక్తం చేశాడు. తాను పక్కా హైదరాబాదీనని, దేశంలో హైదరాబాద్‌కు పేరు తెచ్చేందుకే ఇన్నాళ్లు క్రికెట్ ఆడానని అన్నాడు. హెచ్‌సీఏ అధ్యక్షుడు వివేక్ చేస్తున్న ఆరోపణలు తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్నాయని, వీటిపై చట్టపర్యమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్టు చెప్పాడు. ఇటీవల జరిగిన హెచ్‌సీఏ సమావేశానికి ఆహ్వానం వచ్చినందుకే తాను సమావేశానికి హాజరయ్యేందుకు వెళ్లానని స్పష్టం చేశాడు. కొంత మంది వ్యక్తిగత స్వార్థం కోసం టోర్నమెంట్లను నిర్వహించడం సరికాదని, అధికారికంగా పోటీలను నిర్వహిస్తే ప్రతిభ గల నిరుపేద క్రీడాకారులకు ఎంతో లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నాడు. నిరుపేద క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత హెచ్‌సీఏపై ఉందన్నాడు. క్రీడాకారులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడానికి తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని పేర్కొన్నాడు.

స్వప్నం సాకారం!

సాకర్ మ్యాచ్‌కు సౌదీ మహిళలకు అవకాశం

జెడ్డా, జనవరి 13: స్టేడియంలో మ్యాచ్‌లను తిలకించాలన్న సౌదీ అరేబియా మహిళా సాకర్ అభిమానుల చిరకాల స్వప్నం ఎట్టకేలకు సాకారమైంది. కింగ్ అబ్దుల్లా స్పోర్ట్స్ సిటీ స్టేడియంలో స్థానిక జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌కి అధికారులు మహిళలను అనుమతించారు. యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ పట్టాభిషేకం సందర్భంగా సౌదీ అరేబియా పలు సంస్కరణలను ప్రకటించింది. అందులో భాగంగానే మహిళలకు కూడా స్టేడియాల్లో మ్యాచ్‌లను చూసేందుకు అవకాశం కల్పించాలని గత ఏడాది అక్టోబర్‌లో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దానిని ఇప్పుడు అమలు చేశారు. ఒక దేశవాళీ ఫుట్‌బాల్ మ్యాచ్‌కి మహిళలను 'ఫ్యామిలీ సెక్షన్' కింద ఏర్పాటు చేసిన ప్రత్యేక బాక్స్‌లోకి అనుమతించారు. ఈ ఒరవడి కొనసాగుతుందని, మహిళలకు స్టేడియాల్లో ప్రవేశంపై ప్రత్యేక చట్టాన్ని రూపొందిస్తారనీ సౌదీ క్రీడా ప్రాధికార సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. సౌదీలో మహిళలకు ఇటీవల కాలం వరకూ వాహనాలను నడిపించే అవకాశం ఉండేది కాదు. గత ఏడాది మహిళలకు లైసెన్సులు జారీ చేసిన సర్కారు ఇప్పుడు మహిళా సాకర్ అభిమానుల చిరకాల కలను నెరవేర్చింది.



భారత్, చైనా తోడ్పాటు భేష్

పర్యావరణ పరిరక్షణపై ఐరాస కితాబు ■ కొన్ని దేశాలు సహకరించడం లేదంటూ వ్యాఖ్య

న్యూయార్క్, జనవరి 13: పర్యావరణ పరిరక్షణలో ఇతర దేశాలు విఫలమవుతున్న నేపథ్యంలో వాతావరణ సమతూకాన్ని కాపాడే విషయంలో భారత్, చైనాలు అద్భుతమైన నాయకత్వ పటిమను, నిబద్ధతను కనబరుస్తున్నాయని ఐక్యరాజ్య సమితి ప్రశంసించింది. పర్యావరణ సమతూకాన్ని పరిరక్షించుకునే విషయంలో ఐరాస గురుతరమైన రీతిలోనే తన కర్తవ్యాన్ని నిర్వహిస్తోందని సెక్రటరీ జనరల్ ఆంటోనియా గటెరస్ స్పష్టం చేశారు. వాతావరణ మార్పుల ప్రతికూల ప్రభావం వల్ల ఆఫ్రికా దేశాలు తీవ్రస్థాయిలో నష్టపోతున్నాయని పేర్కొన్న ఐరాస సెక్రటరీ జనరల్ 'వాతావరణ మార్పుల నిరోధన విషయంలో మనం ఓడిపోకూడదు. ఈ విషయంలో నిరంతర ప్రయత్నం ద్వారా అంతిమ విజయాన్ని చేకూర్చుకునేందుకు సన్నద్ధం కావాలి' అని వెల్లడించారు. 77 దేశాల జి-77 నాయకత్వ బాధ్యతను ఈజిప్ట్ చేపట్టిన సందర్భంగా జరిగిన ఓ కార్యక్రమంలో గటెరస్ మాట్లాడారు. ఇప్పటివరకూ ఈ బాధ్యతను ఈక్వెడార్ నిర్వహించింది. వాతావరణ ప్రతికూల మార్పుల వల్ల జి-77 దేశాలే తీవ్రంగా దెబ్బతింటున్నాయని, ఈ దేశాల్లో తీవ్రస్థాయిలో కరవు కాటకాలు సంభవిస్తున్నాయని తెలిపారు. అలాగే చిన్న చిన్న దీవి దేశాలు ఉప్పెనలు, తుఫాన్ల వల్ల అపారంగా నష్టపోతున్నాయని అన్నారు. భూతాపం పెరిగిపోవడం వల్ల మంచు పర్వతాలు కరిగి సముద్రాల్లో కరగడం వల్ల వాటి ఉపరితలం పెరిగిపోతోందని, దీని పర్యవసానంగానే ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయని ఆయన అన్నారు.

77 దేశాల ఈ కూటమిలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలుగా ఉన్న భారత్, చైనాలు పర్యావరణ పరిరక్షణ చర్యల విషయంలో అద్భుతమైన నాయకత్వాన్ని కనబరుస్తున్నాయని అన్నారు. వాతావరణాన్ని పరిరక్షించుకోకపోతే ప్రకృతి విలయాలు, వైపరీత్యాలు సమస్త జీవకోటి జీవనాన్ని కబళించే పరిస్థితులు ఉన్నప్పటికీ ఈ విషయంలో కొన్ని దేశాలు విఫలమవుతున్నప్పటికీ భారత్, చైనాలు కట్టుదిట్టమైన రీతిలో ప్రకృతి సమతూకాన్ని పరిరక్షించే చర్యలను నిబద్ధతతో చేపడుతున్నాయని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురు రెజ్లర్లు దుర్మరణం

ముంబై, జనవరి 13: మహారాష్ట్రలోని సాంగ్లి జిల్లాలో శనివారం జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో ఆరుగురు దుర్మరణం చెందారు. వీరిలో ఐదుగురు రెజ్లర్లు ఉన్నారు. మృతులంతా దంగల్‌లోని క్రాంతి కృషి సంకుల్ ఇనిస్టిట్యూషన్‌కు చెందినవారు. సతారాలోని కడెగాన్-సాంగ్లి రోడ్డుపై ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. సాంగ్లి జిల్లాలోని ఔనధ్ గ్రామంలో జరిగిన ఒక పోటీలో పాల్గొన్న అనంతరం వీరంతా తిరిగి వెళ్తుండగా శుక్రవారం అర్థరాత్రి దాటిన తర్వాత వీరి వాహనం ట్రాక్టర్‌ను బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. అయితే, రోడ్డుకు వ్యతిరేక మార్గంలో ట్రాక్టర్ రావడంతోనే ఈ ప్రమాదం జరిగిందని, ఇందుకు కారకుడైన డ్రైవర్ పరారీలో ఉన్నాడని, అతనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు. కాగా, తమ ఇనిస్టిట్యూట్‌కు చెందిన ఐదుగురు రెజ్లర్లు రోడ్డు ప్రమాదంలో అకాల మృతి చెందడం పట్ల ఇనిస్టిట్యూట్ కార్యదర్శి శరద్ లాడ్ తీవ్ర సంతాపం తెలిపారు. ఈ దుర్ఘటన తమకు దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆయన పేర్కొన్నారు.



రోడ్డు ప్రమాదానికి గురైన రెజ్లర్ల కారు వద్ద గుమికూడిన జనం

బిజినెస్

రెండు సంస్థల విలీనం

- ఒక్కటవుతున్న ఐడీఎఫ్‌సీ బ్యాంక్, క్యాపిటల్ ఫస్ట్
- ఆమోదించిన ఇరు సంస్థల బోర్డులు

ముంబయి, జనవరి 13: ఐడీఎఫ్‌సీ బ్యాంక్, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ క్యాపిటల్ ఫస్ట్ విలీనం కానున్నాయి. తమ విలీనానికి సంబంధించిన ప్రతిపాదనను తమ బోర్డులు ఆమోదించాయని ఈ రెండు సంస్థలు శనివారం వెల్లడించాయి. ఈ రెండు సంస్థల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం, క్యాపిటల్ ఫస్ట్‌కు చెందిన ప్రతి పది షేర్లకు ఐడీఎఫ్‌సీ బ్యాంక్ 139 షేర్లను జారీ చేస్తుంది. 'ఈ ఒప్పందం ఐడీఎఫ్‌సీ బ్యాంక్ పరివర్తనకు దోహదపడుతుంది. ఈ రెండు సంస్థలు కలిసి విభిన్నమైన, వేగంగా వృద్ధి చెందగల యూనివర్సల్ బ్యాంక్‌ను సృష్టిస్తాయి.


ఈ విలీనం రెండు సంస్థల వాటాదారులందరికీ వాటాల విలువను పెంచుతుంది' అని ఐడీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ రాజీవ్ లాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్యాపిటల్ ఫస్ట్ విలీనం వల్ల రూ. 22,974 కోట్ల (2017 సెప్టెంబర్ నాటికి) లోన్ బుక్ గల రిటెయిల్ లెండింగ్ ఫ్రాంచైజీ ఐడీఎఫ్‌సీ బ్యాంకుకు కలుస్తోందని ఆ ప్రకటన వివరించింది. దీనివల్ల ఆ సంస్థకున్న 30 లక్షల మంది వినియోగదారులు, 228 ప్రదేశాల్లోని పంపిణీ నెట్‌వర్క్ కూడా జత కలుస్తున్నాయని తెలిపింది. క్యాపిటల్ ఫస్ట్ అసెట్స్ అండర్ మేనేజ్‌మెంట్ (ఏయూఎం)లో 27 శాతం అయిదేళ్ల సీఏజీఆర్‌తో, లాభాలలో 40 శాతంతో, 1.63 శాతం స్థూల లాభంతో, ఒక శాతం నికర లాభంతో ఈ సంస్థ వృద్ధి చెందుతోందని ఆ ప్రకటన వివరించింది. రెండు సంస్థల విలీనానంతరం ఏర్పడే కొత్త సంయుక్త సంస్థ ఏయూఎం రూ. 88వేల కోట్లు ఉంటుంది. క్యాపిటల్ ఫస్ట్‌కు ప్రస్తుతం చైర్మన్, ఎండీగా ఉన్న వి.వైద్యనాథన్ విలీనానంతరం ఏర్పడే కొత్త సంస్థకు ఎండీ, సీఈఓగా వ్యవహరిస్తారు. విలీనానంతరం లాల్ ఐడీఎఫ్‌సీ బ్యాంక్‌కు నాన్-ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. అయితే, ఈ పదవులు చేపట్టడానికి నియంత్రణ సంస్థల నుంచి ఆమోదం పొందాల్సి ఉంటుంది.

ఆరో వారమూ లాభాల్లో మార్కెట్లు

- సరికొత్త గరిష్ఠ స్థాయిలకు సూచీలు
- 438 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
- 122 పాయింట్లు పుంజుకున్న నిఫ్టీ
- ఈ వారం మార్కెట్ సరళిపై సమీక్ష

ముంబయి, జనవరి 13: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా ఆరో వారం లాభాల్లో ముగిశాయి. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) సెన్సెక్స్ ఈ వారంలో 438.54 పాయింట్లు పుంజుకొని సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయి 34,592.39 పాయింట్ల వద్ద ముగియగా, 50 షేర్లతో కూడిన నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) నిఫ్టీ కొత్త మైలురాయి 10,600 పాయింట్లను అధిగమించింది. ఈ వారంలోని ఎక్కువ ట్రేడింగ్ సెషన్లలో కీలక సూచీలు రికార్డుల పరుగులు తీయడంతో స్టాక్ మార్కెట్లలో షేర్ల ధరలు పటిష్ఠంగా ఉన్నాయి. కార్పొరేట్ కంపెనీల మూడో త్రైమాసిక ఫలితాలు వెలువడనున్న తరుణంలో కొద్దిసార్లు మాత్రం మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించి లాభాల స్వీకరణకు పూనుకున్నారు. అలాగే నలుగురు సీనియర్ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించి, ప్రధాన న్యాయమూర్తి వ్యవహరిస్తున్న తీరుపై బహిరంగంగా విమర్శలు గుప్పించడంతో అత్యున్నత న్యాయస్థానం నిర్వహణపై ఆందోళన చెందిన మదుపరులు కొద్దిసేపు అమ్మకాలకు పూనుకున్నారు.

దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి అంచనాను గత వారం సెంట్రల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్ (సీఎస్ఓ) తగ్గించినప్పటికీ, ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) మూడో త్రైమాసికంలో నికర లాభం వృద్ధి రేటు పడిపోయినప్పటికీ, ఇతర కార్పొరేట్ కంపెనీల లాభాలు బాగుంటాయనే ఆశాజనక దృక్పథం మదుపరులలో నెలకొనడంతో పాటు స్టాక్ మార్కెట్లలోకి దేశీయ నిధులు తరలిరావడం వల్ల మార్కెట్లలో కొనుగోళ్లు పుంజుకొని కీలక సూచీలు ఈ వారంలో సరికొత్త రికార్డు గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. ప్రపంచ స్టాక్ మార్కెట్లలోని సానుకూల ధోరణులు కూడా ఈ వారం దేశీయ స్టాక్ మార్కెట్లకు ఊతంగా నిలిచాయి.



అమెరికా హెచ్1బీ వీసా నియమాలు ఎట్టకేలకు భారతీయులకు అనుకూలంగానే మిగిలిపోవడంతో ఐటీ సూచీ పుంజుకుంది. రిలయన్స్, ఇన్ఫోసిస్, కోల్ ఇండియా, ఐటీసీ వంటి ఇండెక్స్‌లోని దిగ్గజ కంపెనీల షేర్లకు మదుపరుల నుంచి కొనుగోళ్ల మద్దతు లభించడంతో కీలక సూచీలు పైకి ఎగబాకాయి. ఈ వారంలో సెన్సెక్స్ అధిక స్థాయిల వద్ద ప్రారంభమయి, ఆల్‌టైమ్ హై 34,638.42, కనిష్ట స్థాయి 34,216.33 పాయింట్ల మధ్య కదలాడింది.

చివరకు ఈ వారంలో క్రితం వారం ముగింపుతో పోలిస్తే 438.54 పాయింట్ల (1.28 శాతం) లాభంతో సరికొత్త గరిష్ఠ స్థాయి 34,592.39 పాయింట్ల వద్ద ముగిసింది. సెన్సెక్స్ క్రితం అయిదు వారాలలో కలిపి 1,681.71 పాయింట్లు (5.12 శాతం) పుంజుకుంది.

నిఫ్టీ కూడా ఈ వారం 10,591.70 పాయింట్ల అధిక స్థాయిల వద్ద ప్రారంభమయి, పైకి ఎగబాకుతూ 10,600 స్థాయిని అధిగమించి, గరిష్ఠంగా 10,690.40 పాయింట్ల, కనిష్టంగా 10,588.55 పాయింట్ల మధ్య కదలాడింది. చివరకు క్రితం వారం ముగింపుతో పోలిస్తే 122.40 పాయింట్ల (1.16 శాతం) లాభంతో 10,681.25 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఈ వారంలో రియల్టీ రంగం అత్యధికంగా లాభపడింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజి (ఐటీ), టెక్, ఐపీఓ, చమురు- సహజ వాయువు, మెటల్, ఎఫ్ఎంసీజీ, క్యాపిటల్ గూడ్స్, బ్యాంకులు, హెల్త్‌కేర్, కన్స్యూమర్ డ్యూరబుల్స్ తరువాత స్థానాల్లో నిలిచాయి. అయితే, పవర్, ఆటో రంగాలు లాభాల స్వీకరణకు గురయ్యాయి. ఇదిలా ఉండగా, ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు), విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐలు) ఈ వారంలో నికరంగా రూ. 496.47 కోట్ల విలువయిన షేర్లను విక్రయించారు. ఎస్అండ్‌పీ బీఎస్ఈ మిడ్-క్యాప్ సూచీ ఈ వారంలో ముందుకు సాగి 67 పాయింట్లు (0.37 శాతం) పెరిగి 18,137.03 పాయింట్ల వద్ద ముగిసింది. ఎస్అండ్‌పీ బీఎస్ఈ స్మాల్-క్యాప్ సూచీ 288.27 పాయింట్లు (1.46 శాతం) పుంజుకొని 19,993.19 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఈ రెండు సూచీలు పుంజుకోవడం ద్వారా సెన్సెక్స్ పైకి ఎగబాకింది.

ఈడీ కస్టడీకి గార్గ్

ఆంధ్రాబ్యాంకును ముంచిన కేసులో మాజీ డైరెక్టర్ అనూప్ ప్రకాశ్ అరెస్టు

న్యూఢిల్లీ, జనవరి 13: మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శుక్రవారం సాయంత్రం అరెస్టు చేసిన ఆంధ్రా బ్యాంకు మాజీ డైరెక్టర్ అనూప్ ప్రకాశ్ గార్గ్‌ను తదుపరి దర్యాప్తు కోసం శనివారం కస్టడీలోకి తీసుకుంది. మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ (ఎంఎం) రీతూ సింగ్ శనివారం అనూప్ ప్రకాశ్ గార్గ్‌ను ఈడీ కస్టడీకి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈడీ అధికారులు అరెస్టు చేసిన గార్గ్‌ను అంతకు ముందు ఎంఎం కోర్టులో హాజరు పరిచారు. మనీలాండరింగ్ కేసులో తదుపరి దర్యాప్తు కోసం గార్గ్‌ను తమ అదుపులోకి తీసుకొని ఇంటరాగేట్ చేయాల్సిన అవసరం ఉందని ఈడీ చేసిన విజ్ఞప్తికి మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ అంగీకరించి, అందుకు అనుగుణంగా ఆదేశాలు జారీ చేశారు. గార్గ్‌ను రెండు వారాల పాటు తమ కస్టడీకి అప్పగించాలని ఈడీ కోరింది. బ్యాంకును రూ. 5వేల కోట్ల మేరకు మోసం చేసిన ఈ కేసులో గుజరాత్‌లోని ఫార్మా కంపెనీ స్టెర్లింగ్ బయోటెక్ కూడా నిందితురాలిగా ఉంది. ఈ మనీలాండరింగ్ కేసులో ఈడీ ఇప్పటికే నిరుడు నవంబర్‌లో ఢిల్లీకి చెందిన వ్యాపారవేత్త గగన్ ధావన్‌ను అరెస్టు చేసింది. ఈ కేసులో ఈడీ అరెస్టు చేసిన రెండో వ్యక్తి గార్గ్. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద గార్గ్‌ను అరెస్టు చేశారు. ఈ కేసులో ఈడీతో పాటు కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) కూడా గార్గ్‌ను నిందితుడిగా పేర్కొంది.

యాంఫిబియన్ ఎయిర్ క్రాఫ్ట్ ప్రవేశ పెట్టేందుకు చర్యలు

కేంద్ర మంత్రి అశోకగజపతిరాజు



ఉండి, జనవరి 13: ఇటీవల కాలంలో ప్రాచుర్యం పొందిన యాంఫిబియన్ ఎయిర్ క్రాఫ్ట్ ప్రవేశపెట్టేందుకు తగిన మార్గాలపై దృష్టిపెడుతున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి పి అశోకగజపతిరాజు వెల్లడించారు. శనివారం పశ్చిమగోదావరి జిల్లా ఉండిలో రూ.60లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సహకార సంఘం నూతన భవనాలను ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన విలేఖరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కేవలం మీటరు లోతు నీరు ఉండి 300 మీటర్ల వెడల్పు కాలువ ఉంటే యాంఫిబియన్ ఎయిర్‌క్రాఫ్ట్ దిగే అవకాశం ఉంటుందన్నారు. దేశంలో వేలాది నదులు, కాలువలు ఉన్నందున మరోపక్క పర్యాటకానికి ప్రోత్సాహకంగా ఉంటుందన్నారు. విభజన చట్టంలో ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం జరిగిందని ఆయన పేర్కొన్నారు. విమానయాన రంగం ప్రపంచంలో భారతదేశంలో మూడో స్థానంలో ఉందన్నారు. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విమానాశ్రయాల అభివృద్ధికి ఎంతగానో సహకారం అందిస్తోందన్నారు. రాజమహేంద్రవరం, గన్నవరం విమానాశ్రయాల అభివృద్ధికి భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరించి ఇచ్చిందని చెప్పారు. విమాన ప్రయాణికుల సంఖ్య కూడా బాగా పెరుగుతోందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో విమానాశ్రయాల సంఖ్య కూడా బాగా పెరుగుతోందని చెప్పారు. సమావేశంలో ఏలూరు ఎంపీ మాగంటి బాబు, ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు, ఎమ్మెల్సీ కంతేటి సత్యనారాయణరాజు, ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, ఏఎంసీ ఛైర్మన్ సాగిరాజు సాంబశివరాజు, వైస్ ఛైర్మన్ జుత్తిగ నాగరాజు, బ్యాంకు అధ్యక్షులు చింతలపాటి సత్యానంద శ్రీహరిరాజు తదితరులు పాల్గొన్నారు.



డీడీఎస్ ఆధ్వర్యంలో పాత పంటల జాతరకు ముస్తాబైన ఎడ్లబండ్లు

రైతులకు బాసట.. పాత పంటల జాతర

- సంప్రదాయ పంటల పరిరక్షణలో డీడీఎస్ అవిశ్రాంత కృషి
- 18 ఏళ్లుగా కొనసాగుతున్న పాత పంటల జాతర
- నెల రోజుల పాటు గ్రామాల్లో ఆట, పాటలతో పల్లెల్లో ఆహ్లాదం



ఆంధ్రభూమి బ్యూరో

సంగారెడ్డి, జనవరి 13: సంప్రదాయంగా సాగు చేసే ఆహార పంటలు అంతరించిపోకుండా పరిరక్షించేందుకు డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) 18 సంవత్సరాలుగా నిరంతర కృషి కొనసాగిస్తోంది. పాత పంటల జాతర పేరిట ప్రతి సంవత్సరం జనవరి 14వ తేదీన ప్రారంభించి ఫిబ్రవరి 10వ తేదీన అట్టహాసంగా పాత పంటల జాతరను ముగించడం ఆనవాయితీగా వస్తోంది. ఈసారి ఝరాసంగం మండలం పొటిపల్లి గ్రామంలో పాతపంటల జాతర ప్రారంభించనున్నారు. జీవవైవిధ్యం, సేంద్రియ పంటల పరిరక్షణకోసం సుదీర్ఘ కాలంపాటు నిర్వహిస్తున్న పాతపంటల జాతర దేశంలోనే మొట్టమొదటిదని చెప్పవచ్చు. గ్రామీణ ప్రజలను ప్రధానంగా రైతులను చైతన్య పర్చడంలో జాతర నిర్వహిస్తున్న సంస్థల్లో డెక్కన్ డెవలప్‌మెంట్ సంస్థ ప్రథమ స్థానం దక్కించుకుంటుంది. జాతర సందర్భంగా పర్యావరణం, పశువులు, ప్రజారోగ్యానికి సంబంధించిన జొన్న, సజ్జ, కొర్ర, రాగులు, పచ్చజొన్న, పెసర, మినుము, అవుశలు, కుసుమలు, ఉలువలు తదితర పాతపంటల పరిరిక్షణపై విస్తృత ప్రచారం నిర్వహిస్తారు. ప్రజల భాగస్వామ్యంతో చేపట్టే ఈ జాతర ఉత్సవాల్లో నెల రోజులపాటు వివిధ గ్రామాల్లో నిర్వహిస్తారు. ఈ యేడాది 38 గ్రామాల్లో ఈ జాతర ఉత్సవాలను నిర్వహించేందుకు డీడీఎస్ మహిళలు కార్యక్రమాలకు రూపకల్పన చేసారు. జాతర సందర్భంగా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి సంప్రదాయ, ఆధునిక పద్దతుల్లో పంటల సాగులో వ్యత్యాసాలపై సుధీర్గంగా చర్చించి నివేదికలు రూపొందించుకుంటారు. గ్రామీణ రైతుల అభిప్రాయాలను నివేదికల ద్వారా కేంద్ర ప్రభుత్వానికి అందజేయనున్నారు. డీడీఎస్ కృషి ఫలితంగానే పార్లమెంట్‌లో ఆహార భద్రత బిల్లును కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిందన్న అభిప్రాయం సంస్థ సభ్యులో నెలకొంది. పత్తి, సోయా లాంటి పంటల సాగును ప్రభుత్వం ప్రోత్సహించడం, పాత పంటల సాగును నిర్లక్ష్యం చేస్తూ పరోక్షంగా జొన్న, సజ్జ, కొర్ర, రాగులు తదితర పంటలను నిరాదరణకు గురిచేస్తున్న వైనంపై రైతులతో తాజా జాతరలో చర్చకు పెట్టబోతున్నారు. జాతర సందర్భంగా 16 ఎడ్ల బండ్లను ఏర్పాటుచేస్తారు. బండ్లపై గ్రామ దేవత చిత్రపటం, చిరుధాన్యాలు అలంకరించడం, వంటకాలు అమర్చిన బండ్లు దర్శనమిస్తాయి. అలంకరించిన బండ్లను జాతర సందర్భంగా గ్రామాల్లో ఊరేగిస్తారు. బండ్ల ముందు కోలాటం, చెక్క భజన (చిటికెలు), సంఘం మహిళల ఆట, పాటలు లాంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకునే స్థాయిలో నిర్వహిస్తారు. బండ్లపై సుమారు 50 నుంచి 60 వరకు చిరుధాన్య విత్తనాలను అమర్చి ఊరేగిస్తారు. అదేవిధంగా ఎకరాలో 15నుంచి 20 రకాల పంటలను పండించే జీవవైవిధ్య సంప్రదాయాన్ని అవిశ్రాంతంగా కొనసాగిస్తున్న చిన్న, సన్నకారు మహిళా రైతులను ప్రత్యేకంగా సత్కరించి గౌరవించడం విశేషం. వారు చేపట్టిన సాగు సంబంధిత కార్యక్రమాలకు లఘు చిత్రాల ద్వారా ప్రదర్శిస్తారు. అవగాహన రాహిత్యంతో రైతులు సాగు చేస్తున్న పత్తి, సోయాలతో మానవాళికి, పర్యావరణానికి, పశువులకు కలుగుతున్న నష్టాలపై చర్చించి ప్రచారం నిర్వహించనున్నారు. జాతర బండ్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ వీధుల్లో ఊరేగిస్తారు. బండ్లకు వివిధ రంగుల చీరలతో ఆకర్షణీయంగా అమర్చి, ఎడ్లను కూడా ప్రత్యేకంగా అలంకరిస్తారు. మహిళా సంఘాల సభ్యులు సంప్రదాయ పాటలు పాడుతూ ఊరేగింపును అనుసరిస్తారు. జాతర సందర్భంగా వివిధ స్టాళ్లు ఏర్పాటుచేస్తారు. వాటిలో సేంద్రియ ఎరువులు, విత్తన బ్యాంకులకు సంబంధించిన ఏర్పాట్లు, ఆయుర్వేద వైద్య మూలికలు, చిరుధాన్య వంటకాలకు సంబంధించిన ప్రదర్శనలు ఏర్పాటు చేస్తారు. 18 సంవత్సరాల కాలంలో డీడీఎస్ గ్రామీణ ప్రజల ద్వారా అనేక సత్ఫలితాలను రాబట్టిందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

రూ. 13వేల కోట్లు సేకరించనున్న హెచ్‌డీఎఫ్‌సీ

ఆమోదించిన బోర్డు

న్యూఢిల్లీ, జనవరి 13: మార్కెట్ నుంచి రూ. 13వేల కోట్ల నిధులు సేకరించేందుకు తమ బోర్డు అనుమతించిందని హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ శనివారం తెలిపింది. అనుబంధ బ్యాంకింగ్ విభాగంలో తన వాటాలను కొనసాగించడానికి, స్ట్రెస్డ్ అసెట్స్, ఆరోగ్య బీమా వంటి రంగాలలోకి ప్రవేశించేందుకు ప్రధానంగా ఈ నిధులను వినియోగించనున్నట్టు హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ వెల్లడించింది. మార్ట్‌గేజ్ లెండర్ అయిన హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ గత దశాబ్ద కాలంలో మార్కెట్ నుంచి నిధులు సేకరించడం ఇదే తొలిసారి. 'రూ. 13వేల కోట్లకు మించకుండా నిధులు సేకరించేందుకు ఈక్విటీ షేర్లను జారీ చేయడానికి శనివారం జరిగిన కార్పొరేషన్ డైరెక్టర్ల కమిటీ ఆమోదం తెలిపింది. ఈ నిధుల సేకరణకు ప్రిఫరెన్షియల్ అలాట్‌మెంట్, క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్లేస్‌మెంట్ పద్ధతులను అనుసరించడం జరుగుతుంది. పోస్టల్ బ్యాలెట్ ద్వారా వాటాదారుల ఆమోదం పొందిన తరువాత ఈ రెండు పద్ధతులకు సంబంధించి తుది నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది' అని హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ ఒక ప్రకటనలో తెలిపింది. ఒక్కో షేర్ ధర రూ. 1726.05తో ప్రిఫరెన్షియల్ ప్రాతిపదికన ఒక్కో షేర్ ముఖ విలువ రూ. రెండుతో 6.43 కోట్ల షేర్లను జారీ చేయడానికి బోర్డు ఆమోదం తెలిపింది. వీటి ద్వారా మొత్తం రూ. 11,103.66 కోట్ల నిధులు సేకరిస్తారు. అజీం ప్రేమ్‌జీ ట్రస్టు సహా వివిధ సంస్థలకు షేర్లను కేటాయించడం ద్వారా నిధులు సేకరిస్తారు.

శత వసంతాల ఒడిలో 'ఆర్యాపురం బ్యాంకు'

రూ.1000 కోట్ల టర్నోవర్‌లో అర్బన్ బ్యాంకు

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, జనవరి 13: చారిత్రక రాజమహేంద్రవరంలోని ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు రూ.1000 కోట్ల టర్నోవర్‌కు చేరుకోవడం అర్బన్ బ్యాంకుల చరిత్రలోనే విశేషత సంతరించకుంది. 1918లో కేవలం రూ. 300 షేర్ క్యాపిటల్‌తో మొదలైన ఈ బ్యాంకు రాష్ట్రంలోనే ల్యాండ్ మార్కుగా ఎదిగింది. వంద సంవత్సరాల వడిలో రూ. వెయ్యి కోట్ల టోర్నవర్‌కు చేరుకోవడం అర్బన్ బ్యాంకు చరిత్రలో చారిత్రాత్మకంగా నిలిచింది. శత వసంతాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకునేందుకు పాలకవర్గం ఏర్పాట్లు చేస్తోంది. ఒక శాఖతో మొదలెట్టిన ఈ ప్రస్థానం రాష్ట్ర వ్యాప్తంగా 16 బ్యాంకు శాఖలుగా విస్తరించింది. 1918 డిసెంబర్ 30న రూ.300ల షేర్ కేపిటల్‌తో సరిపెల్ల విశ్వేశ్వర ప్రసాదరావు ఈ అర్బన్ బ్యాంకును వ్యవస్థీకరించారు. లక్షలాది మంది ఖాతాదారుల సేవలతో ఈ అర్బన్ బ్యాంకు రాజమహేంద్రవరం సామాజిక అభివృద్ధిలో మమేకమైంది. ప్రస్తుత పాలక మండలి ఛైర్మన్ చల్లా శంకరరావు నేతృత్వంలో 2014 జనవరి 1 నుంచి అధికారంలోకి వచ్చింది. అప్పటికి రూ. 340 కోట్ల డిపాజిట్ల నుంచి ప్రస్తుతం రూ.590 కోట్ల డిపాజిట్లకు చేరుకుంది. ప్రస్తుతం రూ. 360 కోట్ల రుణాలు అందుకుంటున్నారు. ప్రస్తుత పాలక వర్గం రూ.595 కోట్ల టర్నోవర్‌లో బాధ్యత తీసుకోగా ప్రస్తుతం రూ.936 కోట్ల టర్నోవర్‌కు పెరిగింది. ఈ వందో సంవత్సరంలోకి అడుగు పెట్టిన సందర్భంగా ఈ నెలాఖరుకల్లా రూ. 1000 కోట్ల టర్నోవర్‌కు చేర్చే లక్ష్యంగా కృషి చేస్తున్నామని ఛైర్మన్ చల్లా శంకరరావు చెప్పారు. 99 సంవత్సరాల్లో 90 వేల షేర్ హోల్డర్స్ కలిగిన ఏకైక అర్బన్ బ్యాంకుగా నిలిచింది. 15 శాతం డివిడెండ్‌గా రూ. 2.25 కోట్లు ఇచ్చే లక్షన్నర ఖాతాదారులు కలిగిన అర్బన్ బ్యాంకుగా చరిత్ర సృష్టించింది. ఇప్పటికే 9 శాఖలు కలిగిన ఆర్యాపురం అర్బన్ బ్యాంకు మరో ఏడు శాఖలను విస్తరిస్తున్నారు. గత ఏడాదిన రూ.20 కోట్ల నికర లాభాన్ని అధిగమించిన ఈ బ్యాంకు కొత్త భవనంలోకి ముఖ్యమంత్రి చేతుల మీదుగా రానున్న మే నెలలో ప్రారంభోత్సవంతో అడుగు పెట్టనుంది. బ్యాంకింగ్ వ్యవస్థలో పెను మార్పులను సవాళ్ళుగా స్వీకరించి ఈ బ్యాంకు గణనీయమైన అభివృద్ధి సాధించింది. రుణాలు తీసుకున్న ఖాతాదారులు బీమా వర్తింపజేసే పథకం ఈ బ్యాంకు ముందస్తులో ఉంది. శత వసంతాలను రానున్న ఆగస్టులో ఉత్సవాలను సిద్ధమైంది. గుంటూరు, విశాఖలలో కొత్త బ్రాంచిలను ఏర్పాటు చేస్తున్నారు. 90 శాతం డిపాజిటర్లకు పాన్‌కార్డు మంజూరు చేసిన బ్యాంకుగా కూడా విశేషత సంతరించుకుంది. రిజర్వు బ్యాంకు నుంచి 'ఎ' గ్రేడు బ్యాంకుగా గుర్తింపు పొందిన ఈ బ్యాంకు సామాజిక సేవలో కూడా ముందుంది.

కళ తప్పిన అరకులోయ

అరకులోయ, జనవరి 13: ప్రసిద్ధ పర్యాటక ప్రదేశమైన అరకులోయ సందర్శకుల లేమితో వెలవెలబోతోంది. గత నాలుగు రోజులుగా పర్యాటకుల రాకపోకలు తగ్గుముఖం పట్టడంతో పర్యాటక సందర్శిత ప్రాంతాలు బోసిపోయాయి. నిత్యం పర్యాటకుల రద్దీతో కళకళలాడే అరకులోయ పరిసరాల్లో పర్యాటకులు అస్సలు కానరావడం లేదు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రభుత్వం సెలవులు ప్రకటించినప్పటికీ అరకులోయను సందర్శించే పర్యాటకులు కరవయ్యారు. సెలవుల సందర్భాలలో ఎక్కడెక్కడి నుంచో అధిక సంఖ్యలో అరకులోయకు వచ్చే పర్యాటకులు ఈ సారి మాత్రం కానరాకపోవడం విశేషంగా చెప్పవచ్చు. సంక్రాంతి సెలవుల సందర్భంలో గతంలో వందల సంఖ్యలో అరకులోయను సందర్శించే పర్యాటకులు ఈ సారి లేకపోవడం పలువురిని విస్మయానికి గురిచేస్తుంది. ప్రధానంగా శని, ఆదివారాలలో ఇసుక వేస్తే రాలనంతగా పర్యాటకులు అరకులోయను సందర్శించే వారు. అధిక సంఖ్యలో ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకులకు వసతి సమస్య ఏర్పడి రోడ్లపైన, ఆర్టీసీ, రైల్వే స్టేషన్‌లలో తలదాచుకునే పరిస్థితి ఇంతవరకు ఉండేది. అయితే ఈ సారి సంక్రాంతి సెలవులకు ఈ పరిస్థితి ఎక్కడ కనిపించకపోవడం అందరినీ ఆశ్యర్యానికి గురిచేస్తోంది. దీంతో ప్రభుత్వ అతిథి గృహాలు, ప్రయివేట్ లాడ్జీలు, రిసార్ట్స్‌లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. సంక్రాంతి సెలవుల్లో పర్యాటకుల రద్దీని తట్టుకునే విధంగా వ్యాపారులు ముందుగా ప్రణాళికలు రచించుకుని తమ వ్యాపార కార్యకలాపాలను సాగించాలని ఆశించినప్పటికీ వీరి ఆశలపై నీళ్లు చల్లినట్టయ్యింది. పర్యాటకుల ప్రవేశ రుసుంతో పర్యాటక సందర్శిత ప్రాంతాల అభివృద్ధి, సిబ్బంది వేతనాలు చెల్లించే గిరిజన మ్యూజియం, పద్మాపురం ఉద్యానవన కేంద్రానికి ఆదాయం గణనీయంగా తగ్గింది. దీంతో పర్యాటక సందర్శిత ప్రాంతాల నిర్వహణ కష్టతరమయ్యే అవకాశం కనిపిస్తుంది. పర్యాటకులపై ఆధారపడి జీవనం సాగించే ప్రయివేట్ వాహనదారులు కూడా పర్యాటకుల లేమితో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో మాదిరిగా శివరాత్రి వరకు పర్యాటకుల సందర్శన ఉంటుందని భావించిన అన్నివర్గాల వారికి ప్రస్తుతం నెలకొన్న పరిస్థితి నిరాశే మిగిల్చిందని చెప్పవచ్చు.



వెలవెలబోతున్న అరకులోయలోని గిరిజన మ్యూజియం

ఈ-కామర్స్‌లో ఏపీ మరో ముందడుగు

- ఉపాధి కల్పనకు అలీబాబా డాట్ కామ్‌తో త్వరలో ఒప్పందం
- మంత్రులు లోకేష్, అఖిలప్రియ సమక్షంలో చర్చలు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 13: ఇ-కామర్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. ప్రపంచ ప్రఖ్యాత అలీబాబా డాట్ కామ్ కంపెనీ సహకారంతో ఏపీలో దాదాపు 20వేల మంది నిరుద్యోగులకు శిక్షణ, ఉపాధి కల్పించేందుకు త్వరలో ఒక ఒప్పందం చేసుకోబోతోంది. అలీబాబా కంపెనీ ప్రతినిధులతో ఏపీ పంచాయతీరాజ్‌శాఖ మంత్రి నారా లోకేష్, ఏపీ పర్యాటకశాఖ మంత్రి భూమా అఖిలప్రియ శనివారం ఉదయం హైదరాబాద్‌లో చర్చలు జరిపారు. మరో వారం పది రోజుల్లో విజయవాడలో అలీబాబా కంపెనీ ప్రతినిధులతో ఎంఓయు చేయనున్నామని మంత్రి అఖిలప్రియ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటకశాఖలో ఉపాధి శిక్షణ కోసం మంత్రి తొలుత అలీబాబా కంపెనీ చైనా ప్రతినిధులతో చర్చలు జరిపారు. అయితే ఇది కేవలం తమ శాఖకే పరిమితం కాకుండా ఏపీలోని నిరుద్యోగ యువత అందరికీ వర్తింప చేయాలని చైనా ప్రతినిధులను పంచాయతీరాజ్ మంత్రి నారా లోకేష్ వద్దకు తీసుకెళ్లారు. అలీబాబా కంపెనీ ఇండియా బిజినెస్ డెవలప్‌మెంట్ హెడ్ వండర్ ఛాన్, టీడీఐ గ్లోబల్ హెడ్ సంజయ్ శర్మలతో చర్చించిన లోకేష్, ఏపీలో నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు ఇది సదవకాశమని పేర్కొన్నారు. ఈ కంపెనీ ద్వారా ఏపీలో వేలాది మంది నిరుద్యోగులకు టెక్నికల్, ఇ-కామర్స్, మార్కెటింగ్‌లో శిక్షణ అందించి, ఉపాధి కల్పిస్తామని అలీబాబా కంపెనీ ఇండియా బిజినెస్ డెవలప్‌మెంట్ హెడ్ వండర్ ఛాన్ తెలిపారు.

నీతిమంతులను ఎన్నుకోండి

కష్టపడితేనే ఉన్నత స్థానం ★ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఆంధ్రభూమి బ్యూరో

నెల్లూరు, జనవరి 13: అవినీతి ప్రజాస్వామ్యానికి పెద్దశత్రువుగా మారిందని భారతదేశ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో శనివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల్లో నీతివంతమైన నాయకులను ప్రజలు ఎన్నుకోవాలని సూచించారు. కులం కన్నా గుణం గొప్పదని, అయితే ప్రస్తుత రాజకీయాల్లో కులం, మతం, ధనంకే ప్రాధాన్యత సంతరించుకున్నాయని, ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ప్రజాస్వామ్య విలువలు పరిరక్షించుకోవాలంటే గుణం ఉన్నవారికే పట్టం కట్టాలన్నారు. ఆధ్యాత్మిక భావనకు ప్రతి రూపం సేవ అని, నాయకులు, ప్రజలు కొంత సమయం, కొంత నగదు వెచ్చించి సమాజానికి తమ వంతు సహాయం అందించాలని సూచించారు. సేవా కార్యక్రమాల నిర్వహణతో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. సమస్త మానవాళి జీవితం ప్రకృతితో



ఉచిత వైద్య శిబిరంలో ప్రసంగిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ముడిపడి ఉందని, ఆరోగ్యకర జీవనానికి మంచి వాతావరణం అవసరమని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కంకణ బద్దులు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి వ్యక్తి తనలోని శక్తి సామర్థ్యాలను పెంచుకుంటే ఎంతటి స్థానానికైనా చేరవచ్చని, ఇందుకు అబ్దుల్ కలాం, నరేంద్రమోదీలు ప్రత్యక్ష ఉదాహరణలన్నారు. తాను కూడా చిన్నప్పటి నుంచి కష్టపడి భారత ఉపరాష్ట్రపతి స్థాయికి చేరానని గుర్తు చేశారు. పేద కుటుంబంలో పుట్టి పట్టుదలతో చదివి కలెక్టర్ అయిన ముత్యాలరాజు అందరికీ ఆదర్శమన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే దేశం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందన్నారు. ప్రజలు ఆహార అలవాట్లలో మార్పులు, మారుతున్న జీవన విధానంతో కొత్త వ్యాధులు వస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు శారీరక శ్రమను పెంచుకోవాలన్నారు. కష్టపడి పని చేస్తే వ్యాధులు దూరంగా ఉంటాయన్నారు. పేదలకు, గ్రామీణ ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి వంటి రంగాల్లో స్వర్ణభారత్ ట్రస్టు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు, గ్లోబల్ అసుపత్రి ఛైర్మన్ రవీంద్రనాథ్, స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

అలరించిన ఫ్యాషన్ షో

సంప్రదాయం ఉట్టిపడేలా అలంకారం

విజయవాడ (బెంజిసర్కిల్), జనవరి 13: అచ్చమైన తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా నిర్వహించిన ఫ్యాషన్ షో అందరినీ అలరించింది. తెలుగు వారి సంప్రదాయ పంచెకట్టు, చీరలతో హొయలొలికిస్తూ యువతీ, యువకులు ఉత్సాహంగా ఈ షోలో పాల్గొన్నారు. విజయవాడలోని బెంజిసర్కిల్ వద్ద ఉన్న ట్రెండ్ సెట్ మాల్‌లో శనివారం మాల్‌తో పాటు 24 క్రియేటివ్ ఈవెంట్స్ సంయుక్తంగా నిర్వహించిన ఈ ఫ్యాషన్ షోకు అపూర్వ స్పందన లభించింది. సంక్రాంతి సెలవులకు తరలి వచ్చిన వారు ట్రెండ్ సెట్ మాల్‌లో నిర్వహించిన ఈ ఫ్యాషన్ షోను ఆసక్తిగా తిలకించారు. ఈ షోలో విజేతలకు మాల్ మార్కెటింగ్ మేనేజర్ సతీష్, మాల్ మేనేజర్ నాగార్జున బహుమతి ప్రదానం చేశారు.



శ్రీశైల మల్లన్నకు భృంగి వాహనసేవ

శ్రీశైలం, జనవరి 13: శ్రీశైలంలో జరుగుతున్న సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం మల్లికార్జున స్వామికి భృంగి వాహన సేవ నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భృంగి వాహనంపై స్వామి, అమ్మవార్లను ఆశీనులను చేసి హారతి ఇచ్చారు. భక్తుల జయజయధ్వానాల మధ్య స్వామివారి గ్రామోత్సవం ఆలయ మాడ వీధుల్లో కొనసాగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులు మల్లన్నను దర్శించుకుని పునీతులయ్యారు. వాహనసేవ ముందు కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో నారాయణ భరత్ గుప్త దంపతులు, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

31న సంపూర్ణ చంద్రగ్రహణం

ఆంధ్రభూమి బ్యూరో

తిరుపతి, జనవరి 13: ఈనెల 31వ తేదీన సంపూర్ణ చంద్ర గ్రహణాన్ని పురస్కరించుకుని ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9.30గంటల వరకు తిరుమలలో శ్రీవారి ఆలయం మూసివేయనున్నారు. చంద్రగ్రహణం సాయంత్రం 5.18 గంటల నుంచి రాత్రి 8.41 గంటల వరకు కొనసాగుతుంది. గ్రహణం పట్టడానికి 6గంటల ముందు నుంచే ఆలయాన్ని మూసివేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగానే ఉదయం 11 గంటలకు శ్రీవారి ఆలయాన్ని మూసివేయనున్నారు. రాత్రి 10.30 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. అంతకుముందు ఆలయ శుద్ధి, పుణ్యహవచనం కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి శ్రీవారి ఆలయంలో జరిగే కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత సేవ, సహస్ర దీపాలంకరణ సేవ, వసంతోత్సవం సేవలను టీటీడీ రద్దు చేసింది.

ఏ హామీలు సాధించారు?

బాబును ప్రశ్నించిన వైకాపా నేత బొత్స

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 13: ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని హామీలను ఎన్నింటిని నెరవేర్చారో చంద్రబాబు ప్రభుత్వం బహిర్గతం చేయాలని వైకాపా సీనియర్ నేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం ఇక్కడ ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ దుగ్గరాజ పట్నం పోర్టుకు బదులుగా రెండు ఎకనామిక్ జోన్స్ ఇవ్వాలని కోరే హక్కు చంద్రబాబుకు లేదన్నారు. ఈ లెక్కన స్వార్థం కోసం ప్రత్యేక హోదాను కూడా తాకట్టుపెట్టి ఉంటారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రధాని మోదీని కలిసింది స్వార్థ రాజకీయాల కోసమా అని ఆయన ప్రశ్నించారు. గత నాలుగు సంవత్సరాలుగా అడుగుతున్న అంశాల్లో ఒక్కటి కూడా కేంద్రం ఆమోదించలేదన్నారు. విశాఖపట్నం రైల్వేజోన్, పోలవరం నిర్మాణం, 13షెడ్యూల్ అంశాలే తప్ప కొత్త అంశాలను చంద్రబాబు అడగలేదన్నారు. 45 నిమిషాల పాటు ప్రధానితో ఏపీ అంశాలను చర్చించారో చెప్పాలన్నారు. దేశంలో అందరికంటే సీనియర్ ముఖ్యమంత్రిని, అందుకే నన్ను ప్రజలు ఎన్నుకున్నారని పదేపదే చెప్పే చంద్రబాబు నాలుగేళ్ల నుంచి కేంద్రం న ఉంచి సాధించిందేమిటో చెప్పాలన్నారు. ఎఫ్ఆర్‌బిఎం చట్టానికి వెసులుబాటు కల్పించాలని కోరామంటున్నారని, దీనిపై ఎటువంటి హామీని సాధించారో చెప్పాలన్నారు.

బాబు దుష్టపాలనకు

చరమగీతం పాడుదాం

- ◆ చెడిపోయిన రాజకీయ వ్యవస్థను బాగుచేయడానికే పాదయాత్ర
- ◆ రాష్ట్రంలో ఉన్నది మాఫియా ప్రభుత్వం
- ◆ వైఎస్ఆర్‌సీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆరోపణ

రామచంద్రాపురం, జనవరి 13: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొనసాగుతున్న చంద్రబాబు దుష్టపాలనకు చరమగీతం పాడుదామని ప్రతిపక్ష నేత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. 61వ రోజు ప్రజా సంకల్పయాత్రలో భాగంగా శనివారం చిత్తూరు జిల్లా రామచంద్రాపురం మండలం రాయలచెరువుపేట గ్రామం నుంచి జగన్ పాదయాత్ర ప్రారంభించారు. ఈ యాత్ర కుప్పంబాదూరు, వడ్డికాలువ, బలిజపల్లి, సంజీవరాయపురం, పీవీ పురం, రామిరెడ్డిపురం, గంగిరెడ్డిపల్లి, రామచంద్రాపురం, నడవలూరు గ్రామాలమీదుగా సాగింది. మొత్తం 12కిలోమీటర్ల మేర అభిమానులను, ప్రజలను కలుసుకుంటూ, పలకరిస్తూ యాత్ర సాగించారు. సాయంత్రం 4.30 గంటలకు రామచంద్రాపురం మండల కూడలిలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మాఫియా పాలన సాగుతున్నదని, దీనిని అంతమొందించడానికే మీ రాజన్న బిడ్డనైన నేను పాదయాత్రను కొనసాగిస్తున్నానని, అందరూ తనను ఆశీర్వదించాలని కోరారు. రాజన్న పాలన నాటి పచ్చదనం ఏమైందని ప్రశ్నించారు. భయపడకండి... భవిష్యత్ మనదే అని అందరికీ భరోసా ఇచ్చారు. చంద్రబాబు పాలనలో అందరికీ సంతోషం కరవైందని, రాబోవు కాలంలో భరోసా ఇవ్వడానికి తాను వస్తే తనకే భరోసా కల్పిస్తున్న మీ అందరికీ వందనాలన్నారు. చంద్రబాబు మంచి పరిపాలనా దక్షుడంటారు. అంటే సొంత నియోజకవర్గంలో ఓడిపోవడమా ?, పరాయి నియోజకవర్గానికి పారిపోవడమా? అని ఎద్దేవా చేశారు. బాబు తన సొంత గ్రామంలోని పాఠశాలను బాగుపరచలేక దీనస్థితికి వదిలిపెట్టారని, దీనిని బట్టి రాష్ట్రంలో పాఠశాలల పరిస్థితి ఏ విధంగా ఉందో మీరే ఊహించండని పేర్కొన్నారు. నేటికీ రాష్ట్రంలో 70 శాతం గ్రామాలు తాగునీటికి నోచుకోలేని దారుణ పరిస్థితులు ఎదుర్కొంటున్నాయన్నారు. బాబు అబద్దాలకు, మోసాలకు హద్దులేదు. రాజకీయంలో విశ్వసనీయత, నిజాయితీ రావాలని, ఇందుకోసమే రాష్ట్రమంతా ప్రజాసంకల్పయాత్ర సాగిస్తున్నానని చెప్పారు. రాబోవు ఎన్నికల్లో రాజన్న పాలన రావాలంటే జగనన్నే ముఖ్యమంత్రి కావాలని అందరూ దేవుణ్ణి ప్రార్థించాలని కోరారు.


రామచంద్రాపురం మండల కేంద్రంలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తున్న వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి

బాపిరాజుపై బాబు ఫైర్

- ◆ 'గూడెం' ఛైర్మన్ వ్యాఖ్యలపైనా గరం
- ◆ మంత్రి మాణిక్యాలరావుతో గొడవేంటీ?
- ◆ ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేతో కమిటీ

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 13: బీజేపీకి చెందిన మంత్రి మాణిక్యాలరావు- పశ్చిమ గోదావరి జిల్లా టీడీపీ జడ్పీ ఛైర్మన్ బాపిరాజు, తాడేపల్లిగూడెం మున్సిపల్ ఛైర్మన్ శ్రీనివాస్ మధ్య ముదురుతున్న మాటల యుద్ధం చివరకు పార్టీ అధినేత, సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి వెళ్లింది. వారి మధ్య ఇటీవలి కాలంలో జరుగుతున్న ఆధిపత్య పోరు మీడియాకెక్కడంతో సీఎం చంద్రబాబునాయుడు శనివారం ఆ అంశంపై పార్టీ నేతలతో చర్చించారు. చిత్తూరు జిల్లా పర్యటనకు వెళ్లే ముందు బాబు, పార్టీ కార్యాలయ నాయకులు, సీనియర్లతో భేటీ అయ్యారు. మంత్రి మాణిక్యాలరావుకు వ్యతిరేకంగా పార్టీ నేతలు బాపిరాజు, శ్రీనివాస్ ఎందుకు అనుచిత వ్యాఖ్యలు చేయవలసివచ్చిందో విచారించాలని బాబు ఆదేశించారు. 'ఏదైనా ఉంటే పార్టీ అంతర్గత వేదికలపై చర్చించుకోవాలి. లేదా నా దృష్టికి తీసుకురావాలి. ఎవరంటే వాళ్లు మీడియాకెక్కితే సహించేది లేదు. వాళ్లిద్దరితో మాట్లాడి, నివేదిక ఇవ్వండి.

అప్పుల బాధతో భార్యను హత్యచేసి ఆపై ఆత్మహత్య

రాచర్ల, జనవరి 13: అప్పులబాధ భరించలేక భార్యను హత్యచేసి భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం ప్రకాశం జిల్లా రాచర్ల మండలంలోని అచ్చంపేట గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు బేస్తవారపేట మండలం వంగపాడు గ్రామానికి చెందిన కామిరెడ్డి కాశిరెడ్డి (57) అచ్చంపేట గ్రామానికి మూడేళ్ల క్రితం వలసవచ్చి భూములను కౌలు తీసుకొని జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఉదయం వ్యవసాయ కూలీలు కాశిరెడ్డి భార్య ఈశ్వరమ్మను (53) శనగపంట కోతకు పిలిచేందుకు ఇంటివద్దకు వెళ్లిచూడగా రక్తపు మడుగులో పడి ఉంది. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై నాగశ్రీను సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈశ్వరమ్మను రోకలిబండతో కొట్టడంతో ఆమె మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం కాశిరెడ్డి కోసం వెతకగా కౌలుకు తీసుకొన్న పంట పొలంలో పురుగులమందు తాగి మృతి చెంది ఉండటాన్ని గమనించారు. దీనితో పోలీసులు గ్రామంలో ఉన్న కాశిరెడ్డి కుమార్తెకు, కుమారుడికి ఈ విషయాన్ని తెలియచేసి మృతదేహాలను గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కుటుంబసభ్యులు తెలిపిన సమాచారం మేరకు అప్పులబాధ తాళలేక కాశిరెడ్డి ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న గిద్దలూరు సిఐ వి శ్రీరాం సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి వివరాలు సేకరించారు. ఈమేరకు ఎస్సై నాగశ్రీను కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజీకి రంగం సిద్ధం

సమావేశం ఏర్పాటుచేసి పరిస్థితులను చక్కదిద్దేందుకు యుద్ధప్రాతిపదికపై సంప్రదింపులు జరుగుతున్నాయి. సోమవారం నాటికి ప్రధాన న్యాయమూర్తి, నలుగురు సీనియర్ న్యాయమూర్తుల మధ్య రాజీ కుదిరే అవకాశాలున్నాయని అటార్నీ జనరల్ కె.కె.వేణుగోపాల్ చెప్పటం గమనార్హం. నలుగురు సీనియర్ న్యాయమూర్తులు ప్రస్తావించిన మూడు ముఖ్యమైన అంశాలపై రాజీ కుదిరే అవకాశాలున్నాయనే విశ్వాసాన్ని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. జస్టిస్ లోయ మరణంపై సుప్రీం కోర్టు సీనియర్ న్యాయమూర్తులతో ఒక ప్రత్యేక దర్యాప్తు సంఘాన్ని ఏర్పాటు చేయవచ్చునని అంటున్నారు. దీనితోపాటు ముఖ్యమైన కేసులపై విచారణ జరిపేందుకు ఎవరికి కేటాయించాలనే అంశంపై ఇరుపక్షాల మధ్య ఒక రాజీ సూత్రాన్ని తయారు చేస్తున్నట్లు చెబుతున్నారు. నలుగురు సీనియర్ న్యాయమూర్తులకు సంతృప్తి కలిగించే విధంగా ఈ రాజీ సూత్రం ఉంటుందని అంటున్నారు. సుప్రీం కోర్టులో ఏకఛత్రాధిపత్యం కొనసాగింపుకు తెరదించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. సుప్రీం కోర్టు పని తీరు మూలంగా ప్రజాస్వామ్యానికే ప్రమాదం ముంచుకు వస్తోందంటూ నలుగురు సీనియర్ న్యాయమూర్తులు చేసిన ఆరోపణలను ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా తీసుకున్నారని అంటున్నారు. నలుగురు న్యాయమూర్తులు పత్రికా విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి చెప్పిన అంశాలపై కాంగ్రెస్, వామపక్షాలు స్పందించటంతోపాటు సీనియర్ న్యాయమూర్తులు ప్రస్తావించిన అంశాలను తీవ్రంగా పరిగఘణించాలంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ డిమాండ్ చేయటం తెలిసిందే. నలుగురు న్యాయమూర్తులు ప్రస్తావించిన అంశాలను కాంగ్రెస్, వామపక్షాలు రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నందున ఈ వివాదానికి వీలున్నంత త్వరగా తెరదించాలని నరేంద్ర మోదీ భావిస్తున్నట్లు తెలిసింది. నలుగురు సీనియర్ న్యాయమూర్తులు తమ అసంతృప్తిని మీడియాద్వారా ప్రజల ముందు పెట్టడం తీవ్రమైన అంశంగా మారింది. సీనియర్ న్యాయమూర్తుల మధ్య ఉన్న వివాదాల మూలంగా సుప్రీం కోర్టు పట్ల ప్రజల విశ్వాసం మరింత సన్నగిల్లే ప్రమాదం ఉన్నదని కేంద్ర న్యాయ శాఖ భావిస్తోంది. సుప్రీం కోర్టుతో పాటు దేశంలోని న్యాయ వ్యవస్థ పట్ల దేశ ప్రజలకు మంచి అభిప్రాయం లేదు. న్యాయ వ్యవస్థ అవినీతిమయంగా మారిందని మెజారిటీ ప్రజలు భావిస్తున్నారు. దేశ ప్రజలకు రాష్ట్రస్థాయి న్యాయ వ్యవస్థ పట్ల విశ్వాసం లేకపోయినా సుప్రీం కోర్టు పట్ల కొంత విశ్వాసం కొనసాగుతోందనీ, ఇప్పుడు ప్రధాన న్యాయమూర్తి, సీనియర్ న్యాయమూర్తుల మధ్య నెలకొన్న వివాదం మూలంగా సుప్రీం కోర్టు పట్ల ప్రజలకు ఉన్న కాస్తంత విశ్వాసం, నమ్మకం కూడా తగ్గిపోయే ప్రమాదం ఉన్నదని కేంద్ర న్యాయ శాఖ ఆందోళన చెందుతోంది. ఈ నేపథ్యంలో దీపక్ మిశ్రాకు నలుగురు సీనియర్ న్యాయమూర్తులకు మధ్య నెలకొన్న వివాదాన్ని వీలున్నంత త్వరగా పరిష్కరించి సుప్రీం కోర్టులో సామాన్య పరిస్థితులను నెలకొల్పాలన్నది మోదీ ప్రభుత్వం ఆలోచన.

ప్రధాని వివరణ ఇవ్వాలి

ప్రధాన మంత్రి ముఖ్యకార్యదర్శి నృపేందర్ మిశ్రా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాను ఆయన నివాసంలో కలుసుకోవటంపై ప్రధాని నరేంద్ర మోదీ వివరణ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి రణదీప్ సింగ్ సుర్జేవాలా డిమాండ్ చేశారు. దీపక్ మిశ్రాతో నృపేంద్ర మిశ్రా జరిపిన చర్చల వివరాలు ఏమిటి? అని ఆయన అడిగారు. ఇదిలా ఉంటే దీపక్ మిశ్రా నివాసానికి వెళ్లిన తాను ఆయనను కలుసుకోలేదు, ఇది కేవలం వ్యక్తిగత వ్యవహారమని నృపేంద్ర మిశ్రా స్పష్టం చేశారు.

1వ పేజీ తరువాయి

ఇక ఆంధ్ర వ్యాలీ

ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో ఐటి రంగానికి సంబంధించి ఎక్కడ ప్రధాన కేంద్రం ఏర్పాటు చేయాలన్న ఆలోచన వచ్చిందని, ఈక్రమంలో హైదరాబాదులో సైబర్ టవర్‌ను నిర్మించామని, ఫలితంగా అభివృద్ధి వేగవంతమైందన్నారు. అటు తరువాత జరిగిన పరిణామాల్లో రాష్ట్రం విడిపోయిందని చెప్పారు. ఈ నేపథ్యంలో ఇలాంటి సైబరాబాద్‌లను ఆంధ్ర రాష్ట్రంలో నాలుగు చోట్ల ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, అందులో భాగంగా ఎకో సిస్టమ్ ద్వారా వైజాగ్, విజయవాడ, అమరావతి, తిరుపతిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు. అనంతపురాన్ని పరిశ్రమలకు ముఖ్య కేంద్రంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. ఇప్పటికే ఎస్వీయూ, ఐఐటి, ఐజర్ వంటి విద్య, సాంకేతిక రంగాలు ఉండటం వల్ల తిరుపతిని నాలెడ్జ్‌హబ్‌గా మార్చడానికి అవకాశాలు మెరుగుపడ్డాయన్నారు. ఈక్రమంలో కరకంబాడి రోడ్డులో ఐటి సంస్థల ఏర్పాటుకు 8 కంపెనీలు ముందుకురావడం శుభసూచకమన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ఉదారంగా రాయితీలు ఇస్తుందన్నారు. వేగంగా అనుమతులు ఇవ్వడంలో ప్రభుత్వం చూపుతున్న చొరవతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారన్నారు. తమ ప్రభుత్వం ఐటి రంగం ఏర్పాటుకు తీసుకుంటున్న చొరవను, కల్పిస్తున్న సౌకర్యాలను చూసి, ప్రపంచంలోని ఐటి సంస్థలు ఏపీవైపు చూస్తున్నాయని చెప్పారు. ఇది ప్రతి తెలుగు వాడు గర్వించదగ్గ విషయమన్నారు. గత సంవత్సరం మే 8న సిలికాన్ వ్యాలీలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన జోహో ప్రతినిధి శ్రీధర్ స్పందించి ఇక్కడికి కార్యాలయాన్ని తీసుకువచ్చారని తెలిపారు. తిరుపతి ఐటి హబ్‌గా రూపుదిద్దుకోనుందని, ఇందుకు జోహోతోనే నాంది కావాలని ఆయన ఆకాంక్షించారు. ప్రపంచంలో ఐటి నిపుణులలో నలుగురిలో ఒకరు ఈ దేశస్థులని, ఆ నలుగురిలో ఒకరు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారని చెప్పారు. రాష్ట్రంలో ఒక కోటి మందిని ఐటి శాఖ ద్వారా డిజిటల్ లిటిరేటర్స్‌గా చేస్తామన్నారు. 2019 నాటికి ఐటి రంగంలో ఒక లక్ష ఉద్యోగాలు, హార్డ్‌వేర్ రంగంలో మరో లక్ష ఉద్యోగాలు కల్పించడానికి చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఇప్పటికే రేణిగుంట కేంద్రంగా ఎలక్ట్రానిక్ మ్యానిఫ్యాక్చరింగ్ క్లస్టర్ 1, 2గా చేపట్టి 1లో సెల్‌కాన్, కార్బన్ కంపెనీలు స్థాపించినట్లు తెలిపారు. 2లో డిక్సాన్ రూ.350 కోట్లు పెట్టుబడితో 1200 మందికి ఉపాధి కల్పించారని, మరో 3,300 మందికి త్వరలోనే ఉపాధి వస్తుందన్నారు. నేడు ప్రారంభిస్తున్న జోహోతోపాటు తిరుపతిలో డిసగ్నేటెడ్ టెక్నాలజీ సెంటర్‌లో మరో 7 సాఫ్ట్‌వేర్ కంపెనీలు 1800 మందికి ఉద్యోగాలు కల్పించిన వాటిని కూడా ఈ రోజు ప్రారంభించినట్లు తెలిపారు. మానవ వనరులు అధికంగా ఈ రాష్ట్రంలో ఉన్నాయని, అనంతపురంలో కూడా ఐటి పార్కుకు నాంది పలికామని, బెంగళూరు విమానాశ్రయం నుంచి బెంగళూరు పట్టణంలోకి వెళ్లాలంటే 2 గంటలు సమయం పడుతుందని, అదే అనంతపురం ఐటి పార్కుకు చేరుకోవాలంటే 45 నిమిషాలలో చేరుకోవచ్చని తెలిపారు. ప్రపంచంలోని జోహో కేంద్రాల్లోకెల్లా తిరుపతి కేంద్రాన్ని ఉత్తమ కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నారు. ఎక్కడ భూమి కావాలన్నా, ఎంతకావాలన్నా ఇవ్వడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. విశాఖ, అమరావతి, తిరుపతి, అనంతపురంలను ఐటి హబ్‌లుగా తీర్చిదిద్దుతామని, ప్రతి జిల్లాలో ఒక ఐటీ టవర్ కట్టాలని సీఎం సూచించారు.

ఈ కార్యక్రమం లో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమరనాథ్ రెడ్డి, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్, జోహో సీఈఓ శ్రీధర్, ఈ కార్యక్రమంలో ఎంపి శివప్రసాద్, ఎమ్మెల్సీలు రాజసింహులు, గౌనివారి శ్రీనివాసులు, తుడా ఛైర్మన్ నరసింహయాదవ్, ప్రిన్సిపల్ సెక్రటరీ విజయానంద్, జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న, జోహో ప్రచార ప్రతినిధి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఐటి హబ్‌గా తిరుపతి

నారా లోకేష్ ఆహ్వానం మేరకు రేణిగుంటలో 200మంది ఉద్యోగులతో జోహో సంస్థ ప్రతినిధులు 200 మంది ఉద్యోగులతో తమ కార్యకలాపాలను ప్రారంభించింది. ప్రస్తుతం అద్దెభవనంలో ఉన్న తాము త్వరలోనే సొంత భవనాన్ని నిర్మించుకోనున్నట్లు జోహో ప్రతినిధులు తెలిపారు. రూ. 350 కోట్లతో ఏర్పాటయిన జోహో రానున్న 3 యేళ్లలో 5000 మందికి ఉపాధి కల్పిస్తుందన్నారు. కరకంబాడి రోడ్డులోని మానస సరోవర్ వద్ద ఏర్పాటుచేసిన డిసిగ్నేటెడ్ ఐటీ హబ్‌కు ముఖ్యమంత్రి శిలాఫలకాన్ని వేశారు. ఏజీఎస్ హెల్త్ మెడికల్ కోడింగ్ డేటా ఇంటిగ్రేషన్ సర్వీస్‌లను ఈ సంస్థ అందించనుంది. 260 మంది ఉద్యోగస్తులతో తన కార్యకలాపాలను ప్రారంభించనుంది. 73మంది ఉద్యోగస్తులతో తన కార్యకలాపాలు ప్రారంభించనున్న పారికర్ సాఫ్ట్‌వేర్ సంస్థను కూడా ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఎక్సాప్లూయన్స్ కంపెనీని కూడా ఆయన ప్రారంభించారు. 20 మంది ఉద్యోగస్తులతో ఈ సంస్థ తన కార్యకలాపాలను ప్రారంభించనుంది. 20 మంది ఉద్యోగస్తులతో తమ కార్యకలాపాలు ప్రారంభించనున్న నెస్‌కంపెనీని, 30 మంది ఉద్యోగులతో తమ కార్యకలాపాలు ప్రారంభించనున్న ఎఎస్ఎస్ కంపెనీని, 10 మంది ఉద్యోగులతో తమ కార్యకలాపాలు ప్రారంభించనున్న వైఐటీ సంస్థను, 20 మంది ఉద్యోగులతో కార్యకలాపాలుప్రారంభించనున్న ఇంజెనిసీస్ సంస్థను ముఖ్యమంత్రి ప్రారంభించారు.

విభేదాల నివృత్తికి..

పిటిషన్లు, పెండింగ్‌లో ఉన్న పిల్స్ విచారణను ప్రధాని న్యాయమూర్తి చేపట్టాలని లేదా కొలీజియంలో భాగంగా ఉన్న నలుగురు న్యాయమూర్తులకు ఈ బాధ్యత అప్పగించాలని సూచించింది. ఈ సందర్భంగా సుప్రీం కోర్టు బార్ కౌన్సిల్ అధ్యక్షుడు వికాస్ సింగ్ మాట్లాడుతూ విభేదాల అంశాన్ని పూర్తిస్థాయి ధర్మాసనం చర్చించి పరిష్కరించాలన్నారు. ఈ నెల 15న విచారణ జరగాల్సిన అంశాలను ఇతర న్యాయమూర్తుల నుంచి కొలీజియంలో భాగంగా ఉన్న ఐదుగురు సీనియర్ న్యాయమూర్తులకు బదిలీ చేయాలని తీర్మానించామన్నారు. దాదాపు గంటకుపైగా బార్ కౌన్సిల్ సమావేశమైంది. నలుగురు సీనియర్ న్యాయమూర్తులు మీడియా ముందుకు వచ్చి సీజేపై ధ్వజమెత్తడానికి సంబంధించిన అంశంపై వికాస్‌సింగ్ మాట్లాడలేదు. అవసరమైతే ప్రధాన న్యాయమూర్తితోనూ, ఇతర న్యాయమూర్తులతోనూ సమావేశమై తాజా పరిణామాలపై చర్చిస్తామన్నారు.

జల క్రీడలతో నూతన శోభ

- ◆ రాష్ట్రంలో నాలుగు ప్రాంతాల్లో జల క్రీడల అకాడమీలు
- ◆ జలక్రీడల అకాడమీ శంకుస్థాపన సభలో మంత్రి కొల్లు రవీంద్ర



జల క్రీడల అకాడమీ శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి రవీంద్ర, ఉపసభాపతి బుద్ధప్రసాద్ తదితరులు

నాగాయలంక, జనవరి 13: నవ్యాంధ్రప్రదేశ్‌లో జల క్రీడల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర న్యాయ, క్రీడ, యువజన సంక్షేమ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కృష్ణా జిల్లా నాగాయలంకలో రూ.3 కోట్లతో నిర్మించనున్న రాష్ట్ర జల క్రీడల అకాడమీ భవన సముదాయానికి శనివారం శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి మంత్రి రవీంద్ర శంకుస్థాపన చేశారు. అనంతరం శ్రీరామపాద క్షేత్రం వద్ద రెండు రోజుల పాటు నిర్వహించనున్న సంప్రదాయ పడవల రాష్ట్ర స్థాయి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో విస్తారంగా ఉన్న సముద్ర తీరాన్ని అభివృద్ధి పర్చేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందన్నారు. జల క్రీడల నిర్వహణకు నాగాయలంక వేదిక కావడం హర్షణీయమన్నారు. ఈ అకాడమీ ద్వారా ఆసక్తి కలిగిన వారికి జల క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తామన్నారు. జల క్రీడలను ప్రోత్సహిస్తూ నాలుగు ప్రాంతాల్లో అకాడమీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కృష్ణాజిల్లాలో నాగాయలంక, ఇబ్రహీంపట్నం, పశ్చిమ గోదావరి జిల్లా ఎర్రకాలువ, విజయనగరం జిల్లా తాడిపూడి వద్ద ఈ అకాడమీలను ప్రభుత్వం నిర్మించనుందని తెలిపారు. ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ ఈవెంట్స్‌లో జల క్రీడలకు సంబంధించి 58 పతకాలు ఉన్నాయన్నారు. శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ నవ్యాంధ్రప్రదేశ్‌లో జల క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఉందన్నారు. పడవ పందాల్లో కేరళ అంతర్జాతీయ ఖ్యాతి గడించిందని, యాత్రికులను విశేషంగా ఆకర్షిస్తోందని అన్నారు. మన రాష్ట్రానికి గల అపారమైన సముద్ర తీరంలో జలక్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నాగాయలంకలో జల క్రీడల అకాడమిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. నాగాయలంక లైట్ హౌస్‌ను కేంద్రం సాగరమాల కింద గుర్తించిందన్నారు. హౌస్ బోట్స్ ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. ఫిబ్రవరి 10,11 తేదీల్లో శ్రీకాకుళంలో తెలుగు భాషా బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఘంటసాలలో శయన బుద్ధ విగ్రహాన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పడవ పోటీల నిర్వహణలో స్వచ్ఛ నాగాయలంక సొసైటీ, గ్రామాభివృద్ధి కమిటీ వారికి అభినందనలు తెలిపారు. బచ్చుల అర్జునుడు మాట్లాడుతూ వనరులను వినియోగించుకుని జల క్రీడల కేంద్రంగా తీర్చిదిద్దాలన్నారు.

వికలాంగ ప్రయాణికులకు ప్రత్యేక ఏర్పాట్లు

విజయవాడ (రైల్వేస్టేషన్), జనవరి 13: రైలు బోగీలోకి ఎక్కలేని వికలాంగులైన ప్రయాణికుల కోసం దక్షిణ మధ్య రైల్వే మొట్టమొదటిసారిగా ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. వీల్‌ఛైర్ ద్వారా కాని మరో వ్యక్తి సాయంతో కాని రైలు ఎక్కే వికలాంగుల కోసం ఈ సౌకర్యం ఏర్పాటుచేశారు. మొట్టమొదటిసారిగా దక్షిణ మధ్య రైల్వేలోని గుంటూరు డివిజన్‌లోని గుంటూరు జంక్షన్ నుంచి వికారాబాద్ వెళ్లే ట్రైన్ నెంబరు 12747 పల్నాడు ఎక్స్‌ప్రెస్‌లో ఈ ఏర్పాట్లు చేశారు. ఈ విధానం ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఉమాశంకర్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వికలాంగులు రైలులోకి ఎక్కేందుకు వీలుగా నూతనంగా ఏర్పాటుచేసిన ర్యాంప్‌గా ఐరన్ ప్లేట్‌ని రైలుతో ప్లాట్‌ఫారంతో అనుసంధానం చేస్తారు. దీనివల్ల వీల్‌ఛైర్‌తో సహా ఎటువంటి ప్రయాస లేకుండానే రైలులోకి చేరుకోవచ్చు. రైలులో విధులు నిర్వహిస్తున్న హౌస్‌కీపింగ్ సిబ్బందిని ఏర్పాటుచేసి వికలాంగులు ఎక్కిన తర్వాత రైలు బయలుదేరే ముందు దాన్ని తొలగిస్తారు. దీన్ని వికలాంగులు ఎక్కే స్టేషన్‌లో మాత్రమే ఏర్పాటు చేయనున్నారు.

క్రీడ



మెల్బోర్న్‌లో కిడ్స్ టెన్నిస్ డే సందర్భంగా శనివారం కాసేపు సరదాగా పిల్లలతో కలిసి టెన్నిస్ ఆడిన తర్వాత ఫొటోలకు ఫోజులిస్తున్న టెన్నిస్ స్టార్లు (ఎడమ నుంచి కుడికి) మిలోస్ రోనిక్, రోజర్ ఫెదరర్, కరోలిన్ వొజ్నియాకి, నొవాక్ జొకోవిచ్. సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్ శ్లామ్ టెన్నిస్ టోర్నమెంట్‌కు వీరంతా సిద్ధమవుతున్నారు. మహిళల విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ సెరెనా విలియమ్స్, పురుషుల విభాగంలో ప్రపంచ మాజీ నంబర్ వన్ ఆండీ ముర్రే తదితరులు బరిలో లేకపోవడంతో, ఈసారి విజేతలుగా ఎవరు నిలుస్తారన్నది ఆసక్తి రేపుతున్నది.

తొలి రోజు ఆటలో దక్షిణాఫ్రికా 6 వికెట్లకు 265

భారత్‌తో రెండో టెస్టు



సెంచరీ చేజార్చుకున్న ఎయిడెన్ మర్క్రామ్ (94)

హోం గ్రౌండ్‌లో మ్యాచ్ ఆడుతున్న ఎయిడెన్ మర్క్రామ్ అన్ని ఫార్మాట్స్‌లో కలిపి, గత ఆరు ఇన్నింగ్స్‌లో 16, 119, 87, 51 (నాటౌట్), 56 (నాటౌట్), 18 (నాటౌట్) చొప్పున పరుగులు చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లో అతను 94 పరుగులు సాధించి, అభిమానులను అలరించాడు. డీన్ ఎల్గార్‌తో కలిసి అతను మొదటి వికెట్‌కు యాభై లేదా అంతకు మించి పరుగులు జోడించడం ఏడు ఇన్నింగ్స్‌లో ఇది ఐదోసారి.

సెంచూరియన్, జనవరి 13: భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య శనివారం ఇక్కడ మొదలైన రెండో టెస్టు మ్యాచ్ మొదటి రోజు ఆటలో ఇరు జట్లు సమాన ప్రతిభ కనబరిచాయి. మొదటి రెండు సెషన్లలో దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్ ఆధిపత్యం కొనసాగితే, మూడో సెషన్ చివరిలో, ఆతర్వాత నాలుగో సెషన్‌లో భారత బౌలర్లు సత్తా చాటారు. మొత్తం మీద మొదటి రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా తన తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్ల నష్టానికి 265 పరుగులు చేసింది. కెప్టెన్ ఫఫ్ డుప్లెసిస్ 24, కేశవ్ మహారాజ్ 10 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. అశ్విన్ 90 పరుగులకు మూడు వికెట్లు పడగొట్టాడు. ఇశాంత్ శర్మకు ఒక వికెట్ లభించింది.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌కు ఓపెనర్లు డీన్ ఎల్గార్, ఎయిడెన్ మర్క్రామ్ బలమైన పునాది వేసేందుకు ప్రయత్నించారు. అయితే, తొలి వికెట్‌కు 85 పరుగులు జోడించిన వీరి భాగస్వామ్యాన్ని అశ్విన్ ఛేదించాడు. 84 బంతులు ఎదుర్కొని, నాలుగు ఫోర్లతో 31 పరుగులు చేసిన ఎల్గార్‌ను మురళీ విజయ్ క్యాచ్ పట్టగా, అశ్విన్ ఔట్ చేశాడు. హోం గ్రౌండ్‌లో మ్యాచ్ ఆడుతున్న మర్క్రామ్ రెండో వికెట్‌కు హషీం ఆమ్లాతో కలిసి 63 పరుగులు జోడించాడు. అశ్విన్ బౌలింగ్‌లోనే, వికెట్‌కీపర్ పార్థీవ్ పటేల్‌కు దొరికిపోయిన అతను 150 బంతుల్లో 94 పరుగులు సాధించాడు. ఆరు పరుగుల తేడాతో సెంచరీని చేజార్చుకున్న అతని స్కోరులో 15 ఫోర్లు ఉన్నాయి. స్టార్ బ్యాట్స్‌మన్ ఏబీ డివిలియర్స్ 20 పరుగుల వ్యక్తిగత స్కోరువద్ద ఇశాంత్ శర్మ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. 153 బంతుల్లో, 14 ఫోర్ల సాయంతో 82 పరుగులు చేసిన హషీం ఆమ్లా భారత ఫీల్డర్లపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నంలో విఫలమై రనౌటయ్యాడు. హార్దిక్ పాండ్య వేసిన బంతిని అతను షార్ట్ లెగ్ దిశగా కొట్టి, పరుగు కోసం ప్రయత్నించాడు. అయితే, ఓవర్ త్రూలోనే వేగంగా పరిగెత్తిన హార్దిక్ బంతిని నాన్‌స్ట్రయికింగ్ ఎండ్‌ను గురిచేసి విసిరాడు. అది నేరుగా వికెట్లకు తగలడంతో, ఆమ్లా పెవిలియన్ చేరాడు. క్వింటన్ డికాక్ తాను ఎదుర్కొన్న మొదటి బంతికే వెనుదిరిగాడు. అశ్విన్ వేసిన బంతిని సమర్థంగా ఆడలేకపోయిన అతను విరాట్ కోహ్లీకి క్యాచ్ ఇచ్చాడు. 250 పరుగుల వద్ద దక్షిణాఫ్రికా ఐదో వికెట్ కోల్పోయింది. వెర్నన్ ఫిలాండర్ పరుగుల ఖాతా తెరవకుండానే రనౌటయ్యాడు. బంతిని ఫీల్డ్ చేసిన హార్దిక్ దానిని నేరుగా వికెట్‌కీపర్ పార్థీవ్ పటేల్‌కు అందించాడు. ఫిలాండర్ క్రీజ్‌లోకి చేరుకోక ముందే అతను స్టంప్స్‌ను తొలగించాడు. కెప్టెన్ ఫఫ్ డుప్లెసిస్ (24), కేశవ్ మహారాజ్ (10) క్రీజ్‌లో ఉండగా, మొదటి రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా 265 పరుగులు చేసింది. ఆరు వికెట్లు కోల్పోయింది.

స్కోరుబోర్డు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: డీన్ ఎల్గార్ సి మురళీ విజయ్ బి అశ్విన్ 31, ఎయిడెన్ మర్క్రామ్ సి పార్థీవ్ పటేల్ బి అశ్విన్ 94, హషీం ఆమ్లా రనౌట్ 82, ఏబీ డివిలియర్స్ బి ఇశాంత్ శర్మ 20, ఫఫ్ డు ప్లెసిస్ 24 నాటౌట్, క్వింటన్ డికాక్ సి విరాట్ కోహ్లీ బి అశ్విన్ 0, వెర్నన్ ఫిలాండర్ రనౌట్ 0, కేశవ్ మహారాజ్ 10 నాటౌట్, ఎక్స్‌ట్రాలు 8, **మొత్తం (90 ఓవర్లలో 6 వికెట్లకు) 265.**

వికెట్ల పతనం: 1-85, 2-148, 3-199, 4-246, 5-250, 6-251.

బౌలింగ్: బుమ్రా 18-4-57-0, షమీ 11-2-46-0, ఇశాంత్ శర్మ 16-3-32-1, హార్దిక్ పాండ్య 14-4-37-0, అశ్విన్ 31-8-90-3.

సెంచూరియన్‌లోని సూపర్ స్పోర్ట్ పార్క్‌లో దక్షిణాఫ్రికా 23వ టెస్టు ఆడుతున్నది. ఇప్పటి వరకూ జరిగిన 22 టెస్టుల్లో 17 విజయాలు సాధించింది. రెండు పరాజయాలను ఎదుర్కోగా, మిగతా మూడు టెస్టులు డ్రాగా ముగిశాయి.



అదేం ఎంపిక?

రెండో టెస్టుకు జట్టు కూర్పుపై గవాస్కర్ అసంతృప్తి

సెంచూరియన్, జనవరి 13: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండవ టెస్టు మ్యాచ్‌లో భారత్ జట్టు ఎంపికపై మాజీ కెప్టెన్, లిటిల్ మాస్టర్ సునీల్ గవాస్కర్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. భారత్ జట్టు ఓపెనర్ శిఖర్ ధావన్ స్థానంలో కేఎల్ రాహుల్‌ను ఎంపిక చేయడంతోపాటు భువనేశ్వర్ కుమార్ స్థానంలో ఇషాంత్ శర్మను జట్టులోకి తీసుకోవడం ఎంతవరకు సబబని ప్రశ్నించాడు. తన ఉద్దేశంలో మాత్రం శిఖర్‌ధావన్‌ను బలిపశువును చేశారని ఆయన వ్యాఖ్యానించాడు. ఒక ఇన్నింగ్స్‌లో బాగా ఆడనంతమాత్రాన అతనిని జట్టులోకి తీసుకోరా అని ఆయన ప్రశ్నించాడు. అదేవిధంగా వికెట్ కీపర్ వృద్ధిమాన్ షా స్థానంలో పార్థివ్ పటేల్‌ను తీసుకోవడం కూడా ఆక్షేపణీయమని అన్నాడు. కేప్‌టౌన్‌లో జరిగిన మొదటి ఇన్నింగ్స్‌లో మూడు వికెట్లు పడగొట్టిన భువనేశ్వర్ స్థానంలో ఇషాంత్ శర్మను తీసుకోవడంలో అర్థం లేదని, భువనేశ్వర్ లేని లోటును ఇషాంత్ భర్తీ చేయగలడా అని ఆయన ప్రశ్నించాడు.



భారత అండర్-19 క్రికెట్ జట్టు కెప్టెన్ పృథ్వీ షా, కోచ్ రాహుల్ ద్రవిడ్

ఐసీసీ అండర్-19 వరల్డ్ కప్

అఫ్గానిస్తాన్ బోణీ

వాంగరెల్ (న్యూజిలాండ్), జనవరి 13: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఆధ్వర్యంలో శనివారం ఇక్కడ ప్రారంభమైన అండర్-19 వరల్డ్ కప్ టోర్నమెంట్‌లో అఫ్గానిస్తాన్ బోణీ చేసింది. పాకిస్తాన్‌ను ఐదు వికెట్ల తేడాతో ఓడించి సత్తా చాటింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ 47.4 ఓవర్లలో 188 పరుగులకు ఆలౌటైంది. రొహైల్ నజీర్ 81 పరుగులు సాధించగా, అలీ జర్యాబ్ ఆసిఫ్ 30 పరుగులు చేశాడు. అఫ్గాన్ బౌలర్లలో అజ్మతుల్లి ఒమార్జల్ 34 పరుగులకు మూడు, కయాస్ అహ్మద్ 38 పరుగులకు మూడు చొప్పున వికెట్లు పడగొట్టారు. నవీన్ ఉల్ హక్ 30 పరుగులిచ్చి రెండు వికెట్లు కూల్చాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన అఫ్గాన్ 47.3 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 194 పరుగులు చేసింది. దార్విష్ రసూల్ అజేయంగా 76 పరుగులు సాధించి ఈ విజయంలో కీలక భూమిక పోషించాడు. ఇమ్రాన్ అలీ ఖిల్ 46, రహ్మానుల్లా గుర్బాజ్ 31 చొప్పున పరుగులు చేసి, అఫ్గాన్ విజయానికి తమ వంతు సహకారాన్ని అందించారు.

వెస్టిండీస్ చిత్తు

న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో వెస్టిండీస్ జట్టు చిత్తయింది. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 233 పరుగులు చేసింది. ఓపెనర్ కీగన్ సిమన్స్ 92 పరుగులతో నాటౌట్‌గా నిలవగా, కిమానీ మెలిన్స్ 78 పరుగులు సాధించాడు. మాథ్యూ ఫిషర్ 61 పరుగులకు మూడు, రచిన్ రవీంద్ర 30 పరుగులకు మూడు వికెట్లు తమతమ ఖాతాల్లో వేసుకున్నారు. ఫెలిక్స్ ముర్రే 37 పరుగులిచ్చి రెండు వికెట్లు కూల్చాడు. అనంతరం న్యూజిలాండ్ 39.3 ఓవర్లలో రెండు ఇవకెట్లు కోల్పోయి 234 పరుగులు సాధించి, ఎనిమిది వికెట్ల తేడాతో విజయాన్ని నమోదు చేసింది. ఫిన్ అలెన్ సెంచరీ (115)తో నాటౌట్‌గా నిలవగా, జాకబ్ బలా 83 పరుగులు చేశాడు. వీరిద్దరి బ్యాటింగ్ ప్రతిభ న్యూజిలాండ్‌కు విజయాన్ని అందించింది.

జింబాబ్వే గెలుపు

లింకన్: పపువా న్యూ గునియాతో జరిగిన మ్యాచ్‌లో జింబాబ్వే 10 వికెట్ల ఆధిక్యంతో విజయభేరి మోగించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన పపువా 95 పరుగులకే ఆలౌటైంది. ఇగో మహురు 26, ఒవియా శామ్ 24, సినాకా అరువా 18 చొప్పున పరుగులు చేశారు. మిగతా వారు ఈ మాత్రం స్కోరు కూడా చేయలేకపో చేతులెత్తేశారు. జింబాబ్వే బౌలర్లలో వెస్లీ మాధెవర్ 19 పరుగులకు మూడు, మిల్టన్ షుంబా 19 పరుగులకు రెండు చొప్పున వికెట్లు కూల్చారు. అనంతరం ఆ జట్టు వికెట్ నష్టం లేకుండా లక్ష్యాన్ని ఛేదించింది. గ్రెగరీ డాలర్ 41, వెస్లీ మాధెవర్ 53 పరుగులతో నాటౌట్‌గా నిలిచి, జింబాబ్వేను ఎలాంటి ఇబ్బంది లేకుండా, సునాయాసంగా గెలిపించారు.

నమీబియా ఓటమి

బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో నమీబియా 87 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. మొదట బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 4 వికెట్లకు 190 పరుగులు చేసింది. మహమ్మద్ నయీమ్ 60, కెప్టెన్ సైఫ్ హసన్ 84 పరుగులతో రాణించారు. అంతర్జాతీయ వేదికపై తన ఉనికిని చాటుకోవడానికి ప్రయత్నించిన నమీబియా నిర్ణీత ఓవర్లు ముగిసే సమయానికి ఆరు వికెట్లు కోల్పోయి 103 పరుగులు చేసింది. ఇవాన్ విక్ 55 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ జట్టు లక్ష్యాన్ని చేరుకోలేకపోయినప్పటికీ, ఆలౌట్ కాకుండా ఓవర్లను ముగించడం అందరినీ ఆకట్టుకుంది.

ఆసీస్‌తో పోరుకు

భారత్ సిద్ధం

మౌంట్ మౌంగనూయి, జనవరి 13: మళ్లీ ఎన్నో సంవత్సరాల తర్వాత జరుగనున్న ఐసీసీ అండర్-19 ప్రపంచ కప్ క్రికెట్ సందర్భంగా తమ సత్తా చూపాలని భారత జట్టు ఉవ్విళ్లూరుతోంది. వాస్తవానికి శనివారంనాడే ఈ పోటీ ప్రారంభమైనా ఆస్రేలియాతో ఆదివారం జరిగే పోటీలో గెలుపొందడం ద్వారా భవిష్యత్తు బాటలు వేయాలని భారత్ భావిస్తోంది. అందుకు కోచ్ రాహుల్ ద్రవిడ్ నేతృత్వంలో జట్టు ఇప్పటికే అన్నివిధాల సిద్ధమైంది. చాలా రోజుల తర్వాత వస్తున్న ఈ సదవకాశాన్ని అన్నిరకాలుగా సద్వినియోగం చేసుకోవాలని ద్రవిడ్ యువ ఆటగాళ్లలో ఉత్సాహాన్ని నూరిపోశారు. అయితే, వ్యక్తిగతంగా ప్రతిఒక్క ఆటగాడిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోకపోయినా నిష్ణాతులైన యువకులు జట్టులో ఉండడం వల్ల తమ వారంతా ఆటతీరుతో అందర్నీ ఆకట్టుకునేలా తమ జట్టు ఉందని ద్రవిడ్ అన్నాడు. భారత్ ఇప్పటివరకు మూడుసార్లు చాంపియన్‌గా అవతరించింది. చివరిగా 2014లో చాంపియన్‌షిప్ సాధించింది. ప్రస్తుతం భారత్ అండర్-19 జట్టుకు కెప్టెన్‌గా ముంబై ఆల్‌రౌండర్ పృథ్వీ షా నాయకత్వం వహిస్తుండగా, యూత్ వన్డే పోటీల్లో అత్యధిక పరుగులు సాధించిన హిమాంశు రాణా, రంజీట్రోఫీలోని ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లలో క్రీడాభిమానులను ఆకట్టుకున్న పంజాబ్‌కు చెందిన శుభ్‌మన్ గిల్ వంటి బ్యాట్స్‌మెన్ వంటి టాప్ ఆర్డర్ బాగా ఆడతారనే భారత్ చాలా ఆశలు పెట్టుకుంది. అదేవిధంగా మిడిల్ ఆర్డర్‌గా దిగనున్న అంకుల్ రాయ్, అభిషేక్ శర్మ కూడా తప్పకుండా తమ సత్తా నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నారు. అదేవిధంగా బెంగాల్ పేసర్ ఇషాన్ పొరె కూడా తనకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాడనే భారత్ నమ్మకం పెట్టుకుంది.

బాగా ఆడతామనే నమ్మకం ఉంది : కెప్టెన్ షా

ఐసీసీ అండర్-19 పోటీలో తమ సత్తా నిరూపించేందుకు జట్టు సభ్యులంతా ఆత్మస్థైర్యంతో ఉన్నారని భారత కెప్టెన్ పృథ్వీ షా తెలిపాడు. ఈ టోర్నీ పాల్గొనేందుకు తమ జట్టు సభ్యులంతా వారం రోజుల కిందటే ఇక్కడకు వచ్చామని, ఇప్పటికే కొన్ని ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడామని అన్నాడు. పోటీకి అన్నివిధాల సంసిద్ధులు కావడం వల్ల అంతా మంచే జరుగుతుందని ఆశిస్తున్నామని అన్నాడు. తమ లక్ష్యం మాత్రం ప్రపంచ కప్ సాధించడమేనని, అందులో భాగంగా ఆదివారం ఆస్ట్రేలియాతో జరిగే తొలి మ్యాచ్ కోసం తాము ఎదురు చూస్తున్నామని అన్నాడు.

బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్‌కు

శ్రీలంక వైస్ కెప్టెన్‌గా లక్మల్

కొలంబో, జనవరి 13: బంగ్లాదేశ్‌తో జరిగే టెస్ట్ సిరీస్‌లో ఆడే శ్రీలంక క్రికెట్ జట్టు వైస్‌కెప్టెన్‌గా ఫాస్ట్‌బౌలర్ సురంగ లక్మల్ ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని శ్రీలంక క్రికెట్ బోర్డు వెల్లడించింది. అదేవిధంగా ఫాస్ట్‌బౌలర్లు అయిన లహిరు కుమార, లహిరు గమేజి మళ్లీ జట్టులోకి రానుండడంతోపాటు బ్యాట్స్‌మెన్‌లు ధనుష్క గుణతిలక, కౌసల్ మెండిస్‌తోపాటు ఎడమచేతివాటం బౌలర్ లక్ష్మణ్ సందాకన్ కూడా మళ్లీ జట్టులోకి వచ్చారు. బంగ్లాదేశ్‌తో శ్రీలంకకు జరిగే టెస్ట్ సిరీస్‌కు దినేష్ చండీమల్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

చెలరేగిన బౌల్ట్

పాకిస్తాన్‌పై న్యూజిలాండ్ విజయం

ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కైవసం



ట్రెంట్ బౌల్ట్

డ్యునెడిన్, జనవరి 13: ఫాస్ట్ బౌలర్ ట్రెంట్ బౌల్ట్ సూపర్ స్పెల్ ఆదివారం పాకిస్తాన్‌తో జరిగిన మూడో వన్డేలో న్యూజిలాండ్‌కు 183 పరుగుల భారీ తేడాతో విజయాన్ని సాధించిపెట్టింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను కివీస్ 3-0 తేడాతో కైవసం చేసుకుంది. కాగా, చివరి రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచి, పాకిస్తాన్‌కు వైట్‌వాష్ వేయడమే లక్ష్యమని కివీస్ కెప్టెన్ కేన్ విలియమ్‌సన్ స్పష్టం చేశాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 257 పరుగులు చేసి ఆలౌటైంది. ఓపెనర్ మార్టిన్ గప్టిల్ 45, కేన్ విలియమ్‌సన్ 73, మాజీ కెప్టెన్ రాస్ టేలర్ 52, వికెట్‌కీపర్-బ్యాట్స్‌మన్ టామ్ లాథమ్ 35 చొప్పున పరుగులు చేయడంతో న్యూజిలాండ్‌కు ఈ స్కోరు సాధ్యమైంది. ఇన్నింగ్స్ చివరి బంతికి ట్రెంట్ బౌల్ట్ (13) ఔటయ్యాడు. రుమాన్ రయీస్ 51 పరుగులకు మూడు, హసన్ అలీ 59 పరుగులకు మూడు చొప్పున వికెట్లు పడగొట్టారు. షాదాబ్ ఖాన్ 51 పరుగులిచ్చి రెండు వికెట్లు సాధించాడు. ఫహీం అష్రత్‌కు ఒక వికెట్ లభించింది.

అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ తన వన్డే చరిత్రలోనే రెండో అత్యల్ప స్కోరుతో చేతులెత్తేసింది. 27.2 ఓవర్లలో 74 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ సర్ఫ్‌రాజ్ అహ్మద్ (14 నాటౌట్), ఫహీం అష్రఫ్ (10), చివరిలో మహమ్మద్ అమీర్ (14), రుమాన్ రయీస్ (16) మాత్రమే పాక్ తరఫున రెండంకెల స్కోర్లు చేయగలిగారు. రయీస్ చేసిన 16 పరుగులకే పాక్ ఇన్నింగ్స్‌లో అత్యధిక స్కోరుగా నమోదైందంటే, ఆ జట్టు బ్యాట్స్‌మెన్ ఏ విధంగా విఫలమయ్యారో ఊహించడం కష్టం కాదు. 7.2 ఓవర్లు బౌల్ చేసిన బౌల్ట్ కేవలం 17 పరుగులిచ్చి ఐదు వికెట్లు పడగొట్టాడు. కొలిన్ మున్రో, లాకీ ఫెర్గూసన్ చెరి రెండు వికెట్లు సాధించారు.

సంక్షిప్త స్కోర్లు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: 50 ఓవర్లలో 257 ఆలౌట్ (మార్టిన్ గప్టిల్ 45, కేన్ విలియమ్‌సన్ 73, రాస్ టేలర్ 52, టామ్ లాథమ్ 35, రుమాన్ రయీస్ 3/51, హసన్ అలీ 3/59, షాదాబ్ ఖాన్ 2/51).

పాకిస్తాన్ ఇన్నింగ్స్: 27.2 ఓవర్లలో 74 ఆలౌట్ (సర్ఫ్‌రాజ్ అహ్మద్ 14 నాటౌట్, ఫహీం అష్రఫ్ 10, మహమ్మద్ అమీర్ 14, రుమాన్ రయీస్ 16, ట్రెంట్ బౌల్ట్ 5/17, కొలిన్ మున్రో 2/10, లాకీ ఫెర్గూసన్ 2/28).



అశ్విన్, యువరాజ్ సింగ్ (ఫైల్ ఫొటో)

ఐపీఎల్ వేలానికి స్టార్లు

యువీ, అశ్విన్‌సహా 1,122 మంది క్రికెటర్లు

న్యూఢిల్లీ, జనవరి 13: భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) త్వరలో నిర్వహించనున్న ఐపీఎల్‌కు సంబంధించిన క్రీడాకారుల ఎంపిక కోసం నిర్వహించే వేలం జాబితాను ప్రకటించింది. బెంగుళూర్‌లో ఈనెల 27, 28 తేదీల్లో వేలం నిర్వహించనున్నారు. దాదాపు 1,122 మంది క్రికెటర్లు వేలం కిందకు రానున్నారు. వీరిలో దక్షిణాఫ్రికాకు చెందిన క్రిస్ గేల్, భారత ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్, స్పిన్నర్ అశ్విన్, ఇంగ్లాండ్‌కు చెందిన జో రూట్, ఆస్ట్రేలియా క్రికెటర్ షేన్ వాట్సన్ వంటి మేటి స్టార్లు ఉన్నారు. వీరేకాకుండా భారత్ క్రికెటర్లు గౌతం గంభీర్, అజింక్య రహానే, స్పిన్నర్ కులదీప్ యాదవ్, ఓపెనర్లు లోకేష్ రాహుల్, మురళీ విజయ్ తదితరులు కూడా ఈ వేలం కిందనే వివిధ ఫ్రాంచైజీలకు ఎంపికకానున్నారు.

ఇదిలావుండగా, వేలం కోసం వచ్చిన ఆటగాళ్ల జాబితాను ఎనిమిది ఐపీఎల్ ఫ్రాంచైజీల యాజమాన్యాలకు అందజేసినట్టు బీసీసీఐ ప్రకటించింది. మొత్తం 1122 మంది క్రీడాకారుల్లో 281 అంతర్జాతీయ క్రీడా వేదికలపై ఆడినవారుకాగా, 838 మంది అంతర్జాతీయ క్రీడా వేదికలపై ఇంతవరకు ఆడలేదు. మొత్తం క్రీడాకారుల జాబితాలో 778 మంది భారత క్రికెటర్లు ఉండగా, వీరిలో ముగ్గురు ఆటగాళ్లు అసోసియేట్ నేషన్స్‌కు చెందినవారు. ఇతర దేశాలకు చెందిన క్రికెటర్లు 282 మంది ఉండగా, వీరిలో 58 మంది ఆస్ట్రేలియా, 57 మంది దక్షిణాఫ్రికా, శ్రీలంక, వెస్టిండీస్‌లకు చెందినవారు 39 మంది వంతున, 30 మంది న్యూజిలాండ్, 26 మంది ఇంగ్లాండ్‌కు చెందినవారు ఉన్నారు.

ఇదిలావుండగా, ఈ క్రీడాకారుల్లో కొంతమంది ఐపీఎల్‌లో తమకు తప్పకుండా అవకాశం వస్తుందనే ఆశాభావంతో ఉన్నారు. వారిలో ఐపీఎల్‌లో ముంబై ఇండియన్ జట్టు తరఫున ఐపీఎల్‌లో ఆడి బౌలింగ్ చేసిన గ్లెన్ మాక్స్‌వెల్, మిచెల్ జాన్సన్ వంటి వారు కూడా ఉన్నారు. వీరు గత ఐపీఎల్ సీజన్‌లోని ఆఖరి ఓవర్లో తమదైన శైలిలో బౌలింగ్ చేయడం ద్వారా ముంబై జట్టు టైటిల్ సాధించడానికి శక్తివంచన లేకుండా కృషి చేశారు. ఇంగ్లాండ్ టెస్ట్ క్రికెట్ జట్టు కెప్టెన్ రూట్, బెన్ స్టోక్స్, క్రిస్ లీన్, ఇయాన్ మోర్గాన్, పేసర్లు బ్రేవో, కార్లోస్ బ్రాత్‌వైట్, ఎవిన్ లూయిస్, జాసన్ హోల్డర్ వంటి అగ్రశేణి క్రికెటర్లు కూడా ఈ వేలం జాబితాలో ఉన్నారు. అదేవిధంగా కింగ్స్ ఎలెవన్ పంజాబ్ తరఫున ఐపీఎల్ 10లో ఆడి రెండు సెంచరీలు చేసిన హసీమ్ ఆమ్లా, వేలంలో ఎక్కువగా అమ్ముడుపోయేవారిలో తాను కూడా ఉన్నానని భావిస్తున్న డుప్లెసిస్, క్వింటన్ డి కాక్, డేవిడ్ మిల్లర్, బౌలింగ్‌లో అత్యంత ప్రతిభావంతుడిలో ఒకడిగా వినుతికెక్కిన మోర్న్ మోర్కెల్, కొలిన్ మన్రో, న్యూజిలాండ్‌కు చెందిన టామ్ లథమ్‌తో పాటు ఆఫ్గనిస్తాన్, బంగ్లాదేశ్‌కు చెందిన ఎనిమిది మంది, ఐర్లాండ్‌కు చెందిన ఇద్దరు, జింబాబ్వేకు చెందిన ఏడుగురు, అమెరికాకు చెందిన ఇద్దరు క్రికెటర్లు కూడా ఈ వేలం జాబితాలో ఉన్నారు.

Printed and Published from Vijayawada by **K.Sudhakar** on behalf of Deccan Chronicle Holdings Limited at Deccan Chronicle Holdings Press, No.C 3 & 4, Patamata, Industrial Estate, Vijayawada. Chief Editor **T.V.Ravi Reddy**, Phones:2555284,2555185,2555287 Regd. No.AP/VJA/41/51/2000. RNI Registration No.52743/90



భూమిక · bhoomika@andhrabhoomi.net · ఆంధ్రభూమి · ఆదివారం 14, జనవరి 2018



గొబ్బియల్లో... గొబ్బియల్లో

విభిన్న ఆచారాల మేళవింపు • భిన్నత్వంలో ఏకత్వం చాటే సంబరాలు

తెలుగు వారి పండుగల్లో సంక్రాంతికి ప్రత్యేక స్థానం ఉంది. పల్లె పడుచుల ఆటపాటలతో పల్లెలు వింత శోభను సంతరించుకుంటాయి. ముంగిళ్లలో మురిపించే రంగవల్లుల మధ్య గొబ్బియల్లో.. గొబ్బియల్లో అని పాడే గొబ్బెమ్మ పాటలతో ఏటు చూసినా ఆనంద కోలాహలం. చిట్టిచిన్నారులు ఆయురారోగ్యాలతో ఏటేటా ఎదగాలని భోగిపండ్లను పోసే రమణులతో ప్రతి ఇల్లు పేరంటం సంతరించుకుంటుంది. చిరునవ్వులు చిందిస్తుంది. మంచుకురిసే వేళలో వేసే భోగిమంటలు నేలంతా వెలుగు పంచుకుంటుంది. తెలుగు లోగిళ్లలోనే కాదు దేశమంతా సంక్రాంతి సంబరాలను విభిన్న పద్ధతుల్లో జరుపుకుంటారు. ఆచార వ్యవహారాల్లో తేడాలు ఉన్నా అందరూ ఆనందోత్సాహాలతో జరుపుకునే ఈ పండుగలో భిన్నత్వంలో ఏకత్వం ప్రతిబింబిస్తుంది.

తెలుగు రాష్ట్రాల్లో..

తెలుగు రాష్ట్రాల్లో ఈ పండుగును నాలుగురోజులపాటు జరుపుకుంటారు. ప్రతిరోజూ ఒక్కొక్క ప్రత్యేకతను సంతరించుకుంటుంది. భోగిమంటలు వేసుకుని ఆ మంటల్లో పాత వస్తువులను వేసి కొత్తవాటికి ఆహ్వానం పలుకుతారు. ఈ మంటలు మార్పునకు నాంది పలుకుతుందనే భావన. పిల్లలకు మేలు జరగాలని, ఎలాంటి దుష్టశక్తుల పీడ ఉండకూడదని భోగి పళ్లు పోస్తారు. సంక్రాంతినాడు కొత్తబట్టలు ధరించి ఇంటిల్లిపాదీ ఆనందోత్సాహాలతో మునిగి తేలుతారు. ఇంటిముందు ముచ్చటైన ముగ్గులను తీర్చిదిద్దుతారు. కొత్తబియ్యంతో చేసిన వంటల ఘుమఘుమలు అతిథులను రారామ్మని ఆహ్వానిస్తాయి. పతంగులు ఎగురవేయటం, కోడిపందాలతో సందడిగా ఉంటుంది.

కర్నాటకలో..


కర్నాటకలో 'పొంగల్' అని పిలుస్తారు. ఇంద్రుడ్ని పూజిస్తారు కాబట్టి ఇక్కడ భోగిని 'ఇంద్రన్' అని అంటారు. 'కోలం' పేరుతో వేసే ముగ్గులు చూడటానికి రెండు కళ్లూ చాలవు.

తమిళనాడులో..

పొరుగునే ఉండే తమిళనాడులో కూడా సంక్రాంతిని నాలుగు రోజుల పాటు నిర్వహిస్తారు. భోగిమంటలు వేస్తారు. రెండవ రోజు థాయి పొంగల్ అంటారు. చిక్కటి పాలు, బియ్యం, బెల్లంతో తియ్యటి పొంగలి పెడతారు. మూడవ రోజు పండుగను మట్టు పొంగల్ అంటారు. ఈరోజున ఇక్కడ జల్లికట్టు నిర్వహిస్తారు. నాలుగవ రోజున కనుమ జరుపుకుంటారు.



నాగాలాండ్‌లో మహిళలు సామూహికంగా చేసే పూజ



తమిళనాడులో మహిళలు సామూహికంగా చేసే పొంగలి

బీహార్‌లో..

బీహార్, జార్ఖండ్‌లలో రెండు రోజులపాటు జరుపుకుంటారు. వీరు ఈ పండుగను 'సక్రాత్, కిచిడి' అని పిలుస్తారు. సంక్రాంతినాడు నదుల్లో, చెరువుల్లో స్నానాలు చేసి, అక్కడ కుండల్లో పొంగలి చేస్తారు. దీనినే వీరు 'టిల్ గడ్' అని అంటారు. ఇది ఎనిమిది రకాల తృణధాన్యాలతో చేసే బలవర్ధకమైన ఆహారం. అలాగే నువ్వులతో చేసే తీపి ఉండలు కూడా ఇక్కడ ప్రత్యేకం. రెండవ రోజు కిచిడి చేస్తారు. పప్పు, బియ్యం, కేలీఫ్లవర్, బఠానీలు, బంగాళాదుంపలు కలిపి ఈ కిచిడీని వండుతారు.

గుజరాత్‌లో..

గుజరాత్‌లో పతంగుల పండుగ ఎంతో ప్రసిద్ధి. ఇక్కడ కూడా రెండు రోజులపాటు నిర్వహిస్తారు. ఈ కాలంలో లభించే కూరగాయలతో ప్రత్యేక వంటకాన్ని తయారు చేస్తారు. చిక్కి వంటకం కూడా ఇక్కడ ప్రత్యేకత.

పంజాబ్‌లో..

పంజాబ్: పంజాబ్‌లో 'లోహిరి' అనే పేరుతో ఈ పండుగను జరుపుకుంటారు. ఇక్కడకూడా పంటలు చేతికి వస్తాయి. ముఖ్యంగా చెరుకు గడల తియ్యదనం కనిపిస్తోంది. ఇక్కడ రైతులు పండుగ అంటారు.

మహారాష్ట్రలో..

ఇక్కడ కూడా మూడు రోజుల పాటు ఆనందంగా సంక్రాంతి పండుగను జరుపుకుంటారు. సంకరాసుర అనే దేవతను ఈ పండుగ సందర్భంగా మహిళలు కొలుస్తారు. మహిళలు నల్లదుస్తులు ధరించి పసుపు, కుంకమలు ఇచ్చుకుంటారు. భర్తకు ఆయుష్షును ప్రసాదించమని వేడుకుంటారు. అలాగే ఒకరికొకరు బహుమతులు, దుస్తులు ఇచ్చుకుంటారు.

బెంగాల్‌లో..

నోరూరించే స్వీట్లు చేయటం బెంగాల్ వనితల ప్రత్యేకం. ప్రతి ఇంట్లో చేసుకుంటారు. సంక్రాంతి నాడు వేలాదిమంది భక్తులు గంగానదీ తీరానికి వచ్చి స్నానాలు చేసి శివుడికి, గంగాదేవికి పూజలు చేస్తారు.

అస్సాంలో..

బిహు అని ఈ పండుగను పిలుస్తారు. పల్లె వాసులు ఆనందోత్సాహాలతో జరుపుకునే వేడుక. భోగిమంటలు వేసుకున్న తరువాత గ్రామస్తులంతా ఒకచోట కూర్చొని పాటలు పాడతారు. అలాగే జంతువులు, పక్షుల పందేలు నిర్వహించుకుంటారు. బంధువులను, స్నేహితులను ఇంటికి ఆహ్వానించి ప్రత్యేక వంటలతో ఆతిథ్యం ఇస్తారు. దేశ విదేశాలకు చెందినవారు అస్సాంలో జరిగే బిహు వేడుకలను తిలకించేందుకు వస్తుంటారు.



అస్సాంలో పండుగనాడు మహిళలు చేసే ప్రతేక 'కికి'నృత్యం



పంజాబ్ పంటపొలాల్లో మహిళలు చేసే లోహిరి ఉత్సవం



ముగ్గుల్లో వైవిధ్యం..

సంక్రాంతి నెలపట్టడం ఆలస్యం వేకువజామునే నిద్రలేచి, చలి గాలి వణికిస్తున్నా.. కనుమ రోజు వరకు మహిళలు ముంగిట ముత్యాల ముగ్గులతో తీర్చుదిద్దుతారు. 'తీరైన సంపద ఎవరింట నుండు.. దినదినము ముగ్గున్న లోగిళ్లనుండు' అన్నట్లుగా పెద్ద పెద్ద రంగవల్లులను వేసి వాటిపై ఆవుపేడతో చేసిన గొబ్బిళ్లు పెట్టి గొబ్బెమ్మలపై పసుపు, కుంకమలు, బంతులు, చేమంతులు పెట్టి అందంగా అలంకరిస్తారు. పూజలు చేస్తారు. కన్నెపిల్లలు మంచి భర్త లభించాలని కోరుకుంటూ గొబ్బి పాటలు పాడతారు. నెలంతా వివిధ రకాల ముగ్గులు వేసినా ప్రత్యేకంగా పండుగు మూడు రోజులూ వేసే ముగ్గుల్లో వైవిధ్యం కనిపిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోనే కాదు పట్టణాల్లోనూ ఇప్పటికీ ఆనవాయితీగా వేస్తున్నవారు ఉన్నారు. భోగి రోజున వేసే ముగ్గును 'గదుల ముగ్గు' అని అంటారు. సంక్రాంతి పురుషుడైన సంకురమయ్య ఆ గదులలో సంచరిస్తాడని భావిస్తారు. సంక్రాంతి రోజున గజిబిజి గదుల ముగ్గు వేస్తారు. అలిసిపోయిన సంకురుమయ్య విశ్రాంతి తీసుకుంటాడని భావన. కనుమనాడు పెద్ద రథం ముగ్గు వేసి రథానికి తాడు లాగి సంకరుమయ్య ప్రయాణానికి సిద్ధం చేస్తారు. ముక్కనుమ నాడు ఈ రథం తాడుని పక్కంటి రథం తాడుకి కలిపి సంక్రాంతి పురుషుడిని సాగనంపుతారు. అక్కడితో ముగ్గుల పండుగ పూర్తవుతుంది. ఈ నెలరోజులూ ముగ్గులు వేశాక అర్థచంద్రుడిని వేయడం కూడా ఓ ఆనవాయితీ. సంక్రాంతి పండుగ అయిన మరుసటి రోజు నుంచి గుమ్మాల ముందు సంజె ముగ్గులు ప్రారంభమవుతాయి.

-ఎస్.ఇందిరాఅరవింద

ఇదిగో సంక్రాంతి

శీతాకాలం చలి పిల్లగా మారి
భోగిమంటల వెచ్చదనంలో
సిగ్గుమొగ్గలేస్తూ కళ్ళు తెరుస్తున్నది
భానుడి కిరణాలు పొగల్లోంచి పొంచి చూసి
మెల్లగా దూసుకొస్తున్నాయి
సంక్రమణ వేళ క్రాంతి కాంత
మబ్బులోంచి మొగ్గలేస్తున్నది


వ్యవసాయ కృషికి ఫలసాయం అందుకుని
విశ్రాంతి సమయాన్ని పబ్బంగా చేసుకుంటున్న రైతన్నలు
అనూర సారథ్యంలో ఉత్తరాన కన్నేసిన సూర్యభగవానుడు
బొబ్బట్లు, పొంగళ్ళతో తమ బొజ్జలకు
శ్రీరామరక్ష
అంటున్న పిల్లా పెద్దలు
భోగిపండ్లు పోస్తూ దృష్టి పరిహారం
చేస్తూ పిల్లలను దీవిస్తున్న కన్నతల్లులు
అంతటా పసుపుపచ్చదనం,
పడుచుదనం
ముంగిళ్ళలో మురిపిస్తున్న
చెమ్మచెక్కలాటలు
ఎటుచూసినా ఆనంద కోలాహలం
గోమాతకు పసుపు, కుంకుమలు, పూజలు
రంగులప్పుకున్న డూడూ బసవన్నల ఘల్లుమనే గజ్జెల సంగీతాలు
హరే హరేలో రంగ అంటూ
హరిదాసుల అలవోక నాట్యపదాలు
ఎంతో కొంత అందరికీ పంచి పెట్టాలనే తహతహతో



ఆకలి వున్నవాడు యికపై బాధ
వుండరాదని
సౌభాగ్యం అందరికీ యిమ్మని
ప్రార్థిస్తున్నా సంక్రాంతి లక్ష్మిని.

-ఎ.ఎస్.ప్రభాకర్
9963887346

ముత్యాల ముగ్గు



ఎస్.ఇందిరా అరవింద,
సజ్జాపురం, తణుకు,
పశ్చిమ గోదావరి జిల్లా.

అడ్డం 21 చుక్కలు
నిలువు 23 చుక్కలు




సి.రాజ్యలక్ష్మి,
ఎ.ఎస్. రావునగర్,
హైదరాబాద్



ఎ.సుజాత,
సికింద్రాబాద్

ఎ.ఎస్. లక్ష్మి,
విశాఖపట్నం



4 చుక్కలు
4 వరుసలతో
ఒక పువ్వు వస్తుంది.
పై విధంగా ఎంత
ముగ్గు అయిన
పెట్టుకోవచ్చు



వ్యూహం

19 అలపర్తి రామకృష్ణ

శేషగిరి పక్కింటి వాళ్ళకు నాలుగు లారీలు వున్నాయి. ముంబై, హైదరాబాద్ మధ్య సరుకులు రవాణా జరుగుతూ వుండేది. ఒక లారీ పూర్తిగా శేషగిరి కంట్రోల్‌లో వుండేది. అతనే డ్రైవర్. మరో డ్రైవర్ ఆ బండి అంటుకోవడానికి వీల్లేదు. శేషగిరి కుటుంబం మీద వున్న అభిమానంతో ఆ లారీని పూర్తిగా శేషగిరి ఆధీనంలో వుంచేశాడు లారీ ఓనరు. సరుకు రవాణా మీద వచ్చే బాడుగలు క్రమం తప్పకుండా లారీ ఓనర్‌కు ఇచ్చేసేవాడు.

నెలకు ఆరు వేల జీతం. డ్యూటీ ఎక్కినప్పుడల్లా బేటా వచ్చేది. ప్రయాణంలో ఎవరన్నా పాసింజెర్స్‌ను ఎక్కించుకుంటే వచ్చే డబ్బులు డ్రైవర్‌వే. క్లీనరుకు పదో పరకో ఇచ్చేవాడు. అంతకుమించి శేషగిరికి పెద్దగా ఆదాయం లేదు.

కానీ శేషగిరి విలాసంగా ఖర్చుపెట్టడం ఆశ్చర్యాన్ని కలిగించేది లారీ ఓనర్‌కు. నెలకు పాతివేలు అవలీలగా ఖర్చుపెట్టేవాడు. క్లబ్బులకు వెళ్లి పేకాట ఆడేవాడు. ఖరీదైన బ్రాందీ, విస్కీ తాగేవాడు.

విచ్చలవిడిగా ఖర్చుపెట్టడానికి శేషగిరికి డబ్బు ఎక్కడనుంచి వస్తుంది. సరుకు రవాణా చేసే కంపెనీల దగ్గరకు వెళ్లి వాళ్ళు ఇచ్చే డబ్బు, శేషగిరి తనకు ఇస్తున్న పైకం లెక్క చూసేవాడు. అంతా కరెక్టుగానే వుండేది.

పోలీసు అధికార్లకు ఫోన్లు వచ్చేవి. శేషగిరి నడుపుతున్న ఫలానా లారీల్లో పూనా నుంచి తిరిగి వచ్చేటప్పుడు కేజీ కొకైన్ పొట్లాలు హైదరాబాద్‌కు రవాణా అవుతున్నాయని, మార్గమధ్యంలో చాలా సార్లు ఆ లారీ ఆపి చెక్ చేసేవాళ్ళు. కేజీ కొకైన్ అంటే కోటి రూపాయలకు పైనే వుంటుంది ధర.

ఎంత ప్రయత్నించినా ఎవరికి చిక్కకుండా కొకైన్ సరఫరా జరిగిపోయేది పూనా నుంచి హైదరాబాద్‌కు.

కొత్తగా డ్యూటీలో చేరిన ఎస్‌ఐ కొకైన్ రవాణాను అరికట్టాలని గట్టిగా నిశ్చయించుకున్నాడు. నాలుగైదుసార్లు శేషగిరి నడిపే లారీని రోడ్డు పక్కన చెక్ చెయ్యడం కాకుండా లారీని పోలీసు స్టేషన్‌కు మళ్లించి లారీలో సరుకులన్నీ దింపించేవాడు. అన్ని బ్యాగులు విప్పదీసి క్షుణ్ణంగా తనిఖీ చేయించాడు. ఏంత ప్రయత్నించినా లారీ అంతా వెతికినా కొకైన్ ప్యాకెట్లు దొరకలేదు.


'ఇదేదో మిస్టరీగా వుందే!' అనుకున్నాడు.

శేషగిరికి మాఫియా గ్యాంగులనుంచి ప్యాకెట్లు అందుతూనే వున్నాయి. మత్తుమందు సక్రమంగా సరఫరా చేసినపుడల్లా పదివేలు, పాతికవేలు కవర్‌లలో అతనికి అందేవి. జల్సాగా తిరుగుతూ వుండేవాడు.

అన్నపూర్ణక్కూడా ఆశ్చర్యంగానే వుంది. అతనికి వచ్చే కొద్దిపాటి జీతం ఇంటి అవసరాలకు కోసం తనకే ఇచ్చేస్తున్నాడు. మరి సరదాలకు ఖర్చుపెట్టడానికి భర్తకు వేలకు వేలు ఎక్కడనుంచి వస్తున్నాయి?

బాగా తాగినపుడు మాదకద్రవ్యాల ప్యాకెట్లు పూనా నుంచి తెచ్చి హైదరాబాద్‌లోని డ్రగ్స్ అమ్మే ముఖాలకు ఇస్తున్నట్లు చుట్టూ వున్న వాళ్ళందరికీ అదేదో గొప్ప విషయంలా చెప్పేవాడు. 'నన్ను పట్టుకోవడం పోలీసుల తరం కాదు' అనే వాడు. కానిస్టేబుల్ ఆ వార్త ఎస్పీకి చేరవేశాడు. అది ఛాలెంజ్‌గా తీసుకుని రంగంలోకి దిగాడు. మఫ్టీ డ్రెస్‌లో సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌ని వెంట బెట్టుకుని కారులో శేషగిరి లారీని ఫాలో అయ్యారు.

పూనాలో బయల్దేరిన లారీ ప్రతి వంద కిలోమీటర్లకి పెట్రోల్ బంక్‌ల దగ్గర ఆగిపోతూ వుంది, డీజిల్ టాంక్‌లో ఆయిల్ నింపుకోవడానికి. ఆ లారీ 12 టైర్లు వున్న లారీ. డీజిల్ ట్యాంక్ పెద్దదే. మూడొందల లీటర్ల డీజిల్ ట్యాంక్‌లో నింపుకోవచ్చు. మరి శేషగిరి ఫుల్‌గా ఎందుకు నింపుకోవడంలేదు. బంకుల్లో డీజిల్ సరఫరా బాగానే వుంది.



'ఔట్ ఆఫ్ స్టాక్' బోర్డులు ఎక్కడా లేవు.

'డీజిల్ ట్యాంక్‌లో ఆయిల్ ఫుల్‌గా ఎందుకు నింపుకోవడంలేదు' అనుమాన వచ్చింది.

తన ఏరియాలోకి లారీ రాగానే ఆపు చేయించాడు. డీజిల్ ట్యాంక్ చెక్ చేయించాడు. ఆ ట్యాంక్‌లో రెండు అరలు వున్నాయి. ఓ అరలో డీజిల్, మరో అరలో డ్రగ్స్ ప్యాకెట్లు వున్నాయి.

శేషగిరి తెలివితేటలకు ఆశ్చర్యపడిపోయాడు. అతని నేర్పరితనానికి భుజం తట్టి, నేరానికి అరచేతులకు బేడీలువేసి జైల్లో తోశేసారు.

లారీ ఓనర్ లబోదిబోమన్నాడు. అతనిమీద కూడా కేసు పెట్టారు.

మాదకద్రవ్యాల సరఫరాకు తన లారీని వాడుకున్నందుకు శేషగిరిని తిట్టుకున్నాడు.

బెయిల్‌మీద శేషగిరి బయటకు వచ్చినా తన లారీ షెడ్‌లోకి అతన్ని అడుగుపెట్టనివ్వలేదు లారీ ఓనరు. అతనే కాదు చుట్టుప్రక్కల ఏ లారీ ఓనరు శేషగిరిని లారీ డ్రైవర్‌గా పెట్టుకోవడానికి ఇష్టపడలేదు.

లారీఓనర్ తిలక్‌మీద కోపం వచ్చింది శేషగిరికి.

తిలక్ కూతురి పెళ్ళి. బంగారం, బట్టలు కొనడానికి బ్యాంక్‌లో డబ్బు డ్రాచేసి బీరువాలో పెట్టుకున్నాడాయన. అది గమనించాడు. తిలక్ బీరువా తాళాలు ఎక్కడ పెడతాడో శేషగిరికి తెలుసు.

తిలక్‌మీద కక్ష తీర్చుకోవాలి.

అర్థరాత్రి లేచి గోడ దూకి తిలక్ ఇంటి వెనుక వైపునకు చేరుకున్నాడు. డ్రైనేజీ పైపులు పట్టుకుని పైకి ఎగబ్రాకాడు. మేడమీదకు చేరుకున్నాడు. బాల్కనీ వైపు ఓ కిటికీ వుంది. ఆ కిటికీ స్క్రూలు విప్పి కిటికీ గ్రిల్ తీసి మెల్లగా శబ్దం రాకుండా ఓ ప్రక్కన పెట్టి గదిలోకి దూరేడు.

మేడమీద గదినే తిలక్ తన వ్యాపారాలకు సంబంధించిన లావాదేవీలు నిర్వహిస్తూ వుంటాడు. మేడ ముందువైపునుండి మెట్లు వున్నాయి ఆ గదిలోకి. రాత్రి పూట ఆ గదిలోనే పడుకుంటాడు. డబ్బు కూడా ఆ గదిలో వున్న బీరువాలోనే ఉంచుతాడు. అతని భార్యకు కీళ్ళనొప్పులు. మేడమీద గదికి రాదు. ఇద్దరు కొడుకులు, పెళ్లికాబోతున్న కూతురు కింద భాగంలో వున్న గదుల్లోనే పడుకుంటారు.

రాత్రి పూట నిద్రమాత్రలు వేసుకుని పడుకుంటాడు తిలక్. మాత్రలు వేసుకోకపోతే నిద్ర రాదు. ఆ సంగతి శేషగిరికి తెలుసు.

గదిలో ఓ మూల పాత పరువు వుంటుంది. ఆ పరుపు మడతల్లో బీరువా తాళాలు వుంచుతాడు తిలక్. ఆ పాత పరువులోకి చెయ్యి దూర్చి ఓ రోజు తాళాలు తియ్యడం శేషగిరి చూశాడు.

గదంతా చీకటి. బెడ్‌లైట్ వుంటే తిలక్‌కు నిద్రపట్టదు.

మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ పాత పరుపు దగ్గరకు వెళ్లి తాళాల కోసం వెతికాడు. తాళాలు దొరికేయి.

- ఇంకా ఉంది

నేర్చుకుందాం

శ్రీ నరసింహ శతకములోని పద్యము



సీ. తల్లిగర్భము నుండిధనము తేఁ డెవ్వఁడు
వెళ్లిపోయెడి నాడు వెంటరాదు
లక్షాధికారైన లవణమన్నమె కాని
మెఱుఁగు బంగారంబు మ్రింగబోఁడు
విత్తమార్జన చేసి విఱ్ఱవీగుటె గాని
కూడఁబెట్టిన సొమ్ము కుడువఁబోడు
పొందుగా మఱుగైన భూమి లోపలఁబెట్టి
దానధర్మము లేక దాచి దాచి
తే. తుదకు దొంగలకిత్తురో దొరలకవునొ
తెనె జుంటీగలియ్యవా తెరువరులకు
భూషణ వికాస! శ్రీధర్మపురనివాస!
దుష్టసంహార! నరసింహ! దురిత దూర!

భావం: పుట్టేటపుడు ధనమెవ్వరూ తీసుకొని రారు. చనిపోయే నాడు ఏది తన వెంటరాదు. ఎంత గొప్ప ధనికుడైనా ఉప్పన్నమే గాని మెరిసే బంగారాన్ని మ్రింగడు. డబ్బు గడించి పొగురబోతు తనాన్ని పెంచుకోవటమే కాని ఆ సొమ్ము అనుభవానికి రాదు. కూడబెట్టిన సొమ్ము దొంగల పాలౌతుందో లేక దొరల పాలౌతుందో తెలియదు. తేనెటీగలు తెట్టెల్లో తేనెని కూడబెట్టి బాటసారుల కిస్తున్నాయి గదా.

మాటాట : 1537

నిర్వహణ: సుధామ

1		2		3	■	4
	■		■		■	
5		■	6			
■	■	7	■		■	■
8	■	9		■	10	11
12			■	13	■	
	■	■	14			

ఆధారాలు

అడ్డం:
1. భోగి మరుగాడు
5. అరటిచెట్టు దేవకన్య
6. భూమి
9. పక్షము
10. మత్తు పదార్థం
12. మేషాదిగా పన్నెండు
14. పతంగ్

నిలువు:
1. ఉత్సవం
2. పెద్దశిల
3. రమింప నిచ్చగలవాడు
4. స్త్రీ
7. మినుములతో చేసుకొనే తద్దినపు భక్ష్యాలు
8. పరాక్రమాలు
11. దీపపు గూడు
13. సఖి, స్నేహితురాలు

మాటాట - 1536 సమాధానం

1 పం	■	■	2 చ	3 లి	మం	4 ట
5 దే	వ	6 త	■	ప్త	■	ము
లు	■	7 గు	రి	■	8 బిం	కు
■	■	వు	■	9 బి	■	■
10 చె	త్త	■	11 అ	య్య	■	12 వే
అ	■	13 నె	■	14 ము	గ్గు	లు
15 కు	వ	ల	యం	■	■	వ



రాశిఫలం

- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

● **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
మీ మంచి ప్రవర్తనను ఇతరులు ఆదర్శంగా తీసుకుంటారు. ప్రయత్న కార్యాలన్నింటిలో విజయాన్ని సాధిస్తారు. దైవదర్శనం చేసుకుంటారు. స్థిరాస్తులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించుకుంటారు.

● **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా వుండును. ఆరోగ్యం గూర్చి శ్రద్ధ వహించాలి. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు.

● **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
వృత్తి ఉద్యోగ రంగాల్లో కోరుకున్న అభివృద్ధి ఉంటుంది. ఆకస్మిక ధనలాభాన్ని పొందుతారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా లభిస్తుంది. గౌరవ, మర్యాదలు పెరుగుతాయి

● **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)**
అనారోగ్య బాధలను అధిగమిస్తారు. నూతన కార్యాలకు ఆటంకాలున్నా సత్ఫలితాలు పొందుతారు. ప్రయాణాల్లో జాగ్రత్త అవసరం.

● **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
అనారోగ్య బాధలు అధికమవుతాయి. అకారణంగా కలహాలేర్పడే అవకాశాలుంటాయి. విద్యార్థులు చంచలంగా ప్రవర్తిస్తారు.

● **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
నూతన వస్తు, వస్త్ర, వాహన ఆభరణ లాభాలను పొందుతారు. ఆకస్మిక ధనలాభయోగముంటుంది. శుభవార్తలు వింటారు.

● **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
ఋణప్రయత్నం ఫలిస్తుంది. చెడు సహవాసంవైపు వెళ్ళకుండా వుంటే గౌరవం దక్కుతుంది. క్షణికావేశం పనికిరాదు. అనుకోకుండా కుటుంబంలో కలతలేర్పడే అవకాశముంది.

● **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
కుటుంబ కలహాలు దూరమవుతాయి. ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. వృథా ప్రయాణాలవల్ల అలసట చెందుతారు. చెడు పనులకు దూరంగా వుండుట మంచిది.

● **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.,)**
గౌరవ మర్యాదలకు లోపముండదు. అనవసర వ్యయ ప్రయాసలుంటాయి. మానసికాందోళనతో కాలం గడుపవలసి వస్తుంది.


● **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
ఊహించని కార్యాల్లో పాల్గొనే అవకాశముంటుంది. వృత్తి ఉద్యోగ రంగాల్లో అభివృద్ధి ఉంటుంది. ఆత్మీయులను కలియుటలో విఫలమవుతారు.

● **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
అద్భుతమైన అవకాశాలను పొందుతారు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరతాయి. ముఖ్యమైన శుభవార్తలు వింటారు. ఆత్మీయుల సహాయ సహకారాలు సంపూర్ణంగా లభిస్తాయి.

● **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
మనోధైర్యాన్ని కోల్పోకుండా జాగ్రత్త వహించుట అవసరం. నూతన కార్యాలకు ఆటంకాలేర్పడతాయి. కోపాన్ని తగ్గించుకుంటే మంచిది.

మంచిమాట

శ్రీగోదారంగనాథులు



తిరుప్పావై ముప్పదవ పాశురం 'వంగక్కడల్
వంగక్కడల్ కడైన్ద మాదవనై క్కేశవనై
తింగళ్ తిరుముగత్తు శేయిళైయార్ శెన్రు ఇఱైంఞ్ఱి
అంగు అప్పఱై కొండ వాఱై అణిపుదువై
పైమ్ కమల త్తం తెరియల్ పట్టర్ పిరాన్ కోదైశొన్న
శంగత్తమిళ్ మాలై ముప్పదుం తప్పామే
ఇంగుఇప్పరిశురైప్పార్ ఈరి రండు మాల్ వరై త్తోళ్
శెమ్ కణ్ తిరుముగత్తు శెల్వ తితరుమాలాల్
ఎంగుం తిరువరుళ్ పెఱ్రు ఇన్బురువర్ ఎమ్బావాయ్

భావం: తిరుప్పావై వ్రత అధ్యయన, ఆచరణ ఫలాలు, తిరుప్పావై సందేశం ఈ నాటి పాశురంలో తెలుపబడుతున్నది. క్షీర సముద్రంగా సంసార సాగరాన్ని చేరి ఎందరో ఓడల వంటి మానవ శరీరాలను దరిచేర్చిన ఆ శ్రీమన్నారాయణుని గూర్చి ద్వాపర యుగంలోని గోపికలు వ్రతం చేసి పరను పొంది తరించిన విధంగా శ్రీ విల్లి పుత్తూరులో భట్టు నాథుల కుమార్తె గోదాదేవి ఆ వ్రతాన్ని పాటలుగా జీవులకు అనుసంధించి తరించమని అందించింది. వాటిని క్రమం తప్పక భక్తితో నియమంతో అనుసంధిస్తే, ఈ లోకంలోనే శ్రీమన్నారాయణుని రూపాన్ని దర్శించి అతని దివ్య కృపకు పాత్రులై పరమపదమును పొందగలరు. గోదాదేవి అనుభవించి చెప్పినా, ద్రావిడ భాషలో కూర్చబడిన మాలారూపమైన ముప్పది పాటలు తప్పక అనుసంధించినచో, ప్రియః పతి వలన, తల్లి గోదాదేవి వలన సాటిలేని కృపను పొంది శాశ్వతానందాన్ని పొందుతారని ఫలశృతిగా చెప్తూ అందరినీ ఆచరించవలసినదని తల్లిగా, గురువుగా గోదాదేవి బోధిస్తున్నది.

కోదై పిరన్దవూర్ గోవిన్దన్ వాళ్ మూర్
శోది మణి మాడం తోన్రుమూర్, నీది యాల్
నల్ల పత్తర్ వాళ్ మూర్, నాన్మ రైగళో దుమూర్
విల్లిపుత్తూర్ వేదక్కోనూర్
పాతకం జళ్ తీర్క్కుం పరమ నడికాట్టుమ్
వేదమనై త్తుక్కుం విత్తాగుం- గోదై తమిళ
ఐమైన్దు మైన్దుం అరియాద మానిడరై
వైయం శుమప్పదుం వమ్బు
తిరువాడిప్పూరత్తిల్ శెగ్తుదిత్తాళ్ వాళియే
తిరుప్పావై ముప్పదుం శెప్పినాళ్ వాళియే
పెరియాళ్వార్ పెఱ్రెడుత్త పెణ్బిళై ౹ వాళియే
పెరుంబూదూరు మామునిక్కు ప్పిన్నానాళ్ వాళి
బరునూఱ్రు నార్పత్తు మూన్రు రైత్తాళ్ వాళియే
ఉయర్ రజ్గర్‌కే కణ్ణి యుగన్ద ళిత్తాళ్ వాళియే
మరువారుం తిరుమల్లి వళనాడు వాళియే
వణ్‌పుదువై నగర్ కోదై మలర్పదంగళ్ వాళియే
ఆండాళ్ తిరువడి గళే శరణం
ఆచార్య తిరువడి గళే శరణం

- డాక్టర్. పరవస్తు కమల

యాజ్ఞసేని



- త్రోవగుంట వేంకట సుబ్రహ్మణ్యము 11

నా విషయంలో ద్రుపదుడు రాజైన తర్వాత గర్వంతో ప్రవర్తించాడు. దానికి తగిన ఫలితాన్ని పొందాడు గదా? పాంచాల రాజ్యం రెండు ముక్కలయింది గదా? గర్వం అణిగిపోయింది ద్రుపదునికి. కానీ ఒక క్షత్రియుడిగా నాపై శత్రుత్వాన్ని విడువలేకపోయాడు. నన్ను జయించటానికి అతడికి వీలుగా యజ్ఞ యాగాదుల ద్వారా నన్ను జయించగల ఒక కుమారుడిని పొందాడు. అది దైవనిర్ణయం. అది అడ్డుపెట్టుకొని అతడి కుమారుడిని శిష్యునిగా చేర్చుకొని అస్త్ర విద్యలు నేర్పనని తిరస్కరించలేను. విధి నిర్ణయం ఎలాయుందో అదే జరుగుతుంది. నీవు నిశ్చితంగా ఉండుము''అని సున్నితమైన ధర్మసూక్షాన్ని వివరించి పంపాడు.

మరునాడు ధృష్టద్యుమ్నుడు ప్రాతఃకాలంలోనే అందరితోపాటు గురువుగారిని దర్శించుకున్నాడు. గురువుకు నమస్కరించాడు. నిలబడ్డాడు. అతణ్ణి చూచి ద్రోణుడు- ''కుమారా! నేటినుండినీవు నా వద్ద శ్రద్ధతో అస్త్రవిద్యలభ్యసించవలసింది. చెప్పినవాటిని శ్రద్ధగా ఆకళించుకొని ప్రవర్తించుము. కఠినమైన పరీక్షలను ఎదుర్కొనవలసి వుంటుంది. అప్పుడే విద్య అలవడుతుంది. నేడు నేర్వవలసిన దానికై ఉద్యుక్తుడవుగమ్ము'' అని అన్నాడు.

గురుశిష్యులిద్దరూ అస్త్ర ప్రయోగాలు చేసే ప్రదేశానికి వెళ్ళారు.

ధృష్టద్యుమ్నుడు ద్రోణుని వద్ద సకల అస్త్ర విద్యలను అభ్యసించాడు. విద్యాభ్యాసం పూర్తి అయిన తరువాత ఒక నాడు గురువుతో


''ఆచార్యా! నేటితో నేను నేర్వవలసిన విద్యలు తమ దయతో పూర్తి అయినవి. మీరు అనుమతిస్తే నేను నా రాజ్యానికి తిరుగు ప్రయాణమౌతాను. నేను శిష్యరికం వహించిన ఈ కాలంలో నావలన ఏవైనా తప్పులు జరిగియుంటే మీ పుత్రుని క్షమించినట్లుగా నన్ను కూడా క్షమించండి. మీకేమి గురుదక్షిణ ఇవ్వవలయునో ఆజ్ఞాపించండి. నా శక్తిమేర దానినివ్వటానికి ప్రయత్నిస్తాను'' అని అన్నాడు.

కుమారా! ఏ గురుదక్షిణా అవసరం లేదు. క్షేమంగా నీ రాజ్యానికి చేరుము. విద్య నేర్పిన గురువుపట్ల సదా విధేయుడై ఉండటమే గొప్ప గురుదక్షిణ. నేడు నీకు అనుజ్ఞనిస్తున్నాను, క్షేమంగా వెళ్లిరా! అని ద్రోణుడు దృష్టద్యుమునికి అనుజ్ఞ ఇచ్చాడు.

దృష్టద్యుమ్నుడు గురువుగారి ఆజ్ఞను పొంది స్వరాజ్యానికి చేరాడు. తండ్రి ద్రుపద మహారాజుకు అన్ని విషయాలు సవివరంగా విన్నవించాడు.

8

అది ద్రుపద మహారాజు ఉద్యానవనం రకరకాల పుష్పజాతులు విరజిమ్ముచున్న సువాసనలతో హృదయాహ్లాదకరంగా ఒప్పుచున్నది. ఆ పూలవాసనలకు మూగిన తుమ్మెదల ఝుంకారధ్వనులు వాద్యఘోషను తలపిస్తున్నది. వసంత సోయగాలలో మామిడి చిగురులను, మొగ్గలను తిని మత్తెక్కిన కోయిలలు కూసే కూతలు యింపుగా చెవులను తాకుతున్నాయి.



బాగా పూచిన అశోకాల సంపెంగ పూల ఘాటయిన వాసనలు అందరిని ఆహ్వానిస్తున్నాయి. ఒకే వరుసలో నాటిన మంచి గంధపు చెట్లతో, బరువైన గెలలో వంగిన రంభాతరువులు, వాటికి అలతి దూరంలో క్రిందికి జారుచున్న సెలయేరులు ఉద్యానవన శోభను మరింతగా ఇనుమడింపజేస్తున్నాయి.

పద్మాకారంలో నిర్మింపజేయబడిన రాతిమడుగులలోని పద్మాలు వికసించి సుగంధాన్ని చిమ్ముతున్నాయి.

రాజధానికి అతి సమీపంలోనున్న గంగానది మీదనుండి వీస్తున్న పిల్లవాయువులు మేనువును పులకింపజేస్తున్నాయి.

అందమైన ఉద్యానవనంలో అక్కడక్కడా నిర్మింపబడిన రాతిమండపాలకు అల్లుకున్న లతలు పూలతో వికసించి కీటకాలను ఆహ్వానిస్తున్నాయి.

పాలరాతితో నిర్మింపబడిన ఎత్తైన వలయాకార మండపాలలో అందమైన వేదికలు ముచ్చటగొల్పుచున్నాయి.

మండపాల మధ్యభాగంలో వ్రేలాడదీయబడిన పంజరాలలోని పక్షులు కూసే పలు రకాల కూతలెన్నో వినిపిస్తున్నాయి. అది యధేచ్ఛగా పంజరాలోనికి వస్తూ పోతున్నాయి.

అక్కడక్కడ పంజరాలలోని రంగు రంగుల శుకాలు ఉద్యానవనంలో విహరిస్తున్నవారిని చూచి ''రండి రండి! రండి కూర్చోండి! బాగున్నారా!'' అని చిలక పలుకులతో పలకరిస్తున్నాయి.

అది సాయం సమయం, యాజ్ఞసేని మండపంలోని వేదికపై ఆసీనురాలై ఉన్నది. ఏదో పరధ్యానంలో మైమరచి యున్నది.

పైనున్న రాచిలుక ఒకటి పంజరంలో నుండి బయటికి వంగి రాజకుమారిని చూచింది.

''రాకుమారి! రాకుమారి!'' అని అన్నది.

- ఇంకా ఉంది

రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్**, ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

ఆంధ్రభూమి
ఆటాపోటీ


ఎవరి పిచ్చి వారిది!



ఎవరి పిచ్చి వారికి ఆనందం అంటారు. రకరకాలైన విశ్వాసాలు, మూఢ నమ్మకాలు కేవలం సామాన్యులకే పరిమితం అనుకుంటే పొరపాటే. సెలబ్రిటీలకు ఇది మరీ ఎక్కువ. మన దేశంలో క్రికెట్ ఒక మతంలా వెలిగిపోతున్నది. క్రికెటర్లను సాక్షాత్తు దేవతలుగా ఆరాధించే వారికి కొదువ లేదు. అందుకే క్రికెటర్లకు సంబంధించిన ప్రతి విషయం ఆసక్తిని రేపుతుంది. వారికి ఉన్న నమ్మకాల గురించి తెలుసుకోవాలన్న కుతూహలం ప్రతి ఒక్కరిలోనూ ఎంతోకొంత ఉంటుంది. ఆశ్చర్యం కలిగించే ఎన్నో నమ్మకాలు క్రికెటర్లలో ఉన్నాయి. వాటిలో మచ్చుకు కొన్ని.. 2011 వరల్డ్ కప్ సమయంలో భారత సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఎక్కడికి వెళ్లినా తన వెంట ఒక బ్యాగును తీసుకెళ్లేవాడు. ఆ సిరీస్ మొత్తంలో అశ్విన్ కేవలం రెండు మ్యాచ్‌లే ఆడినప్పటికీ, భారత్ పాల్గొన్న అన్ని మ్యాచ్‌లకూ అతను అదే బ్యాగ్‌తో దర్శనమిచ్చాడు. ఆ సంచీనే టీమిండియాకు ప్రపంచ కప్‌ను సాధించిపెట్టిందని అతని విశ్వాసం. మాజీ కెప్టెన్, సూపర్ వికెట్ కీపర్ మహేంద్ర సింగ్ ధోనీకి 'నంబర్ 7' అంటే ఎంతో ఇష్టం. అది అతని పుట్టిన తేదీ కూడా (7 జూలై, 1981). కెరీర్ మొదలు పెట్టినప్పటి నుంచి అతను ఏడో నంబర్ జెర్సీనే ధరిస్తున్నాడు. తన ఎదుగుదలకు ఏడో అంకెనే ప్రధాన కారణమని గాఢంగా నమ్ముతాడు. టీమిండియా ప్రస్తుత కెప్టెన్ విరాట్ కోహ్లీకి కూడా కొన్ని పిచ్చి నమ్మకాలు లేకపోలేదు. చిన్నతనంలో, ఒక మ్యాచ్‌లో ఎక్కువ పరుగులు చేసినప్పుడు వేసుకున్న గ్లోవ్స్‌ను ఆ తర్వాత ప్రతి మ్యాచ్‌లోనూ వేసుకునేవాడు. అవి చిరిగిపోతేనే కొత్త గ్లోవ్స్‌ను తీసుకునేవాడు. తర్వాతి కాలంలో ఆ అలవాటును మానుకున్నా, చాలాకాలం మణికట్టుకు నల్ల రంగు బ్యాండ్ వేసుకునేవాడు. అది ఉంటేగానీ రాణించలేనన్న అభిప్రాయం అతనికి ఉండేది. ఇప్పుడు రిస్ట్ బ్యాండ్‌ను తీసేసినా, కడియం వేసుకుంటున్నాడు. 2012 నుంచి చేతి కడియం అతని శరీరంలో ఒక భాగమైపోయింది. మరో కొత్త నమ్మకం పుట్టుకొచ్చే వరకూ కడియాన్ని వదలడేమో!

క్రీజ్‌లో పాతుకుపోయి, ఎన్నో సందర్భాల్లో జట్టును ఆదుకున్న 'ది వాల్' రాహుల్ ద్రవిడ్‌కు క్రికెట్ ప్రపంచంలో అజాత శత్రువన్న పేరుంది. విద్యాధికుడైనప్పటికీ, అతనికీ కొన్ని విశ్వాసాలున్నాయి. బ్యాటింగ్‌కు దిగేముందు అతను ఎప్పుడూ కుడికాలికి థై ప్యాడ్‌ను ధరించేవాడు. ఏదైనా సిరీస్ మొదలైనప్పుడు, మొదటి మ్యాచ్‌లో ఎన్నడూ కొత్త బ్యాట్‌ను ఉపయోగించేవాడుకాడు. పాత బ్యాట్‌తోనే మొదటి మ్యాచ్‌లు ఆడేవాడు. ఇక, క్రీజ్‌లోకి వెళ్లిన మరుక్షణం నుంచే బౌలర్లపై విరుచుకుపడి, పరుగుల వరద పారించే పనిలో పడే వీరేందర్ సెవాగ్ కెరీర్ ఆరంభంలో 44వ నంబర్ ఉన్న జెర్సీని వేసుకునేవాడు. కానీ, ఒక సంఖ్యాశాస్త్ర నిపుణుడు చెప్పిన సూచన మేరకు అతను నంబర్ లేని జెర్సీని వేసుకోవడం మొదలుపెట్టాడు. కెరీర్ ముగించేవరకూ అదే సూత్రాన్ని పాటించాడు.





ఆల్‌రౌండర్‌గా పేరుతెచ్చుకున్న యువరాజ్ సింగ్‌కు 12వ అంకె అంటే ఎంతో ఇష్టం. అందుకు కారణం లేకపోలేదు. అతను 12వ నెల (డిసెంబర్) 12వ తేదీన, మధ్యాహ్నం 12 గంటలకు చండీగఢ్‌లోని 12వ సెక్టార్‌లో జన్మించాడు. సహజంగానే ఆ అంకె పట్ల అతనికి ఇష్టం పెరిగింది. కేన్సర్ వ్యాధిన పడి, అమెరికాలో చికిత్స పొందిన తర్వాత మృత్యుంజయుడిగా యువీ బయటపడ్డాడు. యువీ ఆసుపత్రిలో ఉన్న సమయంలో అతని చేతి మణికట్టుకు తల్లి షబ్నం సింగ్ ఒక నల్ల బ్యాండ్ కట్టింది. దుష్టశక్తులను ఈ నల్ల చేతి పట్టీ పారదోలుతుందని ఆమెతోపాటు యువీ కూడా నమ్ముతాడు. భారత మాజీ కెప్టెన్, 'కోల్‌కతా ప్రిన్స్' సౌరవ్ గంగూలీ డ్రెస్సింగ్ రూమ్‌లో ఏదో ఒకచోట తన ఆధ్యాత్మిక గురువు ఫొటోను ఉంచేవాడు. సిరీస్ ముగిసేవరకూ దానిని అక్కడి నుంచి తీసేవాడుకాదు. మాజీ పేసర్ జహీర్ ఖాన్ మ్యాచ్‌లు ఆడుతున్నప్పుడు ఎప్పుడూ పసుపు పచ్చ కర్చీఫ్ జేబులో ఉంచుకునేవాడు. అది లేకపోతే, తాను గొప్పగా బౌలింగ్ చేయలేనని భయపడేవాడు.

భారత జట్టు కపిల్ దేవ్ నాయకత్వంలో, 1983లో మొదటిసారి ప్రపంచ కప్‌ను గెల్చుకుంది. జింబాబ్వేతో జరిగిన అత్యంత కీలక మ్యాచ్‌లో కపిల్ విజృంభించకపోతే, భారత్ నాకౌట్ దశకు కూడా చేరి ఉండేది కాదు. ఒకానొక దశలో 17 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన జట్టును కపిల్ ఆదుకున్నాడు. అజేయంగా 175 పరుగులు సాధించి, భారత్‌ను గెలిపించాడు. ఇదంతా ఒక ఎత్తయితే, అప్పట్లో జట్టుకు మేనేజర్‌గా వ్యవహరించిన మాన్‌సింగ్ మిగతా ఆటగాళ్లకు జారీ చేసిన ఆదేశం మరోఎత్తు. కపిల్ బ్యాటింగ్ మొదలు పెట్టినప్పుడు, ఎవరెవరు, ఎక్కడెక్కడ కూర్చొని మ్యాచ్‌ని చూస్తున్నారో వారంతా తమ తమ స్థానాలను మార్చవద్దని మాన్‌సింగ్ ఆదేశించాడు. భారత్ విజయం సాధించిన తర్వాత, అప్పటివరకూ కదలకుండా ఒకేచోట కూర్చొని మ్యాచ్‌ని తిలకిస్తున్న భారత క్రికెటర్లంతా ఊపిరి పీల్చుకున్నారు.

మాజీ కెప్టెన్, 'లిటిల్ మాస్టర్' సునీల్ గవాస్కర్ కెరీర్ ఆరంభించిన రోజుల్లో స్వెట్టర్ తొడుక్కునేవాడుకాడు. ఎంత చలిలో ఆడాల్సి వచ్చినా అతను స్వెట్టర్ లేకుండా ఆడేందుకే ఇష్టపడేవాడు. గవాస్కర్‌కు మరో నమ్మకం కూడా ఉంది. బ్యాటింగ్ చేయడానికి మైదానంలోకి వెళుతున్నప్పుడు రెండో బ్యాట్స్‌మన్‌కు ఎప్పుడూ కుడివైపునే ఉండేలా జాగ్రత్త పడేవాడు. ప్యాంట్‌కు నాడా కట్టుకోవడం, తలకు హెల్మెట్ లేకుండా కేవలం హెడ్‌గార్డ్‌తోనే బ్యాటింగ్‌కు దిగడం అతని అలవాట్లు. అవే అతని నమ్మకాలు కూడా.

ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ వాకు అతని కుటుంబ పెద్దలు ఒకసారి రెడ్ కర్చీఫ్ ఇచ్చారు. దానిని జేబులో పెట్టుకొని ఆడిన మ్యాచ్‌లో భారీ స్కోరు చేయడంతో, ఆ తర్వాత ఎప్పుడూ దానిని విడిచిపెట్టలేదు. ఆ ఎర్ర రుమాలు అతని దుస్తుల్లో భాగమైపోయింది. ఇలాంటి సెంటిమెంటే భారత ఆల్‌రౌండర్ మొహీందర్ అమర్‌నాథ్‌కు కూడా ఉండేది. 1983 వరల్డ్ కప్ ప్రారంభంలో ఎర్ర కర్చీఫ్ జేబులో ఉంచుకున్నాడు. అందులో భారత్ గెలవడంతో, టోర్నమెంట్ చివరి వరకూ అదే సెంటిమెంట్‌ను కొనసాగించాడు. విచిత్రంగా టీమిండియా ఫైనల్‌లో వెస్టిండీస్‌ను ఓడించి టైటిల్ గెల్చుకుంది. మొహీందర్ రెడ్ కర్చీఫ్ భారత్‌కు టైటిల్ అందించిందేమో!

- బిట్రగుంట



'క్రికెట్ దేవుడు' సచిన్ తెండూల్కర్ బ్యాటింగ్‌కు దిగే ప్రతిసారీ ముందుగా ఎడమ కాలి ప్యాడ్‌ను కట్టుకునేవాడు. ఒక్కోసారి హడావుడిగా మైదానంలోకి వెళ్లాల్సి వచ్చినా, తన సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నడూ అతను ముందు కుడి కాలి ప్యాడ్ కట్టుకోలేదు. ఏ కాలికి ముందు ప్యాడ్ కట్టుకుంటే ఏమవుతుంది? అనే ప్రశ్నకు సచిన్ వద్ద కూడా సరైన సమాధానం లేదేమో!

'ముద్దు'బంతి!


బంతిని మెరిపించడానికి బౌలర్లు నానా తంటాలు పడుతుంటారు. లాలాజలాన్ని పూస్తూ, ప్యాంటుకు రుద్దుతూ షైనింగ్‌ను పెంచే ప్రయత్నం చేస్తారు. అంతేగానీ, బంతిని ఎవరూ ముద్దుపెట్టుకోరు. కానీ, శ్రీలంక పేసర్ మలింగ స్టయిలే వేరు. అతని బౌలింగ్ యాక్షన్ ఎంత భిన్నంగా ఉంటుందో, అంతే చిత్రంగా బంతి వేయడానికి రనప్ మొదలుపెట్టడానికి ముందు దానిని ముద్దాడతాడు. బంతిని ముద్దు పెట్టుకునే బౌలర్ అతనొక్కడేనేమో!

సచిన్ ఉన్నందుకే!

జిమ్ లేకర్ తర్వాత టెస్టు క్రికెట్‌లో ఒక ఇన్నింగ్స్‌లో మొత్తం పది వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా చరిత్ర సృష్టించిన భారత స్పిన్నర్ అనిల్ కుంబ్లే. 1999 ఫిరోజ్‌షా కోట్లా మైదానంలో పాకిస్తాన్‌తో జరిగిన టెస్టులో అతను ఈ ఫీట్‌ను నమోదు చేశాడు. ఒక బౌలర్ బంతులు వేయడానికి ఉపక్రమించే సమయంలో టోపీ, గాగుల్స్ లేదా స్వెటర్‌ను అంపైర్‌కు ఇవ్వడం పరిపాటి. కానీ, ఆ మ్యాచ్‌లో కుంబ్లే తన టోపీ, స్వెటర్‌ను సచిన్ తెండూల్కర్‌కు ఇచ్చినప్పుడే వికెట్‌ను సాధించగలిగాడు. సచిన్ తనకు సమీపంలో ఉన్నందుకే ఒక ఇన్నింగ్స్‌లో పది వికెట్లు సాధ్యమయ్యాయని కుంబ్లే నమ్మకం.

మంచులోనే మ్యాచ్!

డబ్బు ముందు ఏవీ పని చేయవు. అమెరికా జాతీయ ఫుట్‌బాల్ (రగ్బీ) లీగ్ మ్యాచ్‌లను అభిమానులు విరగబడి చూస్తారు కాబట్టి, దాదాపు ఏడాది పొడవునా మ్యాచ్‌లు జరుగుతూనే ఉంటాయి. అయితే, న్యూయార్క్‌లో ఉష్ణోగ్రత మైనస్ డిగ్రీలకు చేరుకోవడంతో, బఫెలో బిల్స్, ఇండియానా పొలిస్ కోల్ట్స్ మధ్య జరగాల్సిన మ్యాచ్ వాయిదా పడుతుందని అంతా ఊహించారు. కానీ, అధికారులు మాత్రం మ్యాచ్‌ని రద్దు చేయడానికిగానీ, వాయిదా వేయడానికి వీల్లేదని పట్టుబట్టారు. ఒకవేళ మ్యాచ్ జరగకపోతే, అప్పటికే అమ్ముడైన టికెట్ల డబ్బును తిరిగి చెల్లించాల్సి వస్తుందని వారి భయం. అందుకే, వాతావరణ పరిస్థితులు ఎలావున్నా, మ్యాచ్ షెడ్యూల్ ప్రకారమే జరుగుతుందని తేల్చిచెప్పారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆటగాళ్లు మంచులోనే మ్యాచ్ ఆడారు. బఫెలో బిల్స్ 13-7 తేడాతో గెలిచింది. నిర్వాహకుల తీరుతో మండిపోయిన కొంతమంది ప్రేక్షకులు ఎముకలు కొరికే చలిలోనూ షర్టులు విప్పేసి మరీ మ్యాచ్‌ని చూశారు. అధికారుల వైఖరికి నిరసన చెప్పడానికి ఇదో పద్ధతేమో!



కపిల్ బ్యాడ్‌లక్

హేమాహేమీ ఆటగాళ్లున్న వెస్టిండీస్‌ను నిలువరించి, 1983లో ప్రపంచ కప్ చాంపియన్‌షిప్‌ను భారత్‌కు సాధించి పెట్టిన లెజెండరీ ఆల్‌రౌండర్, మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ పేరుమీద చాలా రికార్డులున్నాయి. వాటిలో ఒకటి కెప్టెన్‌గా అతని అద్భుత బౌలింగ్. వివియన్ రిచర్డ్స్, గార్డెన్ గ్రీనిడ్జి, క్లైవ్ లాయిడ్, డెస్మండ్ హేన్స్ వంటి అసాధారణ బ్యాట్స్‌మెన్‌తో కూడిన వెస్టిండీస్‌ను 1983 నవంబర్‌లో అహ్మదాబాద్ టెస్టులో ఢీకొన్నప్పుడు, భారత్‌కు నాయకత్వం వహించిన కపిల్ రెండో ఇన్నింగ్స్‌లో 83 పరుగులకే తొమ్మిది వికెట్లు పడగొట్టాడు. ఒక కెప్టెన్‌కు టెస్టుల్లో అదే అత్యుత్తమ బౌలింగ్ విశ్లేషణ. కానీ, అంత కష్టపడినా ఫలితం దక్కలేదు. ఆ మ్యాచ్‌లో వెస్టిండీస్ 138 పరుగుల తేడాతో గెలిచింది.

కాకతాళీయమేనా?

'క్రికెట్ మక్కా' లార్డ్స్ మైదానంలో భారత జట్టు టెస్టు మ్యాచ్‌ని గెల్చుకున్న రెండు సంఘటనల మధ్య సారూప్యం కాకతాళీయమేనా? లేక చాలా మంది క్రికెటర్లు నమ్ముతున్నట్టు బలమైన కారణం ఏదైనా ఉందా? ఈ ప్రశ్నకు సమాధానం అంత సులభంగా లభించదు. విషయానికి వస్తే, 1983లో లండన్‌లోని లార్డ్స్ మైదానంలో భారత జట్టు కపిల్ దేవ్ సారథ్యంలో ప్రపంచ కప్‌ను కైవసం చేసుకుంది. సరిగ్గా మూడేళ్ల తర్వాత, అంటే 1986లో భారత్ మొట్టమొదటిసారి లార్డ్స్ మైదానంలో ఒక టెస్టు మ్యాచ్‌ని గెలిచింది. ఆ మైదానంలో టీమిండియాకు రెండో టెస్టు విజయం 2014లో లభించింది. అంతకు మూడు సంవత్సరాల క్రితం, 2011లో మహేంద్ర సింగ్ ధోనీ నాయకత్వంలో భారత్ వరల్డ్ కప్‌ను సాధించింది. లార్డ్స్‌లో టెస్టు విజయానికీ, వరల్డ్ కప్‌కూ ఉన్న సంబంధం ఏమిటో?

సూపర్ బౌలర్ ఇంజీ!

సచిన్ తెండూల్కర్, బ్రియాన్ లారా వంటి మేటి బ్యాట్స్‌మెన్‌తో పోల్చగల ప్రతిభావంతుడు పాకిస్తాన్ మాజీ కెప్టెన్ ఇంజమాముల్ హక్. అతను గొప్ప బౌలరేమీ కాదు. 378 వన్డే ఇంటర్నేషనల్స్ ఆడితే, కేవలం 58 బంతులు మాత్రమే వేశాడు. 64 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. అయితే, బౌలింగ్‌లో ఎవరూ ఇంతవరకూ సాధించలేకపోయిన అరుదైన రికార్డును సొంతం చేసుకొని, సూపర్ బౌలర్ అనిపించుకున్నాడు. వన్డే ఇంటర్నేషనల్స్ ఫార్మాట్‌లో తాను వేసిన మొదటి బంతికే వికెట్ సాధించడమే అతనికి ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. 1991 నవంబర్ 24న వెస్టిండీస్‌తో ఫైసలాబాద్‌లోని ఇక్బాల్ స్టేడియంలో వన్డే ఆడుతున్నప్పుడు అతను కెరీర్‌లో తొలి ఓవర్ వేశాడు. మొదటి బంతికే విండీస్ స్టార్ బ్యాట్స్‌మన్ బ్రియాన్ లారాను ఔట్ చేశాడు. రెగ్యులర్ బౌలర్ కాకపోవడంతో, ఇంజీ బంతిని అర్థం చేసుకోలేక, వికెట్ కీపర్ మోయిన్ ఖాన్‌కు క్యాచ్ ఇచ్చి లారా వెనుదిరిగాడు. వన్డేల్లో వేసిన తొలి బంతికే వికెట్‌ను సాధించిన బౌలర్‌గా ఇంజీ నెలకొల్పిన రికార్డు ఇప్పటికీ చెక్కుచెదరలేదు.



పాప్‌కార్న్



బాహాబాహీ..

★ మాంచెస్టర్ యునైటెడ్, మాంచెస్టర్ సిటీ ఆటగాళ్ల మధ్య మైదానంలో మొదలైన ఘర్షణ ఆ తర్వాత కూడా కొనసాగింది. మాంచెస్టర్‌లోని డెర్బీ టన్నెల్‌లో పరస్పరం ఎదురైన ఇరు జట్ల ఆటగాళ్లు, అధికారులు, సపోర్టింగ్ స్టాఫ్ బాహాబాహీకి దిగారు. యునైటెడ్ ఆటగాళ్ల దాడిలో సిటీ ఆటగాడు జొస్ మొరిన్హో తలకు బలమైన గాయమైంది. ఆ జట్టు కోచ్ మకెల్ అర్టెటా కూడా తీవ్రంగా గాయపడ్డాడు. యునైటెడ్ స్టార్ ఆటగాడు రొమెలూ లుకాకూ విసిరిన బాటిల్ తగలడంతో అర్టెటా ముఖంపై లోతైన గాయమైంది. తెల్లవారి ట్రైనింగ్‌కు సిటీ ఆటగాళ్లు, కోచ్ కట్లతోనే ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నారు. ఈ సంఘటనపై ఇరు జట్లలో ఎవరూ ఫిర్యాదు చేయకపోవడం విశేషం.




ఆటవిడుపు

★ బ్రిటన్‌లో విపరీతంగా మంచు కురుస్తున్న కారణంగా కొన్ని మ్యాచ్‌లు రద్దు కాగా, ఇదే మంచి సమయమనుకున్న చాలా మంది ఫుట్‌బాల్ క్రీడాకారులు సంబరాల్లో మునిగి తేలుతున్నారు. వెస్ట్ హామ్ స్ట్రయికర్ ఆండీ కరోల్ తన కుమారుడు ఆర్లోస్‌తో కలిసి మంచు తిన్నెల్లో విహారం చేస్తున్నాడు. కొడుకు కోసం మంచు మనిషి బొమ్మను సిద్ధం చేసి మురిసిపోయాడు. ఎప్పుడూ బిజీగా ఉండే సాకర్ ఆటగాళ్లకు ఈ మాత్రం ఆటవిడుపు ఉండాలి కదా!



రొట్టెతిన్న విశ్వాసం

★ కుక్కలు విశ్వాసానికి మారుపేరని మరోసారి రుజువు చేసిన సంఘటన ఇది. 2014లో స్వీడన్‌కు చెందిన నలుగురు సభ్యులతో కూడిన ట్రెక్కింగ్ బృందం అడ్వెంచర్ రేసింగ్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంది. పోటీ ఆరంభమైన కొద్దిసేపటి తర్వాత, సేద తీరేందుకు ఒకచోట కూర్చున్నప్పుడు వీధి కుక్క ఒకటి ఆకలితో తమవైపే చూడడాన్ని ట్రెకర్లు గమనించారు. జాలిపడి, రొట్టె ముక్కలను దానికి వేశారు. తిండి పెట్టి, ఆకలి తీర్చారన్న విశ్వాసంతో ఆ కుక్క 430 కిలోమీటర్ల రేసు పూర్తయ్యే వరకూ వారినే అనుసరించింది. వారితో కలిసే గుట్టలను, తుప్పలను, కొండలను దాటింది. జట్టులోని ఓ సభ్యుడు మిఖయిల్ లిండార్డ్ ఆ కుక్కకు ఆర్థర్ అని పేరుపెట్టి, పెంచుకోవడానికి తనతో తీసుకెళ్లాడు. రొట్టె ముక్క తిన్నందుకు ఇన్ని కష్టాలను అనుభవించిన ఆర్థర్‌ను ఎవరైనా మెచ్చుకోవాల్సిందే.



ఇదో ఆట..

★ గొడ్డలిని ఎందుకు ఉపయోగిస్తారు? కట్టెలు కొట్టడానికి అంటూ ఎవరైనా ఈ ప్రశ్నకు సులభంగా సమాధానమిస్తారు. కానీ, కెనడాలోని నోవా స్కాటియా ప్రాంతానికి వెళితే, ఆర్చరీ మాదిరి కొత్త ఆట ఆడేందుకని జవాబు చెప్తారు. హాలీఫాక్స్‌లోని ఒక కట్టెల దుకాణాన్ని నడుపుతున్న డారెన్ హడ్సన్‌కు వచ్చిన ఆలోచన నుంచి పుట్టుకొచ్చిన కొత్త క్రీడ 'యాక్స్ త్రోయింగ్'. ఆర్చరీలో మాదిరిగానే ఒక లక్ష్యాన్ని సిద్ధం చేసి, దానిని గురి చేసి పదునైన గొడ్డలిని విసరడమే ఈ ఆట. ఒక రకంగా చెప్పాలంటే, గొడ్డలితో ఆడే ఆర్చరీ ఇది. ఇటీవల కాలంలో ఇతర ప్రాంతాలకు కూడా విస్తరిస్తున్న 'యాక్స్ త్రోయింగ్', పెడదారులు పడుతున్నది. కొంతమంది రెండు చేతులతో గొడ్డళ్లను విసిరితే, మరి కొంతమంది అత్యంత ప్రమాదకరంగా, లక్ష్యాల వద్ద మనుషులను నిలబెడుతున్నారు.

- సత్య



త్రివిక్రమ్ కోసం కొత్త అవతారం!

జైలవకుశ తరువాత తదుపరి చిత్రానికి సన్నాహాలు మొదలుపెట్టాడు ఎన్టీఆర్. ఇప్పటికే క్రేజీ దర్శకుడు త్రివిక్రమ్‌తో ఆయన సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన ఈ చిత్రం త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ మొదలుకానున్నదట. ఈ సినిమా కోసం ఎన్టీఆర్ బరువు తగ్గుతున్నాడట. దానికి కారణం కథ ప్రకారం కొత్త లుక్‌లో కన్పిస్తే బాగుంటుందని దర్శకుడు చెప్పడంతో ప్రస్తుతం అదే ప్రయత్నాల్లో వున్నాడు. ప్రస్తుతం విదేశాల్లో వున్న ఎన్టీఆర్, ఓ నిపుణుడి పర్యవేక్షణలో బరువు తగ్గే కసరత్తులు మొదలుపెట్టేశాడు. ఇటీవలే ఎన్టీఆర్‌ను చూసిన కొందరు షాకయ్యారట. ఎన్టీఆర్ స్లిమ్ లుక్‌లో అదిరిపోయేలా వున్నాడని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రొమాంటిక్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కే ఈ చిత్రం ఎన్టీఆర్‌కు మరో స్పెషల్ ఇమేజ్‌ను తీసుకొస్తుందని అంటున్నారు. త్వరలోనే ఈ సినిమాలో హీరోయిన్, మిగతా వివరాలు ప్రకటిస్తారట.

నాగార్జున కొత్తదనాన్ని అందించడంలో ముందుంటారు. హీరోగా ఓవైపు విభిన్నమైన సినిమాలు చేస్తూనే మరోవైపు నిర్మాతగా అభిరుచిగల చిత్రాలను నిర్మిస్తున్నాడు. తాజాగా ఆయన నిర్మిస్తున్న చిత్రం రంగులరాట్నం. రాజ్‌తరుణ్ హీరోగా శ్రీరంజని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ఆదివారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా నాగార్జున చెప్పిన విశేషాలు ఆయన మాటల్లో...



బొబ్బట్టులాంటి రంగుల రాట్నం

నాగార్జున

సంక్రాంతి బొబ్బట్టు..

ఈ సినిమా గురించి ఒక్కమాటలో చెప్పాలంటే, అన్నపూర్ణ బ్యానర్ వాళ్ళు వడ్డించే సంక్రాంతి బొబ్బట్టు ఈ చిత్రం. సినిమా చూశాను. బొబ్బట్టు చాలా కమ్మగా వుంటుంది. తల్లీ కొడుకులమధ్య ఎమోషన్స్, ప్రేమించిన అమ్మాయి, అబ్బాయిలమధ్య వుండే ఎమోషన్స్, లవ్, ఫ్రెండ్‌షిప్.. ఇలాంటి అంశాలన్నీ హైలెట్‌గా వుంటాయి. కథలో చాలా కొత్తదనం వుంది.

అలా కుదిరింది..

సినిమా సరైన టైము చూసి విడుదల చేద్దామని అనుకున్నాం కానీ కరెక్టుగా సంక్రాంతికి పండుగకు థియేటర్లు దొరకడం సినిమాకు బాగా కలిసి వచ్చింది. నిజానికి సంక్రాంతికి సినిమాను ప్లాన్ చేయలేదు. కానీ ఈ పండుగకు వచ్చే పర్ఫెక్ట్ సినిమా. చూస్తున్నంతసేపు మనసారా నవ్వుకుంటాం. కొన్నిసార్లు కంటతడి పెడతాం. అన్ని రకాల ఎమోషన్లు ఉన్నాయి కాబట్టే ఇది రంగులరాట్నం అయింది.

ప్రేక్షకుడిలానే..

ఈ సినిమాని ఎప్పుడో ఏడాది క్రితం చూశాను. ఈ సినిమా తరువాత వంద కథలు విని వుంటా. కానీ ఈ సినిమా బాగా నచ్చింది. ఏకథనైనా ప్రేక్షకుడిలానే వింటా. అందుకే అన్నపూర్ణ బ్యానర్‌లో చేయాలని నిర్ణయించుకున్నాను. దర్శకురాలు శ్రీరంజనికి ఇది మొదటి సినిమా. ఈ సినిమాలో ప్రతి ఎమోషన్‌ని కొత్త పాయింట్ ఆఫ్ వ్యూలో చూస్తారు. చాలా కొత్తగా అద్భుతంగా ప్రెజెంట్ చేసింది.

రాజ్‌తరుణ్‌తో..

రాజ్‌తరుణ్‌తో గతంలో ఉయ్యాల జంపాల చేశాం. నాకు రాజ్ తరుణ్ కామెడీ టైమింగ్ చాలా ఇష్టం. తన యాస కూడా కొత్తగా వుంటుంది. అది సినిమాకు బాగా ప్లస్ అయింది. ఈ చిత్రంలో సితార పాత్ర కూడా బాగుంటుంది. అన్నిరకాల ఎమోషన్స్‌తో వున్న రంగులరాట్నం సంక్రాంతి పండుగకి నవ్వులు కురిపిస్తుంది.

- శ్రీ

జువ్వ పోస్టర్ విడుదల



రంజిత్, పలక్ లల్వాని జంటగా 'దిక్కులు చూడకు రామయ్య' ఫేం త్రికోటి పేట దర్శకత్వంలో సొమ్మి ఫిలింస్ బ్యానర్‌పై డా.భరత్ సోమి నిర్మిస్తున్న చిత్రం 'జువ్వ'. ఈ చిత్ర టీజర్‌ను మెగాస్టార్ చిరంజీవి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ- సంక్రాంతి సందర్భంగా జువ్వ ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్ విడుదలచేయడం ఆనందంగా వుంది. ఈ సినిమా హీరో, నిర్మాతలు అన్నదమ్ములు. వారి తండ్రితో నాకు మంచి పరిచయం వుంది. తమ్ముని కోసం భరత్ డాక్టర్‌గా వుండి నిర్మాత అయ్యాడు. అన్నదమ్ముల అనుబంధానికి ప్రతీకగా వస్తున్న ఈ సినిమా టీజర్‌లో రంజిత్ ఉత్సాహంగా కనిపిస్తున్నాడు. పక్కా మాస్ పాత్రలో అదరగొట్టాడు. రాజమౌళి శిష్యుడు త్రికోటి దర్శకత్వం వహించిన ఈ సినిమా మంచి విజయం సాధించాలి అన్నారు. హీరో రంజిత్ మాట్లాడుతూ- చిరంజీవిగారంటే నాకెంతో ఇష్టం. ఆయనే నాకు రోల్‌మోడల్. ఆయనతో ఒక్క ఫొటో దిగితే చాలానుకునేవాడిని. కానీ నేను హీరోగా పరిచయం అవుతున్న సినిమా టీజర్‌ను ఆయన విడుదల చేయడం ఆనందంగా వుంది అన్నారు. దర్శకుడు త్రికోటి మాట్లాడుతూ- చిరంజీవి ఈ చిత్ర టీజర్‌ను ఆవిష్కరించడం చాలా సంతోషంగా వుంది. ప్రేమకతోపాటు తెరకెక్కిన ఈ చిత్రంలో చిన్న చిన్న థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉంటాయి అన్నారు. నిర్మాత భరత్ మాట్లాడుతూ- ఈ సినిమా షూటింగ్ పూర్తి అయింది. ఈనెలాఖరున పాటలను విడుదల చేసి ఫిబ్రవరిలో చిత్రాన్ని విడుదల చేస్తామన్నారు. ఈ చిత్రానికి సంగీతం:ఎం.ఎం.కీరవాణి, ఎడిటింగ్:కోటగిరి వెంకటేశ్వరరావు, కెమెరా:సురేష్, నిర్మాత:భరత్ సోమి, దర్శకత్వం:త్రికోటి పేట.

17న కాకతీయ కళావైభవం



కళలను కళాకారులను ప్రోత్సహిస్తూ వారిని గౌరవించే మంచి మనిషి కళాబంధు టి.సుబ్బిరామిరెడ్డి టిఎస్‌ఆర్ లలిత కళాపరిషత్ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం కాకతీయుల వైభవాన్ని చాటి చెప్పే విధంగా కాకతీయ కళావైభవ మహోత్సవాన్ని నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో సుబ్బిరామిరెడ్డి మ మాట్లాడుతూ- కాకతీయుల పరిపాలన స్వర్ణయుగం లాంటిది. 600 ఏళ్ళ క్రితమే తెలుగు సంస్కృతి, నాగరితలను ఘనంగా చాటారు. కళల్ని పోషించారు. ఎన్నో గొప్ప గొప్ప దేవాలయాలను శిల్పకళానైపుణ్యం, చాతుర్యంతో నిర్మించారు. కృష్ణదేవరాయల కంటే ముందునుంచే తెలుగు జాతికి వారసత్వాన్ని అందించారు. వరంగల్ రాజధానిగా 300 ఏళ్ళు తెలుగువాళ్ళని పాలించిన వారి పేరుమీద కాకతీయ కళావైభవాన్ని నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నాను. ఈనెల 17న శిల్పకళావేదికలో ఈ వేడుక ఘనంగా జరగనుంది. మహారాష్ట్ర గవర్నర్ సిహెచ్.విద్యాసాగర్‌రావు చేతులమీదుగా వేడుక ప్రారంభం అవుతుంది. ఈ వేడుకలో ప్రముఖ నటుడు మోహన్‌బాబును విశ్వనట సార్వభౌమ బిరుదుతో సత్కరిస్తున్నాం. పలువురు ఆధ్యాత్మిక రాజకీయ సినీ రంగ ప్రముఖులు పాల్గొంటారు. దాంతో తెలంగాణాలోని వరంగల్, ఖమ్మం, నల్గొండ, నిజామామాద్, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల్లో రెండు మూడు నెలలకోసారి కాకతీయ సాంస్కృతిక మహోత్సవాలు నిర్వహిస్తామన్నారు. మోహన్‌బాబు మాట్లాడుతూ- కళలన్నా, కళాకారులన్నా సుబ్బిరామిరెడ్డికి ఎంతో ఇష్టం. ఆయన కాకతీయుల కళావైభవాన్ని ప్రజలకు చాటి చెప్పాలనుకోవడం అభినందనీయం. ఈ వేదికపై విశ్వ నట సార్వభౌమ బిరుదును ఇస్తామని చెప్పారు. బిరుదులు నాకెందుకు అన్నాను. కానీ ఆయన పట్టుపట్టడంతో ఆయన నిర్ణయాన్ని కాదనలేకపోయా అన్నారు. ఈ కార్యక్రమంలో పరుచూరి గోపాలకృష్ణ, విజయ్‌కుమార్, కూచిపూడి కళాకారిణులు పద్మజ, సుజాత పాల్గొన్నారు.

మనసుకు నచ్చితే



నటిగా, నిర్మాతగా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న మహేష్‌బాబు సోదరి మంజుల దర్శకురాలిగా పరిచయం అవుతూ తెరకెక్కిస్తున్న చిత్రం 'మనసుకు నచ్చింది'. సందీప్ కిషన్, అమైరా దస్తూర్, త్రిధా చౌదరి ముఖ్యపాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, ఇందిరా ప్రొడక్షన్స్ బ్యానర్లపై సంజయ్ స్వరూప్, పి.కిరణ్ నిర్మిస్తున్నారు. సూపర్‌స్టార్ మహేష్‌బాబు ఈ సినిమా ట్రైలర్‌ను సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ- 'ట్రైలర్‌కి విశేషమైన స్పందన లభిస్తోంది. రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రం కూడా మంచి విజయం సాధిస్తుందన్న నమ్మకం వుంది. ఇటీవలే విడుదలైన పాటలకు కూడా అనూహ్యమైన స్పందన వస్తోంది. త్వరలోనే మిగతా కార్యక్రమాలన్నీ పూర్తిచేసి రిలీజ్ ఈవెంట్‌ను కూడా త్వరలో నిర్వహిస్తాం. ఈ నెల 26న చిత్రాన్ని విడుదల చేస్తాం' అన్నారు. ప్రియదర్శి, పునర్నవి భూపాలం, నాజర్, అరుణ్ అదిత్ తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు.



విద్యార్థులతో మంచు లక్ష్మి..

సంక్రాంతి సంబరాలు



నటి, నిర్మాత మంచు లక్ష్మి సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్‌లోని తన నివాసంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులతో సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. టీచ్ ఫర్ ఛేంజ్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జంటనగరాల్లోని 38 ప్రభుత్వ పాఠశాలలనుండి సుమారు 50 మంది విద్యార్థినీ విద్యార్థులు మంచు లక్ష్మి నివాసంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంచు మనోజ్ కూడా పాల్గొన్నారు.

సంచలన పాత్రలో..

గ్లామర్ హీరోయిన్‌గా దాదాపు దశాబ్దకాలంపైగా దక్షిణాదిలో స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన అందాల భామ శ్రియకు ఈమధ్య క్రేజ్ తగ్గింది. దాంతో అవకాశాలు తగ్గాయి. మళ్లీ కొంత గ్యాప్ తీసుకుని సెకెండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టిన ఈమె, సెలెక్టివ్‌గా సినిమాలు చేస్తోంది. ప్రస్తుతం మోహన్‌బాబు నటిస్తున్న గాయత్రి చిత్రంలో విభిన్న పాత్రలో కన్పించనున్న శ్రియ, తాజాగా మరో అసాధారణ పాత్రలో నటించేందుకు సిద్ధమైందట. శ్రియ కెరీర్‌లో నిజంగా ఇలాంటి పాత్ర చేయలేదని అంటున్నాయి సినీ వర్గాలు. ఆ వివరాల్లోకి వెళితే.. నూతన దర్శకురాలు సృజన దర్శకత్వంలో తెరకెక్కే చిత్రంలో శ్రియ కీలక పాత్రలో కన్పించనున్నదట. ఈ చిత్రానికి మాయిస్ట్రో ఇళయరాజా సంగీతాన్ని అందించనుండగా, సాయిమాధవ్ బుర్రా డైలాగులు అందిస్తున్నాడు. పలువురు టాప్ టెక్నీషియన్లతో తెరకెక్కనున్న ఈ చిత్రం మార్చిలో మొదలుకానున్నదట. మొత్తానికి ఈ సినిమాతో శ్రియ సంచలనం సృష్టించడం ఖాయమని అంటున్నాయి సినీ వర్గాలు.



పరిణీతి చోప్రా

బంపర్ ఆఫర్

బాలీవుడ్‌లో గ్లామర్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న పరిణీతి చోప్రాకు కెరీర్ పరంగా పెద్దగా గుర్తింపు తెచ్చిన సినిమాలేవీ లేవు. ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా కూడా ఈమెకు వస్తున్న అవకాశాలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. దాంతో కాస్త గ్లామర్ డోస్ పెంచిన ఈ భామకు ఓ బంపర్ ఆఫర్ దక్కింది. బాలీవుడ్‌లో కమర్షియల్ సినిమాలతోపాటు విభిన్నమైన సినిమాలను చేస్తూ స్టార్ హీరోగా జోరుమీదున్న అక్షయ్‌కుమార్ సరసన నటించే అవకాశం కొట్టేసింది. అక్షయ్ తాజాగా పాడ్‌మెన్ చిత్రంలో నటిస్తున్నాడు. ఇప్పటికే ఆసక్తిని రేపుతున్న ఈ సినిమాతో అక్షయ్‌కు మహిళా అభిమానుల్లో ఓ రేంజ్ క్రేజ్ పెరగనుందంటూ అంటున్నాయి బి టౌన్ వర్గాలు. ఈ సినిమా తరువాత అక్షయ్ నటించే మరో క్రేజ్ ప్రాజెక్టు సెట్స్‌పైకి రానుంది. కరణ్ జోహార్, అక్షయ్‌కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనురాగ్ సిన్హా దర్శకత్వం వహిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో అదిరిపోయే రేంజ్‌లో రూపొందే ఈ చిత్రంలో పరిణితి ఛాన్స్ కొట్టేయడంతో ఆమె దశ తిరిగినట్టేనని అంటున్నారు సినీ జనాలు.